www.bharathasakthi.com

# భారత్ శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 06 | బుధవారం,జూన్ 10 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## హర్మూజ్ జలసంధి వద్ద కుప్పకూలిన అమెరికా హెలికాప్టర్!



అమెరికా సైన్యానికి చెందిన అపాచీ హెలికాప్టర్ సోమవారం హర్మూజ్ జలసంధి సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లోని ఇద్దరు సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారని, వారికి ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ధృవీకరించారు.న్యూయార్క్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ట్రంప్, “పైలట్లు క్షేమంగా ఉన్నారు, ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు” అని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన

2లో..

# జిహెచ్ఎంసీలో ‘డీజిల్’ దొంగలు..




- నిబంధనలు తుంగలో తొక్కి డిజిల్ అమ్ముకొని రూ. కోట్ల ప్రజాధనం లూటీ!
- కమిషనర్ సర్కులర్ 4089 ధిక్కరణ.. అసిస్టెంట్ ఇంజనీర్ల అవతారమెత్తిన ఫోర్‌మెన్‌లు!
- ఆన్‌లైన్ కూపన్లు ముద్రించి, నకిలీ స్టాంపులతో దొంగ అమ్మకాలు..
- ఉనికిలో లేని వాహనానికీ డీజిల్ మోత..
- కవాడిగూడ వర్క్‌షాప్‌లో నెలకు రూ. 35 లక్షల నకిలీ రిపేర్ బిల్లులు!
- కంటితుడుపుగా మారిన విజిలెన్స్..
- ‘ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్’ ఆధ్వర్యంలో ఏసీబీ విచారణకు డిమాండ్.
- ట్రై కార్పొరేషన్ స్పెషల్ అధికారి జయేష్ రంజాన్ ఐఏఎస్ చర్యలు ఎక్కడ..!
- మున్సిపల్ శాఖ మంత్రి సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి..!

**హైదరాబాద్ జూన్ 9 (భారత శక్తి ప్రతినిధి):** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి), మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎం.ఎం.సి), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సి.ఎం.సి) విభాగాల్లో ఇంధన సరఫరా మరియు వాహనాల మరమ్మత్తుల పేరుతో అక్షరాలా కోట్ల రూపాయల ప్రజాధనం పక్కదారి పడుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాలను, కమిషనర్ జారీ చేసిన స్పష్టమైన నిబంధనలను క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తిగా బేఖాతరు చేస్తున్నారు. కమిషనర్ ఆర్డర్‌ను ధిక్కరిస్తూ, నకిలీ కూపన్లు, ఫోర్జరీ సంతకాలతో సాగుతున్న ఈ ‘డీజిల్ మాఫియా’ వ్యవహారంపై ‘ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్’ సంస్థ సంచలన ఆధారాలను బయటపెట్టింది. ఉన్నతాధికారుల ముడుపుల అండతోనే ఈ సమాంతర దోపిడీ వ్యవస్థ నడుస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### కమిషనర్ సర్కులర్ నెం. 4089 భేఖాతరు!

జీహెచ్ఎంసీ పరిధిలోని వాహనాలకు ఇంధనాన్ని కేటాయించే విషయంలో మున్సిపల్ కమిషనర్ స్పష్టమైన ‘సర్కులర్ నెంబర్ 4089/జిహెచ్ఎంసి/హెచ్‌డఎస్/2025’ ను జారీ చేశారు. దీని ప్రకారం కేవలం సహాయక ఇంజనీర్లు (ఎ.ఈ) మరియు విభాగపు ఇంజనీర్లు (డి.ఈ) లాంటి

2లో..

# మీనాక్షి నటరాజన్‌కు షాక్..

### రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ..



**హైదరాబాద్ జూన్ 9 (భారత శక్తి ప్రతినిధి):** తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి ఆమె రాజ్యసభ ఎన్నికల కోసం నామినేషన్ వేయగా.. అది తిరస్కరణకు గురైంది. నామినేషన్ పత్రాలతో సమర్పించిన అఫిడవిట్‌లో ఒక పెండింగ్ కేసుకు సంబంధించిన వివరాలను పూర్తిగా వెల్లడించలేదనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి నామినేషన్ల పరిశీలన సమయంలో బీజేపీ నాయకులు రిటర్నింగ్ అధికారికి అభ్యంతరం తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఒక కోర్టు కేసు వివరాలను మీనాక్షి నటరాజన్ తన అఫిడవిట్‌లో పేర్కొనలేదని బీజేపీ ఆరోపించింది. ఈ అభ్యంతరాన్ని పరిశీలించిన అనంతరం నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. మీనాక్షి నటరాజన్ గతంలో లోక్‌సభ సభ్యురాలిగా పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఉద్రిక్తతలు నెలకొన్నాయి కాంగ్రెస్ తమ ఎమ్మెల్యేలను కర్ణాటకకు తరలించి క్రాస్ ఓటింగ్‌ను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఇక, మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ నిర్ణయాన్ని కాంగ్రెస్ సవాలు చేస్తుందా? లేదా ప్రత్యామ్నాయ వ్యూహంతో ముందుకు వెళుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.



## జోరు వానను లెక్కచేయని

# రేవంత్ రెడ్డి..

### మహిళా సంఘాలకు బస్సుల పంపిణీ

- హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం
- పరేడ్ గ్రౌండ్స్‌లో మహిళా శక్తి సభ
- వర్షంలో తడుస్తూనే వేదికపైకి సీఎం రేవంత్, మంత్రులు
- మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సుల పంపిణీ
- స్వయం సహాయక సంఘాలకు చెక్కులు అందజేత

**హైదరాబాద్ (భారత శక్తి)** హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కార్యక్రమాలను కొనసాగించారు. మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ‘మహిళా శక్తి’ మహాసభలో ఆయన పాల్గొన్నారు. కుండపోత వర్షంలోనూ తన సహచర మంత్రులతో కలిసి వేదికపైకి చేరుకున్న ముఖ్యమంత్రి, మహిళా స్వయం సహాయక సంఘాల కోసం కేటాయించిన 553 కొత్త ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. సభ జరుగుతున్న సమయంలో నగరంలో భారీ వర్షం కురిసింది. అయినప్పటికీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు వేదిక వద్దకు చేరుకున్నారు.

అనంతరం ఆయన జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన హైర్ ఛార్జీల చెక్కులను పంపిణీ చేశారు.‘ఇందిరా మహిళా శక్తి’ వంటి వినూత్న పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ పథకంలో భాగంగా మహిళా సంఘాలు కొనుగోలు చేసిన బస్సులను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు (టీఎస్ఆర్టీసీ) లీజు ప్రాతిపదికన అందజేస్తారు.

## దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

### రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్



**హైదరాబాద్ (భారత శక్తి)** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై, కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... అహంకారం, అభద్రతా భావం, తీవ్ర నిరాశతోనే రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు,

2లో..

# హైదరాబాద్‌లో భారీ వర్షం...

### - పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్



**హైదరాబాద్ (భారత శక్తి)** నైరుతి రుతుపవనాల ఆగమనానికి ముందే తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తగా, రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ ‘ఎల్లో అలర్ట్’ జారీ చేసింది. రానున్న రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, మంగళవారం రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం కూడా వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఇదే తరహా వాతావరణం కొనసాగనుంది. వర్షాలతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశిస్తున్న తరుణంలో ఈ వర్షాలు కురుస్తున్నాయి. ఇవి వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తున్నప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల నివాసితులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న భాగ్యనగరవాసులకు మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ఉపశమనం కలిగించింది. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన కుండపోత వాన కారణంగా నగరంలోని పలు ప్రాంతాలు

2లో..

## రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు ఏటీఎంలుగా మారాయి

- ధాన్యం కొనుగోలు వ్యవహారంలో ప్రభుత్వంపై రాంచందర్ రావు విమర్శలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని వ్యాఖ్య
- కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపాటు



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భువనగిరి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ధాన్యం దిగుబడుల అంచనాలను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్రానికి సరైన ఇండెంట్ పంపలేకపోయిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని, రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రమే రీయింబర్స్‌మెంట్ అందిస్తుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్త సేకరణలో

2లో..

## మేము 18 గంటలు కష్టపడుతుంటే..

### హరీష్ రావు అబద్ధాలు చెబుతున్నారు: భట్టి విక్రమార్క

- రాష్ట్ర కేబినెట్ రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తోందన్న భట్టి
- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దివాలా తీయించిందని మండిపాటు
- తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 76 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వెల్లడి



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్ఎస్ నాయకులపై, ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వరంగల్ జిల్లా చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తుంటే... హరీష్ రావు మాత్రం అబద్ధాలు ప్రచారం చేయడంలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. “రాష్ట్ర క్యాబినెట్ రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తుంటే.. హరీష్ రావు నిత్యం అబద్ధాలు చెబుతున్నారు” అని భట్టి విమర్శించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దోచుకుని, దివాలా తీయించిందని ఆయన ఆరోపించారు. మరి నాడు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సన్నబియ్యం ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వ విజయాలను ఆయన పంచుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే 76,000 ప్రభుత్వ ఉద్యోగాలు అందించిందని, రైతులకు అండగా నిలుస్తూ తడిసిన, దెబ్బతిన్న ధాన్యాన్ని కూడా

2లో..

## పీఓకేలో రక్తపాతం...

### పాక్‌పై అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవాలి: భారత్

- పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో చెలరేగిన హింస.. 30 మంది మృతి
- చౌకగా పిండి, విద్యుత్ కోరుతూ ప్రజల ఆందోళనలు
- ఘటనను తీవ్రంగా ఖండించిన భారత్
- పాక్‌ను అంతర్జాతీయ సమాజం నిలదీయాలని పిలుపు
- ప్రజలపై పాక్ బలగాల ఊచకోత అని ఆరోపణలు



పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని రావల్‌కోట్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘర్షణల్లో పౌరులు మరణించడంపై భారత్ తీవ్రంగా స్పందించింది. నిరసనకారులపై పాకిస్థాన్ సాగించిన అణచివేత చర్యలకు గానూ, ఆ దేశాన్ని అంతర్జాతీయ సమాజం జవాబుదారీని చేయాలని ఆశిస్తున్నట్లు భారత్ మంగళవారం పేర్కొంది. జూన్ 7, 8 తేదీల్లో రావల్‌కోట్‌లో భద్రతా బలగాలకు, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ)

2లో..

# జిహెచ్ఎంసిలో 'డీజిల్' దొంగలు..




ఉన్నతాధికారులు మాత్రమే ఆన్‌లైన్ డీజిల్ కూపన్లను పరిశీలించి, ఇష్యూ చేయాల్సి ఉంటుంది.కానీ క్షేత్రస్థాయిలో సీన్ రివర్స్ అయింది. వర్క్‌షాప్‌లలో పనిచేసే ఫోర్‌మెన్‌లు తామే ఉన్నతాధికారులమన్నట్లుగా అవతారమెత్తారు. ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండానే 'యాక్టింగ్ ఏఈ/డిఈ'లుగా చలామణీ అవుతూ యధేచ్ఛగా కూపన్లు జారీ చేస్తున్నారు.

**దొంగ కూపన్ల దందా.. కోట్లల్లో గండి:** ముఖ్యంగా మార్చి నెలకు సంబంధించిన ఆన్‌లైన్ డీజిల్ కూపన్లను ముందే ప్రింట్ తీసి, వాటిపై ప్రభుత్వ స్టాంపులు వేసి ఫోర్‌మెన్‌లు దొంగచాటుగా భారీ ఎత్తున అమ్ముకున్నట్లు విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది.

### ఆర్టీఓ రికార్డుల్లో లేని వాహనానికి డీజిల్ ఎలా కొట్టారు?




లేని వాహనానికి
తప్పుడు నంబర్ వేసి డీజిల్ కూపన్ ..



ఈ కుంభకోణంలో జరుగుతున్న అక్రమాలకు పరాకాష్టగా ఒక నకిలీ వాహనం ఉదంతం వెలుగుచూసింది. "ఏపీ 09 ఔ 3591" నెంబరు గల వాహనానికి జీహెచ్ఎంసీ నుంచి భారీగా డీజిల్ కూపన్లు ఇష్యూ అయ్యాయి. అయితే, రికార్డులను పరిశీలించగా అసలు ఈ నెంబరుతో కూడిన ఏ వాహనమూ ఆర్టీఓ రికార్డుల్లోనే లేదు! లేని వాహనానికి నెలకు వందల లీటర్ల డీజిల్ ఎలా కేటాయించారు? ఆ ఇంధనం ఎవరి జేబుల్లోకి వెళ్ళింది? దీని వెనుక ఉన్న ఫోర్జరీ ముఠా ఎవరు? అనేది ఇప్పుడు తేలాల్సి ఉంది.

### కవాడిగూడ వర్క్‌షాప్‌లో 'మరమ్మత్తుల' మాయాజాలం!

డీజిల్ దందా మాత్రమే కాదు, జీహెచ్ఎంసీ ట్రాన్స్‌పోర్ట్ సెక్షన్ లో అంతకు మించిన స్కామ్ నడుస్తోంది. ముఖ్యంగా కవాడిగూడ పరిధిలోని ట్రాన్స్‌పోర్ట్ సెక్షన్ లో వాహనాల రిపేర్లు మరియు మరమ్మత్తుల పేరుతో అక్రమాలకు తెరలేపారు. వాహనాలు షెడ్డులోనే మూలుగుతున్నా, కండిషన్‌లో ఉన్నా సరే.. ప్రతి నెలా దాదాపు 'రూ. 35 లక్షల దొంగ బిల్లులు' సృష్టిస్తున్నారు. ఈ నకిలీ రిపేర్ బిల్లుల ద్వారా ఏటా కోట్ల రూపాయల నిధులను అక్రమార్కులు నొక్కేస్తున్నారని ప్రధాన ఆరోపణ.

### జీపీఎస్ డేటాకు, కూపన్లకు పొంతనే లేదు!

ఆధునిక సాంకేతికత ప్రకారం ప్రతి మున్సిపల్ వాహనానికి లాగ్‌బుక్ తో పాటు జీపీఎస్ ట్రాకింగ్ ఉండాలి. వాహనం తిరిగిన కిలోమీటర్లకు, వినియోగించిన ఇంధనానికి ( కిలోమీటర్ ఫ్యూయల్ రేషియో) లెక్క సరిపోవాలి. కానీ, ప్రాథమిక ఆధారాల ప్రకారం వాహనాల జీపీఎస్ డేటాకు, ఆన్‌లైన్ కూపన్ల ద్వారా జారీ అయిన డీజిల్ పరిమాణానికి ఎక్కడా పొంతన కుదరడం లేదు. వాహనాలు రోడ్డెక్కకుండానే, కేవలం కాగితాల్లోనే వేల కిలోమీటర్లు తిరిగినట్లు చూపిస్తూ డీజిల్ ముంచేస్తున్నారు.

### విజిలెన్స్ కళ్ళు మూసిందా? ఏసీబీ విచారణకు డిమాండ్!

ఈ భారీ కుంభకోణం గత మూడేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నా.. జీహెచ్ఎంసీ విజిలెన్స్ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులకు సైతం ఈ అక్రమ రిపేర్ల స్కామ్, డీజిల్ దందాలో 'నెలవారీ మామూళ్లు' అందుతుండటం వల్లే విజిలెన్స్ విభాగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్' సంస్థ జీహెచ్ఎంసీ కమిషనర్‌కు బహిరంగ లేఖ రాస్తూ తక్షణమే స్పందించాలని డిమాండ్ చేసింది.

- ఈ వ్యవహారంపై ప్రత్యేక ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలి.
- స్టేట్ విజిలెన్స్ మరియు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కు ఈ ఆధారాలను అప్పగించి సమగ్ర విచారణ జరిపించాలి.
- నకిలీ కూపన్లు సృష్టించిన ఫోర్‌మెన్‌లపై, వారికి సహకరించిన ఉన్నతాధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.
- లూటీ చేసిన ప్రజాధనాన్ని బాధ్యుల నుంచి రికవరీ చేయాలని పౌర సమాజం ముక్తకంఠంతో కోరుతోంది.

**మరిన్ని ఆధారాలతో రేపటి కథనంలో..**

## హర్మూజ్ జలసంధి వద్ద కుప్పకూలిన అమెరికా హెలికాప్టర్!

పూర్తి వివరాలతో కూడిన అధికారిక నివేదికను మంగళవారం విడుదల చేస్తామని ఆయన తెలిపారు.ప్రపంచం చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైన ప్రాంతం. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో ఈ ప్రమాదం సంభవించడం గమనార్హం. ఇది శత్రువుల దాడి వల్ల జరిగిందా లేదా సాంకేతిక లోపం కారణంగా కుప్పకూలిందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రాంతంలో ఇరాన్ కార్యకలాపాలను నియంత్రించే విధుల్లో భాగంగానే ఈ హెలికాప్టర్ సేవలందిస్తున్నట్లు తెలుస్తోంది.

## హైదరాబాద్‌లో భారీ వర్షం...

జలమయమయ్యాయి. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, మియాపూర్, హైటెక్ సిటీ, చందానగర్, ముషీరాబాద్, లక్డీకాపూల్, సరూర్‌నగర్, కోఠి, అబిడ్స్, బషీర్‌బాగ్, ట్యాంక్ బండ్, నారాయణగూడ, హిమాయత్‌నగర్, బాగ్ లింగంపల్లి, రాంనగర్ సహా అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై నీరు నిలిచిపోయి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఈదురు గాలుల ధాటికి రాంనగర్ వీఎస్టీ రోడ్డు, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకూలడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ముషీరాబాద్‌తో పాటు నగరంలోని పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని ధ్వజ మెత్తారు. "కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందంటే అది రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీల దయాదాక్షిణ్యాల వల్లేమీ కాదు. నేను అంబర్‌పేట్, సికింద్రాబాద్ ప్రజల ఆశీస్సులతో ఢిల్లీకి వెళ్లాను. రేవంత్ రెడ్డికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. తెలంగాణ ప్రజలకు, నా నియోజకవర్గానికి, నా పార్టీకి మాత్రమే నేను జవాబుదారీని" అని స్పష్టం చేశారు.తెలంగాణ అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. "రేవంత్ రెడ్డికి దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి. ప్రెస్ క్లబ్ అయినా సరే లేదా అమరవీరుల స్తూపం ముందైనా సరే నేను చర్చకు సిద్ధం" అని ప్రకటించారు. తాను తెలంగాణకు రావాల్సిన ఏ ఒక్క ప్రాజెక్టునైనా అడ్డుకున్నానని నిరూపిస్తే తక్షణమే రాజీనామా చేస్తానని, దీనిపై సీనియర్ జర్నలిస్టులతో ఒక కమిటీని వేసి విచారణ జరిపించాలని సవాల్ విసిరారు.తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, మెట్రో ఫేజ్-2 పై సీఎం చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. తుమ్మిడిహట్టి అపాయింట్‌మెంట్ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ఆధారాలు లేని ఆరోపణలు మానేసి, పద్ధతిగా అధికారికంగా అపాయింట్‌మెంట్ కోరాలని సూచించారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ అవినీతి, తప్పుడు నిర్వహణతో మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశాయని కిషన్ రెడ్డి విమర్శించారు.

## రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు ఏటీఎంలుగా మారాయి

దాదాపు 50 శాతం తెలంగాణ నుంచే జరిగినప్పటికీ.. కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలను పక్కనబెట్టి, వాస్తవాలను దాచిపెడుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఇదే క్రమంలో పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మూసి ప్రక్షాళన ప్రాజెక్టులు సీఎం రేవంత్ రెడ్డికి 'ఏటీఎం'లుగా మారాయని రాంచందర్ రావు సంచలన ఆరోపణలు చేశారు. తాము మూసి ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, కేవలం 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుకే తమ అభ్యంతరమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని, అలాగే కాళేశ్వరం అవినీతి అంశంలో కేసీఆర్‌ను కాపాడేందుకే ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆయన ఆరోపించారు.

## మేము 18 గంటలు కష్టపడుతుంటే.. హరీష్ రావు అబద్ధాలు చెబుతున్నారు: భట్టి విక్రమార్క

కొనుగోలు చేస్తోందని తెలిపారు. అలాగే రుణమాఫీ పథకాన్ని నిలకడగా అమలు చేస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యానికి గురైన దేవాదుల ప్రాజెక్టును తాము వేగవంతం చేశామన్నారు. గత ప్రభుత్వం డిస్కమ్‌లకు బకాయిలు పెట్టడం వల్లే విద్యుత్ సమస్యలు వచ్చాయని, తాము ఆ బకాయిలను చెల్లిస్తూ విద్యుత్ సరఫరాను మెరుగుపరిచామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నామని చెప్పారు. రఘునాథపల్లిలో 230 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

## విజయవంతంగా పూర్తి అయిన జోజిలా టన్నెల్

శ్రీనగర్ లడక్ మధ్య త్వరలో నిరంతర రాకపోకలకు మార్గం సుగమం. మేఘా బ్రేక్ త్రూ లో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ. జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, మేఘా ఇంజనీరింగ్ అండ్‌ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పీ వీ కృష్ణా రెడ్డి, డైరెక్టర్ సి హెచ్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్న

## సర్ కార్యక్రమంలో పాల్గోనాలి

**- శేఖర్ కమ్ముల**

**సికింద్రాబాద్ :** ఓటు రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు అని. ప్రముఖ చిత్ర దర్శకులు శేఖర్ కమ్ముల అన్నారు. మంగళవారం పద్మారావు నగర్ లోని ఆయన నివాసంలో ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మ్యాపింగ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్ కార్యక్రమం గురించి. సనత్ నగర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఇఆర్ఓ) వివరించారు. దర్శకులు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ ప్రతి ఒక్క ఓటరు ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొనాలని, జాబితా లో తమ పేరు ఉండేలా పరిశీలన చెలుకోవడం తప్పని సరి అన్నారు.

## కార్పొరేట్ కాలేజీల ఫీజు దోపిడి అరికట్టాలి

**హైదరాబాద్** కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ, భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్ లోని హైయ్యర్ ఎడ్యుకేషన్ ముందు ఆందోళన జరిగింది. విద్యార్థులను మరియు తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ, భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర శాఖ నాయకులు, హైయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ కు వినతిపత్రం అందజేసారు.

## రామంతాపూర్లో దోపిడీ ముఠా అరెస్ట్..

**- నలుగురు రిమాండ్కు, బాలుడు సీసీఎల్ హోంకు తరలింపు**

**మేడ్చల్** ఉప్పల్ పిఎస్ పరిధిలోని రామంతాపూర్లో దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.4,000 నగదు, నేరానికి ఉపయోగించిన యాక్టివా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. జూన్ 7 అర్ధరాత్రి 1 గంట సమయంలో (తెల్లవారితే జూన్ 8) లక్ష్మీనారాయణ కాలనీకి చెందిన చంద్రశేఖర్ తన స్నేహితులతో కలిసి పెట్రోల్ కోసం వెళ్తుండగా మోడ్రన్ బేకరీ సమీపంలో నిందితులు దాడి చేసి శివకాంత్ వద్ద ఉన్న రూ.4,000 నగదును లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనలో చంద్రశేఖర్ తలకు గాయమైంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు దర్యాప్తు చేపట్టి రామంతాపూర్ డీ-మార్ట్ సమీపంలో నిందితులను పట్టుకున్నారు. విచారణలో రాత్రివేళ ఒంటరిగా వెళ్లే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నట్లు తేలింది. అరెస్టైన నలుగురు నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. కేసులో ఉన్న బాలుడిని సీసీఎల్ హోంకు తరలించారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని అధికారులు అభినందించారు.

## రామంతాపూర్లో దోపిడీ ముఠా అరెస్ట్..

**- నలుగురు రిమాండ్కు, బాలుడు సీసీఎల్ హోంకు తరలింపు**

**మేడ్చల్** ఉప్పల్ పిఎస్ పరిధిలోని రామంతాపూర్లో దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.4,000 నగదు, నేరానికి ఉపయోగించిన యాక్టివా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. జూన్ 7 అర్ధరాత్రి 1 గంట సమయంలో (తెల్లవారితే జూన్ 8) లక్ష్మీనారాయణ కాలనీకి చెందిన చంద్రశేఖర్ తన స్నేహితులతో కలిసి పెట్రోల్ కోసం వెళ్తుండగా మోడ్రన్ బేకరీ సమీపంలో నిందితులు దాడి చేసి శివకాంత్ వద్ద ఉన్న రూ.4,000 నగదును లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనలో చంద్రశేఖర్ తలకు గాయమైంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు దర్యాప్తు చేపట్టి రామంతాపూర్ డీ-మార్ట్ సమీపంలో నిందితులను పట్టుకున్నారు. విచారణలో రాత్రివేళ ఒంటరిగా వెళ్లే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నట్లు తేలింది. అరెస్టైన నలుగురు నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. కేసులో ఉన్న బాలుడిని సీసీఎల్ హోంకు తరలించారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని అధికారులు అభినందించారు.

## యాక్సిడెంట్‌లో గాయపడిన టీడీపీ కార్యకర్తను పరామర్శించిన డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు

**బద్వేలు** బద్వేల్ పట్టణం 4వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త వంకెల శ్రీనివాసులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి మంగళవారం ఆయనను పరామర్శించారు.శ్రీనివాసులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సూర్యనారాయణ రెడ్డి గారు, ఆయనకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అవసరమైన వైద్య సేవలు అందేలా చూసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తల సంక్షేమమే తమకు ముఖ్యమని, కష్టసుఖాల్లో కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. శ్రీనివాసులు పూర్తిగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డబ్బులు ఇచ్చుకో... నకిలీ పట్టా పుచ్చుకో..!

**- తిమ్మందొడ్డి గ్రామంలో నకిలీ ఇంటి పట్టాల కలకలం?**

**- అధికార పార్టీ గ్రామ నాయకుడే సూత్రధారి అంటూ ఆరోపణలు**

**- చనిపోయిన వ్యక్తి పేరుతోనూ పట్టాల సృష్టి!?**

**- నిద్రమత్తులో రెవెన్యూ అధికారులు**

**- బాధితుల తీవ్ర ఆగ్రహం**

**సి.బెళగల్** కర్నూలు జిల్లా సి.బెళగల్ మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో నకిలీ ఇంటి పట్టాల వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రభుత్వ భూములే లక్ష్యంగా, అమాయక ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని లక్షలాది రూపాయల చేతులు మారుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "డబ్బులు ఇచ్చుకో.. నకిలీ పట్టా పుచ్చుకో" అనే చందంగా గ్రామంలో బహిరంగంగానే భూ అక్రమాలు జరుగుతున్నాయని గ్రామస్తులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

ప్రభుత్వ స్థలాలను అడ్డగోలుగా ఆక్రమించేందుకు కొందరు రాజకీయ నాయకులు, దళారులు చేతులు కలిపి నకిలీ పత్రాలను సృష్టిస్తున్న తీరు స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది.అసలు వివాదం ఏమిటి??గ్రామానికి చెందిన తెలుగు వెంకటేశ్వరమ్మ అనే మహిళకు గతంలో ప్రభుత్వం న్యాయబద్ధంగా ఇంటి పట్టా మంజూరు చేసింది. ఆర్‌సీ నెం. 135/85 కింద 20 ఫిబ్రవరి 1999న ఆమెకు 240-బి ప్లాట్‌ను ప్రభుత్వం కేటాయించింది. అప్పటి నుండి ఆ స్థలంపై ఆమె సర్వహక్కులు కలిగి ఉన్నారు. అయితే, ఇటీవల కాలంలో ఆ స్థలంపై కొందరు అక్రమార్కుల కన్ను పడింది. అదే స్థలానికి బెస్త పెద్ద వెంకటరాముడు అనే వ్యక్తి పేరుతో మరొక నకిలీ పట్టాను సృష్టించి, తెలుగు వెంకటేశ్వరమ్మకు చెందిన స్థలాన్ని అక్రమంగా కబ్జా చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో బాధితురాలు ఆందోళనకు గురై న్యాయం కోసం గళమెత్తారు.? మరణించిన వ్యక్తి పేరిట పట్టా ఎలా వచ్చింది??ఈ నకిలీ పట్టాల వ్యవహారంలో ఒక విస్తుపోయే నిజం వెలుగులోకి వచ్చింది.

బాధితురాలు తెలుగు వెంకటేశ్వరమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఏ వ్యక్తి పేరునైతే ఇప్పుడు నకిలీ పట్టా సృష్టించారో, ఆ బెస్త పెద్ద వెంకటరాముడు అనే వ్యక్తి 1980 సంవత్సరంలోనే మరణించారు.?"1980లోనే మరణించిన వ్యక్తి పేరుపై, తిరిగి 1999లో ప్రభుత్వ ఇంటి పట్టా ఎలా మంజూరు అవుతుంది? మరణించిన వ్యక్తి వచ్చి దరఖాస్తు చేసుకున్నాడా? లేక అధికారులు వచ్చి ఆయన సమాధి దగ్గర పట్టా ఇచ్చారా? దీనికి రెవెన్యూ అధికారులే సమాధానం చెప్పాలి" అని బాధితురాలు నిలదీశారు.?ఈ ఒక్క ఉదాహరణ చాలు గ్రామంలో ఏ స్థాయిలో నకిలీ పట్టాల దందా సాగుతుందో అర్థం చేసుకోవడానికి అని స్థానికులు పేర్కొంటున్నారు. సూత్రధారి ఆయనే.. గ్రామస్తుల సంచలన ఆరోపణలు?తిమ్మందొడ్డి గ్రామంలో సాగుతున్న ఈ నకిలీ పట్టాల దంద వెనుక ఓ బలమైన రాజకీయ హస్తం ఉందని గ్రామస్తులు నేరుగా ఆరోపిస్తున్నారు. గ్రామంలో అధికార పార్టీ నాయకుడిగా చలామణి అవుతున్న బి. సూర్యచంద్ర అనే వ్యక్తి ఈ వ్యవహారానికి ప్రధాన సూత్రధారి అని విమర్శలు వస్తున్నాయి.?అక్రమాల తీరు ఇలా ఉంది:?గ్రామంలో ఎక్కడైనా ప్రభుత్వ ఖాళీ స్థలాలు ఉంటే చాలు, వాటిపై ఈ నాయకుడు కన్నేస్తాడు.?నిరుపేదలు, అమాయక ప్రజలను నమ్మించి, "మీకు ప్రభుత్వ స్థలం ఇప్పిస్తాం" అంటూ ఆశ చూపుతాడు.?ఒక్కో ఇంటి పట్టా సృష్టించడానికి రూ. 30 వేల నుండి రూ. 50 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## పీఓకేలో రక్తపాతం..

మద్దతుదారులకు మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు జరిగాయి. ఈ హింసాకాండలో ఆరుగురు నిరసనకారులు, నలుగురు పోలీసులు, ఒక సామాన్య పౌరుడితో సహా 30 మంది మరణించగా, 200 మందికి పైగా గాయపడ్డారు. సరసమైన ధరలకు గోధుమ పిండి, విద్యుత్ సరఫరా చేయాలని, రాజకీయ హక్కులు కల్పించడంతో పాటు తమ ప్రాంతంపై చూపుతున్న వివక్షను అంతం చేయాలని డిమాండ్ చేస్తూ జేఏఏసీ అనే పౌర సమాజ కూటమి ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే నిరసనలు ఉద్రిక్తంగా మారి హింసకు దారితీశాయి. నిరసనకారులే ముందుగా కాల్పులు జరిపారని, అందుకే తాము ఆత్మరక్షణ కోసం స్పందించాల్సి వచ్చిందని పాకిస్థాన్ అధికారులు చెబుతున్నారు. అయితే, భద్రతా బలగాలే తమపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి ఊచకోతకు పాల్పడ్డాయని జేఏఏసీ నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియాలో మృతుల సంఖ్య 150 నుంచి 200 వరకు ఉండవచ్చని వదంతులు వ్యాపిస్తున్నప్పటికీ, ప్రభుత్వం కమ్యూనికేషన్ వ్యవస్థలపై ఆంక్షలు విధించడంతో వాస్తవాలను ధృవీకరించడం కష్టంగా మారింది. ఈ ఘటనపై బ్రిటన్‌లోని ప్రవాస కశ్మీరీలు పాకిస్థాన్ కాన్సులేట్ వద్ద నిరసనలు చేపట్టారు. ప్రస్తుతం పీఓకేలో బంద్ కొనసాగుతుండగా, ముజఫరాబాద్, భీంబర్, మీర్‌పూర్ వంటి ప్రాంతాల్లో పరిస్థితులు ఇంకా ఉద్రిక్తంగానే ఉన్నాయి.

## ప్రయాణికులకు తప్పని తిప్పలు




**సి.బెళగల్,** మంత్రాలయం నుంచి కర్నూలు జిల్లా కేంద్రానికి రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఇసుక టిప్పర్ వాహనాల నిరంతర రాకపోకల వల్ల రహదారులు పూర్తిగా దెబ్బతిని, ప్రయాణం నరకప్రాయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాత్రి, పగలు తేడా లేకుండా భారీ సంఖ్యలో ఇసుక టిప్పర్ వాహనాలు సంచరిస్తుండటంతో రోడ్ల పరిస్థితి రోజురోజుకు అధ్వాన్నంగా మారుతోంది. ఈ సమస్యపై సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామాల్లో నియమితులైన ప్రత్యేక అధికారులు ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.సి.బెళగల్ మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామం వద్ద పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇసుక వాహనాల అధిక రద్దీ కారణంగా బీటీ రహదారి మొత్తం గుంతలమయంగా మారిపోయింది. రహదారిపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, ఆటో ప్రయాణికులు, బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలను తప్పించుకునే క్రమంలో ప్రమాదాల బారిన పడే పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయి.విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసర పనుల నిమిత్తం ప్రయాణించే ప్రజలు ప్రతిరోజూ అవస్థలు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారులను వెంటనే మరమ్మతు చేయడంతో పాటు, ఇసుక వాహనాల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని రహదారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

# సంపాదకీయం

భారతశక్తి
VOICE OF INDIAN

## మోడీ సరికొత్త రికార్డ్...

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తాజాగా సరికొత్త రికార్డు సృష్టించారు. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన ప్రధాన మంత్రిగా ఇప్పటి వరకు ఉన్న అన్ని రికార్డులను ఆయన తిరగరాశారు. దేశంలో ఒక్క ఒక్కడుగా ఆయన చరిత్ర సృష్టించారు. గతంలో మాజీ ప్రధాని ఇందిర పేరిట ఉన్న రికార్డును కొన్నాళ్ల కిందట అధిగమించిన మోడీ.. ప్రస్తుతం ఆమె తండ్రి, భారత తొలిప్రధాన మంత్రి చాచా నెహ్రూను కూడా పాలనలో అధిగమించారు. దేశానికి ప్రధాన మంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన నాయకుడిగా మోడీ సంచలన రికార్డును సొంతం చేసుకున్నారు.ఈ నెల 10వ తేదీ నాటికి.. మోడీ.. దేశానికి ఎక్కువ కాలం ప్రధానిగా పనిచేసి నేత చరిత్ర సృష్టించనున్నారు. భారతదేశ రాజకీయ, పరిపాలనా చరిత్రలో 2026 జూన్ 10 ఒక సువర్ణ అధ్యాయంగా లిఖించబోతుంది. దేశాన్ని నిరంతరాయంగా అత్యధిక కాలం పాలించిన తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న చారిత్రక రికార్డును ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజున అధికారికంగా అధిగమించనున్నారు.2014 మే 26న తొలిసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. ఇప్పటి వరకు నిరాఘాటంగా ఆ పదవిలోనే ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో దేశవ్యాప్తగా బీజేపీ ప్రభంజనం సృష్టించి.. మోడీ ప్రధాని అయ్యే అవకాశం కల్పించింది. ఇక, 2024లో బీజేపీకి ఒంటరిగా సీట్లు తగ్గినప్పటికీ.. మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూ, జనసేన సహా.. అనేక చిన్నా చితకా పార్టీల మద్దతుతో మోడీ ముచ్చటగా మూడోసారి ప్రధాని పీఠాన్ని అలంకరించారు 12 ఏళ్లలో తమ ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం ప్రముఖంగా ప్రస్తావించారు. భారతదేశం అనేక పరివర్తనలకు సాక్ష్యంగా నిలిచిందని, ఈ మార్పుల్లో ప్రధానమైనది పేద, అణగారిన వర్గాల ప్రజల సంక్షేమేనని అన్నారు. ప్రధాని మోడీ వరుసగా మూడో సారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ, స్వచ్ఛ భారత్, పిఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాలను ఉదహరించిన మోడీ, ప్రజలకు గౌరవం, అవకాశాలు దక్కేందుకు తమ ప్రభుత్వం సర్వశక్తులు ఒడ్డుతుందన్నారు. తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ 'అంత్యోదయ' నుండి ప్రేరణ పొందిందని, దశాబ్దాలుగా వెనుకబడిన వారికి అభివృద్ధి ద్వారా వచ్చే ప్రయోజనాలు చేరేలా చూడటమే తమ లక్షమని ప్రధాని అన్నారు. పేదలకు మెరుగైన జీవన నాణ్యతను అందించడంలో సాంకేతికత కీలక పాత్ర పోషించడం కూడా ఆనందంగా ఉందన్నారు. లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు, డిజిటల్ వేదికల ద్వారా మద్దతు ప్రజలకు ప్రత్యక్షంగా, పారదర్శకంగా చేరుతోందన్నారు. 'ఇది లీకేజీలను తగ్గించింది, సామర్థ్యాన్ని మెరుగుపరిచింది మరియు పాలనపై నమ్మకాన్ని బలోపేతం చేసింది. ఈ విధంగా 'గరీబ్ కల్యాణ్' ను ముందుకు తీసుకెళ్లే ప్రయాణం మానవ సాధికారత దిశగా, మన వికసిత్ భారత్ కలను సాకారం చేసే దిశగా సమిష్టి ఉద్యమంగా మారింది' అని ప్రధాని పేర్కొన్నారు. 2024 పార్లమెంటరీ ఎన్నికలలో విజయం సాధించిన తరువాత, జూన్ 9,2024న మోడీ వరుసగా మూడోసారి దేశ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2014 మే 26న తొలిసారిగా ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన రెండవ పదవీకాలం 2019 మే 30న ప్రారంభమైంది.గతంలోనూ మూడు సార్లు ప్రధాని అయిన వారు ఉన్నా.. వరుసగా.. ప్రధాని కావడం, సుదీర్ఘకాలం వరుసగా పాలన సాగించే విషయాల్లో మోడీనే ఫస్ట్ నిలిచారు. 2014, మే 26న తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోడీ నెల 10వ తేదీ నాటికి వరుసగా 4,399 రోజుల పాలనను పూర్తి చేసుకోనున్నారు. ఇది దేశంలోనే అత్యధిక రికార్డు.1952.. మే 13న దేశ తొలి ప్రధానిగా నెహ్రూ ప్రమాణం చేశారు.

ఆయన 1964, మే 27న మరణించే వరకు వరుసగా 4,398 రోజుల పాటు ఆ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును మోడీ తోసిపుచ్చి.. తానే సరికొత్త రికార్డును సృష్టించారు. బుధవారం నాటికి మోడీ 4,399 రోజులపాటు వరుసగా పీఎం సీటులో కూర్చున్న ఏకైక నేతగా నిలిచారు.ఇక, ఇందిరమ్మ విషయానికి వస్తే.. మధ్యలో ఓడినా.. మొత్తంగా 4077 రోజుల పాటు భారత దేశానికి ఏకైక మహిళా ప్రధానిగా పనిచేశారు. అయితే.. ఈ రికార్డును గత ఏడాదే మోడీ అధిగమించారు. 2025, జులై 25న 4,078 రోజుల నిరంతరాయ పాలన రికార్డును మోడీ నమోదు చేయడం గమనార్హం. భారతదేశం 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షల దేశం. మన యువ జనాభా, పెరుగుతున్న మధ్యతరగతి, విస్తరిస్తున్న మౌలిక సదుపాయాలు భారతదేశ వృద్ధికి చోదక శక్తులుగా ఉన్నాయి. గత 12 సంవత్సరాలుగా, భారతదేశం 'సంస్కరించు, సాధించు, పరివర్తన చెందు' అనే నినాదంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రభుత్వ రాజకీయ సంకల్పంతో, ఈ సంస్కరణల రథం పూర్తి వేగంతో దూసుకుపోతోంది. నేడు భారతదేశానికి ప్రతిష్ట, విస్తృతి, డిమాండ్, స్థిరత్వం, అన్నింటికంటే ముఖ్యంగా 140 కోట్ల మంది భారతీయుల సంకల్పం ఉన్నాయి. అందువల్ల, సంకల్పంతో కూడిన పెట్టుబడుల వైపు అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఇక ఇప్పటి వరకు ప్రధాని మోదీ 44 అంతర్జాతీయ గుర్తింపులు సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో ఏదేశాధినేతకు దక్కని గౌరవం నరేంద్ర మోదీకి దక్కింది.కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశానికి పునాదులు వేయడం నెహ్రూ కాలపు అవసరమైతే.. భారీ ప్రభుత్వ ప్రణాళికల నుండి చురుకైన, సాంకేతికత ఆధారిత పంపిణీ వ్యవస్థ ద్వారా భారతదేశాన్ని ఒక అంతర్జాతీయ ఆర్థిక శక్తిగా నిలపడం ప్రధాని మోదీ పదవీకాలపు ముఖ్య లక్షణంగా నిలిచింది. 2026 బుధవారం మోదీ దాటనున్న ఈ చారిత్రాత్మక మైలురాయి, ఇరవై ఒకటవ శతాబ్దపు నవ భారత పరిపాలనకు ఒక స్పష్టమైన నిర్వచనాత్మక నమూనా.ఇదిలావుంటే.. మోడీ సాధించిన ఈ రికార్డును అధిగమించే పరిస్థితి కనుచూపు మేరలో ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం.

# పాఠశాలల ప్రారంభానికి ముందే అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలి

### - జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 9 (భారత శక్తి): ప్రతి పాఠశాలలో 10 శాతం విద్యార్థుల ప్రవేశాల పెరుగుదల సాధించాలని,జీరో విద్యార్థుల పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, పాఠశాలల ప్రారంభానికి ముందే అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. 2026-27 విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు పెంపు, విద్యా నాణ్యత మెరుగుదల, ఎఫ్ ఎల్ ఎన్ మిషన్, ఎఫ్ ఆర్ ఎస్ హాజరు, బడిబాట కార్యక్రమం నిర్వహణ, పాఠశాలల పునఃప్రారంభ ఏర్పాట్లపై మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పాఠశాల, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యాశాఖ అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పాఠశాలలో 10 శాతం మేర విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేస్తూ బడిబాట కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని జీరో పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థుల నమోదుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల వారీగా పాఠశాల వయస్సు పిల్లలను గుర్తించి వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలాల వారీగా పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య, కొత్తగా నమోదైన విద్యార్థుల వివరాలు, బడిబాట కార్యక్రమం పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రవేశాల పెంపు కోసం ప్రతి పాఠశాల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ మిషన్‌ను సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల్లో ప్రాథమిక చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పాఠశాలను విద్యాశాఖ అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, బోధన, హాజరు, మౌలిక సదుపాయాల పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విధుల నిర్వహణలో సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోపు తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం, శానిటేషన్, విద్యుత్, ఫర్నిచర్, పరిశుభ్రత తదితర అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన విద్యా వాతావరణం కల్పించాలని అన్నారు. చిన్నబోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 12 మంది నుంచి 120 మందికి పైగా పెంచడంలో విశేష కృషి చేసిన కానిస్టేబుల్ ధూపాటి సతీష్, గ్రామ సర్పంచ్‌ను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించి నమోదు సంఖ్యను గణనీయంగా పెంచడం అభినందనీయమని పేర్కొన్నారు. వారి కృషి జిల్లాలోని ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థుల నమోదు పెంపు, విద్యా నాణ్యత అభివృద్ధి, పాఠశాలల సమగ్ర అభివృద్ధికి ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి,ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కొప్పుల మల్లేశం, డి ఎమ్ హెచ్ ఓ గోపాలరావు, మున్సిపల్ కమిషనర్ సంపత్, డిఐఈఓ,అన్ని మండలాల ఎంఈఓ లు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం.

- దేవాదుల ప్రాజెక్టుతో నియోజకవర్గంలో లక్ష ఎకరాలు సాగులోకి.
- ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక వరి ధాన్యం దిగుబడి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోనే..
- కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసాం





జనగామ (భారత శక్తి) జూన్ 9: రఘునాథపల్లి 132/33కేవి సబ్ స్టేషన్ ను 220/132 కేవి సబ్ స్టేషన్ గా అప్ గ్రేడ్ చేయాలని, ఇళ్లపై నుండి వెళ్తున్న సర్వీస్ లైన్ల షిఫ్టింగ్ కు నిధులు కేటాయించాలని, ఈ ఆర్థిక సంవత్సరం కూడా ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ నిధులు కలిపి మంజూరు చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో సబ్ స్టేషన్ల నిర్మాణంతో లో వొల్టేజ్ సమస్యలు తీరడంతో పాటు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వచ్చి వెలుగులు విరజిల్లనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో రూ. 60.62 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదటి సారి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి గారికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గారు ఘన స్వాగతం పలికారు. అనంతరం పల్లగుట్ట క్రాస్ నుండి పల్లగుట్ట వరకు ర్యాలీగా వెళ్లి సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా 132/33 కేవీ పీచర సబ్ స్టేషన్ -- రూ. 43.92 కోట్లు, వేలేరు మండలంలోని పీచరలో 2ఇ10/16 ఎంవీఏ సామర్థ్యంతో నిర్మించిన 132/33 కేవీ సబ్ స్టేషన్‌ను, 33/11 కేవీ కొండాపూర్ సబ్ స్టేషన్ - రూ.2.50 కోట్లు, 33/11 కేవీ సాగరం సబ్ స్టేషన్ -- రూ.2.29 కోట్లు, 33/11 కేవీ కుర్చపల్లి సబ్ స్టేషన్ - రూ.2.25 కోట్ల వ్యయంతో చేపట్టిన సబ్ స్టేషన్లను ప్రారంభించారు. అలాగే చిల్పూర్ మండల పరిధిలో రూ. 9.66 కోట్ల వ్యయంతో మూడు నూతన 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణానికి, పల్లగుట్ట 33/11 కేవీ సబ్ స్టేషన్ - రూ. 3.25 కోట్లు, లింగంపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ - రూ. 2.81 కోట్లు, నష్కల్ 33/11 కేవీ సబ్ స్టేషన్ -- రూ. 3.60 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సబ్ స్టేషన్లకు ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అదే విధంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో 107 స్వయం సహాయక సంఘాల మహిళలకు స్త్రీ నిధి రుణాల కింద రూ. 3,07,00,000, అలాగే బ్యాంకు లింకేజ్ కింద 407 స్వయం సహాయక సంఘాల రూ. 32,89,96,000 చెక్కులను మహిళలకు అందజేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించి తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఈ సబ్ స్టేషన్లు ఎంతో కీలకమని తెలిపారు. ఒకప్పుడు వలసలకు కేంద్రంగా ఉన్న స్టేషన్ ఘనపూర్ ప్రాంతం దేవాదుల ప్రాజెక్టు, ఉచిత విద్యుత్ వల్ల లక్ష ఎకరాలు సాగులోకి వచ్చి 2లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించిందని తెలిపారు. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రఘునాథపల్లి మండల కేంద్రంలోని 132/33 కేవీ సబ్ స్టేషన్‌ను 220/132 కేవి సబ్ స్టేషన్ గా అప్‌గ్రేడ్ చేయాలని, చాలా గ్రామాలలో గృహాలపై నుండి వెళ్తున్న 33/11 కేవి, సర్వీస్ లైన్ల షిఫ్టింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గారిని కోరారు. అలాగే గతంలో ఇచ్చిన మాదిరి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను కలిపి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఒకే సారి 60.62కోట్ల నిధులతో 7సబ్ స్టేషన్లకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క గారికి నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి, తెలంగాణ హజ్ కమిటీ ఛైర్మన్ ఖుస్రో పాషా, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల నియోజకవర్గం శాసనసభ్యులు రేవురి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గం శాసనసభ్యులు కె.ఆర్ నాగరాజు, భూపాలపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు, పాలకుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు మామిడాల యశస్వినీ రెడ్డి, కుడా ఛైర్మన్, డిసిసి అధ్యక్షులు, హనుమకొండ జిల్లా ఇనుగాల వెంకట్రాం రెడ్డి, డిసిసి అధ్యక్షురాలు, జనగామ జిల్లా లకావత్ ధన్వంతి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, సియండి ట్రాన్స్‌కో డి. కృష్ణ భాస్కర్, సియండి టీజీఎన్‌పిడిసిఎల్ కర్నాటి వరుణ్ రెడ్డి, కమీషనర్ ఆఫ్ పోలీసు సన్ ప్రీత్ సింగ్, డిసిపి రాజ మహేంద్ర నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మారుజోడు రాంబాబు, స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ ఛైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ గుట్ట దేవస్థానం, ఛైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, పల్లగుట్ట గ్రామం సర్పంచ్ ఎనగందుల నర్సింహా రెడ్డి, సాగరం సర్పంచ్ మమత చేతన్, కొండాపూర్ సర్పంచ్ గుగులోత్ దేవేందర్, కుర్చపల్లి సర్పంచ్ బైకాని రాజు, నష్కల్ సర్పంచ్ రాజు, ఇతర నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి నెల 9న ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ జిల్లా క్యాంపులు

**- హైరిస్క్ గర్భాలపై ప్రత్యేక దృష్టి: డిఎంహెచ్ఓ**




సూర్యాపేట, భారతశక్తి జిల్లా ప్రతినిధి, జూన్ 9: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో ప్రతి నెల 9వ తేదిన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. పెండెం వెంకట రమణ తెలిపారు.గర్భిణీ స్త్రీలకు ప్రధానంగా హైరిస్క్ గర్భాలను ముందుగానే గుర్తించి, తగిన వైద్య పరీక్షలు, చికిత్స, పర్యవేక్షణ అందించడం.రక్తపోటు, రక్తహీనత, మధుమేహం వంటి పరీక్షలు చేసి అవసరమైన వైద్య సలహాలు, మందులు ఇవ్వడం.ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది తమ పరిధిలో గర్భిణీలను గుర్తించి పీఎం ఎస్ఎంఎస్ సేవలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలి.ముఖ్యంగా 2వ, 3వ త్రైమాసికంలో ఉన్న గర్భిణీలు తప్పనిసరిగా సమీప ప్రభుత్వ ఆరోగ్య సంస్థను సంప్రదించి ఉచిత వైద్య సేవలు పొందాలి.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న ఉచిత గర్భిణీ సేవలను సద్వినియోగం చేసుకొని తల్లి, శిశు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డిఎంహెచ్ఓ కోరారు.

# చోరికి గురైన 108 సెల్ ఫోన్ల రికవరీ

- **పన్నెండు లక్షల తొంబై ఆరువేల రూపాయల విలువ గల ఫోన్లను బాధితులకు అందజేత**
- **మొబైల్ ఫోన్ పోయిన, చోరికి గురైనా www.ceir.gov.in లో రిజిస్టర్ చేసుకోవాలి.**
- **సెకండ్ హ్యాండ్ మొబైల్స్ లో చోరీ ముఠాలను గుర్తించాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆదేశం**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 09(భారత శక్తి) ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆదేశనుసారంగా, నిర్మల్ పోలీసులు మొబైల్ దొంగతనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి CEIR పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించి 108 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. సెల్ ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని CEIR ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోగొట్టుకున్న, చోరి గురైన 108 మొబైల్ ఫోన్లు (పన్నెండు లక్షల తొంబై ఆరువేల రూపాయల విలువ గల ఫోన్లను) స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల మాట్లాడుతూ మొబైల్ వినియోగదారులతో మాట్లాడుతూ మొబైల్స్ ఎలా పోగొట్టుకున్నారు అని అడిగి తెలుసుకున్నారు.కావున వినియోగ దారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి CEIR వెబ్సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.CEIR వెబ్సైట్లో వినియోగదారులు సంబంధిత పోలీస్ స్టేషన్ లో వారి వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్ ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరగిందని అన్నారు. ఈ సందర్భంగా మొబైల్ పోగొట్టుకున్న వినియోగ దారులు, ఫోన్ దొరికినందుకు చాలా సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.కు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2250 శ్రీ ఫోన్లు (సుమారుగా రెండు కోట్ల డెబ్బై లక్షల రూపాయల రూపాయల విలువ గల ఫోన్లను) రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందని అన్నారు. సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ల కొనుగోలు, విక్రయాలపై కఠినంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు.వినియోగ దారులు,సెకండ్ హ్యాండ్ మొబైల్స్ కొనేటప్పుడు అవి ఎక్కడి నుండి వచ్చినవి, చోరీకి గురైనవో కాదో సరిచూసుకోవాలని, అనుమానం ఉన్న ఫోన్లను కొనరాదని తెలిపారు. అంతేకాకుండా ఒకే వ్యక్తి వద్ద లేదా కొద్ది మంది వద్ద పెద్ద సంఖ్యలో మొబైల్స్ దొరికితే, వారు ఏదైనా చోరీ ముఠా లేదా అనుమానాస్పద కార్యకలాపాలలో భాగమా అనే దానిపై సమగ్ర విచారణ చేయాలని పోలీసు అధికారులకు ప్రత్యేక సూచనలు ఇచ్చారు. CEIR ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.ఎవరికైనా సెల్ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు.ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటి కోర్ సిబ్బందిని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, అభినందించారు.ఈ మొబైల్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయి పట్టివేత ఇద్దరు నిందితుల అరెస్ట్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 09: కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి శ్రీ బి. హన్మంతరావు ఆదేశాల మేరకు, మంగళవారం కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ అధికారులు రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. సంబల్పూర్ నుండి నాందేడ్ వెళ్లే 'నాగవలి ఎక్స్‌ప్రెస్' (ట్రైన్ నంబర్: 20809) లో తనిఖీలు చేస్తుండగా. ఇద్దరు అనుమానాస్పద వ్యక్తులు పట్టుబడ్డారు. తనిఖీ చేయగా వారి వద్ద నుండి 10 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. నిందితులు మహారాష్ట్రలోని జాల్నా జిల్లాకు చెందిన సునీల్, ప్రవీణ్. రవాణా మార్గం నిందితులు ఒడిశాలోని రాయగడలో ఈ ఎండు గంజాయిని కొనుగోలు చేసి, మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుబడినట్లు కామారెడ్డి ఎక్సైజ్ సీఐ సీహెచ్. సంపత్ కృష్ణ తెలిపారు. నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విజయవంతమైన తనిఖీలలో ఎక్సైజ్ సీఐ సీహెచ్. సంపత్ కృష్ణ, ఎస్ఐ ఎమ్. విక్రమ్ కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు జాన్, బలవంతరావు, ఫరూఖ్, సిబ్బంది రాజు, పవన్ రెడ్డి, బాబు, శరత్, వందన తదితరులు పాల్గొన్నారు.

# కోర్టుకు హాజరుకాని నిందితుల అరెస్ట్

**-జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలింపు..**

**సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ వెల్లడి.**



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 9: సిరిసిల్లలో నమోదైన ఓ చీటింగ్ కేసులో పర్సనల్ బాండ్‌పై విడుదలై, ఆ తర్వాత కోర్టు విచారణకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు ఏనుగు పనింధర్, ఆడెపు రజితలను పట్టుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... గత ఏడాది డిసెంబర్ 5న నమోదైన ఓ చీటింగ్ కేసులో నిందితులను అప్పట్లో కోర్టులో హాజరుపరిచారు. నిర్ణీత గడువులోగా కోర్టుకు సూరిటీలు జామీనుదారులు సమర్పించాలనే షరతుపై వారిని పర్సనల్ బాండ్‌పై విడుదల చేశారు. అయితే, నిందితులు గడువు ముగిసినా సూరిటీలు సమర్పించకపోగా, గత ఆరు నెలలుగా కోర్టు విచారణకు హాజరుకాకుండా ముఖం చాటేశారు. దీంతో వారిపై న్యాయస్థానం నాన్-బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. ఈ నేపథ్యంలో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు సోమవారం కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి వారికి జైలు శిక్ష రిమాండ్ ఖరారు చేశారు. ప్రస్తుతం రిమాండ్‌కు వెళ్లిన ఈ ఇద్దరు నిందితులపై గతంలో తప్పుడు సూరిటీలు చూపించి బెయిల్ పొందినట్లు మరొక కేసు కూడా నమోదైందని, అది ప్రస్తుతం విచారణలో ఉందని ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కోర్టుల్లో సమర్పించే సూరిటీ పత్రాలను తాము క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా చట్టాన్ని తప్పుదోవ పట్టిస్తూ నకిలీ, తప్పుడు సూరిటీలు సమర్పించినట్లు తేలితే వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు.

# టీజీఈఏపీసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల.

## -జూన్ 19 నుంచి ఇంజనీరింగ్ ప్రవేశాలు.

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 9: తెలంగాణలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీఈఏపీసెట్ (ఎం+జూఫ్రాజఙు)-2026 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టరెడ్డి నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఈ తేదీలను ఖరారు చేశారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, కౌన్సెలింగ్ కన్వీనర్ ఎ. శ్రీదేవసేన ప్రకటించిన వివరాల ప్రకారం.. ప్రవేశాల ప్రక్రియ మొత్తం మూడు విడతల్లో జరగనుంది. ఆగస్టు 1వ తేదీ నుంచి ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి.

### మొదటి విడత ప్రవేశాల షెడ్యూల్.

కౌన్సెలింగ్ ప్రక్రియ జూన్ 19 నుంచి ప్రారంభం కానుంది. మొదటి విడతలో భాగంగా జూన్ 19 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచార నమోదు, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికేట్ వెరిఫికేషన్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు జూన్ 22 నుంచి 29 వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుంది. సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు జూన్ 25 నుంచి జూలై 1 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. జూలై 1న ఆప్షన్లను ఫ్రీజ్ చేస్తారు. విద్యార్థుల అవగాహన కోసం జూలై 4న లేదా అంతకుముందు మాక్ సీట్ల కేటాయింపును ప్రదర్శిస్తారు. ఆప్షన్లలో ఏవైనా మార్పులు ఉంటే జూలై 5 నుంచి 7 వరకు సవరించుకోవచ్చు. మొదటి విడత తుది సీట్ల కేటాయింపు జూలై 10న లేదా అంతకుముందు జరుగుతుంది. సీట్లు పొందిన అభ్యర్థులు జూలై 10 నుంచి 14 లోపు ట్యూషన్ ఫీజు చెల్లించి, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.

### రెండో విడత మరియు కాలేజీల్లో రిపోర్టింగ్.

మొదటి విడతలో పాల్గొనని వారికి జూలై 17న స్లాట్ బుకింగ్, జూలై 18న సర్టిఫికేట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు. జూలై 18, 19 తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. ఈ విడతలో పాత ఆప్షన్లు పరిగణనలోకి తీసుకోరని, కొత్తగా ఆప్షన్లు ఇవ్వడం తప్పనిసరి అని కన్వీనర్ స్పష్టం చేశారు.

రెండో విడత సీట్లను జూలై 22న లేదా అంతకుముందు కేటాయిస్తారు. సీట్లు వచ్చిన వారు జూలై 22 నుంచి 24 లోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్ట్ చేయాలి. అనంతరం జూలై 25 నుంచి 28 లోపు కేటాయించిన కాలేజీకి వెళ్లి అభ్యర్థులు వ్యక్తిగతంగా రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. కాలేజీలో ఒరిజినల్ టీసీతో పాటు జిరాక్స్ సర్టిఫికేట్ల సెట్ సమర్పించి అక్నాలెడ్జ్‌మెంట్ పొందడం తప్పనిసరి. రెండో విడత తర్వాత సీట్లు వద్దనుకునే వారు జూలై 28 లోపు రద్దు చేసుకోవచ్చు.

### చివరి విడత ప్రవేశాలు.

మిగిలిన సీట్ల భర్తీకి జూలై 31న స్లాట్ బుకింగ్, ఆగస్టు 1న సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేపడతారు. ఆగస్టు 1, 2 తేదీల్లో కొత్తగా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. వీరికి ఆగస్టు 5న లేదా అంతకుముందు సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఫైనల్ ఫేజ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు ఆగస్టు 5 నుంచి 7 లోపు ఫీజు చెల్లించి, ఆన్‌లైన్ మరియు కాలేజీల్లో రిపోర్టింగ్ పూర్తి చేయాలి. చివరి విడత తర్వాత సీట్ల రద్దుకు లేదా డ్రాపౌట్లకు అవకాశం ఉండదు.

### ఇంటర్నల్ స్లైడింగ్ మరియు స్పాట్ అడ్మిషన్లు.??

మూడు విడతల కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత కాలేజీల్లో అంతర్గతంగా బ్రాంచ్‌లు మార్చుకోవడానికి (ఇంటర్నల్ స్లైడింగ్) ఆగస్టు 12, 13 తేదీల్లో ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. వీరికి ఆగస్టు 15న కొత్త సీట్లను కేటాయిస్తారు.

ఇంటర్నల్ స్లైడింగ్‌లో సీట్లు పొందిన అర్హులైన అభ్యర్థులకు కూడా ఫీజు రీఇంబర్స్‌మెంట్ వర్తిస్తుంది.

ఆ తర్వాత కూడా మిగిలిపోయే సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తారు.

ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఆగస్టు 16న అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించిన తాజా సమాచారం కోసం క్రమంతప్పకుండా https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని అధికారులు కోరారు.

# విద్యాభివృద్ధి తో పాటు ఉపాధి అవకాశాల కల్పన దిశగా చర్యలు

**- విద్యార్థులకు నాణ్యతమైన విద్య అందించాలి: కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 9(భారతశక్తి): విద్యావ్యవస్థలో ప్రణాళికబద్ధమైన మార్పుల ద్వారా విద్యార్థులకు విద్యా బోధన, వృత్తి విద్య కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా మాధ్యమిక విద్యాశాఖ అధికారి అంజయ్య తో కలిసి జూనియర్, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ప్రిన్సిపల్స్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, విద్యావ్యవస్థను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. టి జి డబ్ల్యు ఐ డి సి ఆధ్వర్యంలో జూనియర్, డిగ్రీ కళాశాలలలో చేపడుతున్న నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, కళాశాలలలో విద్యార్థుల హాజరు శాతం పెంపొందించేలా కృషి చేయాలని, నూతన అడ్మిషన్లు నమోదు చేయాలని తెలిపారు. కళాశాలలో అవసరమైన అధ్యాపకులు, సిబ్బంది నియామకం ఉత్తీర్ణత శాతం మెరుగుపరచాలని తెలిపారు. కళాశాలల నిర్వహణ తీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నిర్ణీత గడువులోగా సిలబస్ పూర్తి చేయాలని, సరైన సమయానికి తరగతులు నిర్వహించాలని తెలిపారు. నూతన కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, అడ్మిషన్లతో పాటు హాజరు శాతం పెంచే అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అధునాతన సాంకేతిక కోర్సులలో వృత్తివిద్య శిక్షణ అందించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎ టి సి ల ద్వారా ఉద్యోగం సంపాదించిన వారి వివరాలను విరివిగా ప్రచారం చేయడం ద్వారా అడ్మిషన్ల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, 90 శాతం హాజరు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధ్యాపకులు నెలలో పూర్తి చేసిన సిలబస్ సంబంధిత రిజిస్టర్ నిర్వహణ, చాప్టర్ వారీగా స్లిప్ టెస్టుల నిర్వహణ,హాజరు శాతం సరిగా లేని విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేయాలని తెలిపారు.

# శ్రీమంతం కార్యక్రమంలో గర్భిణీలకు పోషకాహారంపై అవగాహన




జగిత్యాల, జూన్ 9 (భారత శక్తి ప్రతినిధి): ధర్మపురి పట్టణంలోని న్యూ 2 అంగన్వాడి కేంద్రంలో కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్‌లో భాగంగా సోమవారం శ్రీమంతం కార్యక్రమాన్ని 11వ వార్డు కౌన్సిలర్ జక్కు పద్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ధర్మపురి సెక్టార్ సూపర్వైజర్ డాక్టర్ స్వప్న మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పోషక విలువలు అధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పిల్లల జీవితంలో తొలి 1000 రోజులు అత్యంత కీలకమని, ఈ కాలంలో వారి మెదడు 85 శాతం వరకు అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అందువల్ల గర్భిణీలు సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు, పుట్టిన అనంతరం పిల్లలకు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచి పోషకాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జక్కు పద్మ, సూపర్వైజర్ డాక్టర్ స్వప్న, వార్డు ఆఫీసర్ భార్గవి, అంగన్వాడి టీచర్ ఎ. గంగ జమున, ఆయా కె. సరోజ, గర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చెల్లని చెక్కు.... భార్యా భర్తలకు సంవత్సరం జైలు శిక్ష

మంచిర్యాల ప్రతినిధి, జూన్ 9 (భారతశక్తి): తీసుకున్నప్పు తిరిగి చెల్లించే క్రమంలో అప్పు ఇచ్చిన వారికి చల్లని చెక్కులు ఇచ్చిన ఇరువురు భార్యాభర్తలకు సంవత్సరం పాటు జైలు శిక్ష,తీసుకున్న 60 లక్షల రూపాయలు అప్పును తిరిగి చెల్లించాలని మంచిర్యాల రెండవ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కే నిరోషా మంగళవారం రోజున తీర్పునిచ్చారు. వివరాలు మంచిర్యాల పట్టణంలోని గౌతమీ నగర్ కు చెందిన తాటిపల్లి మంజుల తన ఇంటి ఎదురుగా ఉండే రాచపూడి లలితకు 2016 సంవత్సరంలో 38 లక్షల రూపాయలు అప్పుగా ఇవ్వగా అప్పును తిరిగి చెల్లించమని అడగగా ఆమె మంజులకు చెక్కు ఇవ్వగా ఆ చెక్కు బౌన్స్ కావడంతో మంజుల కోర్టులో కేసు నిందితురాలకు శిక్ష వేయమని కోరుతూ వేయడం జరిగింది. ఈ కేసులో విచారణలో భాగంగా వాదోపవాదాలు జరిగినప్పుడు న్యాయమూర్తి కె నిరోషా ఈ కేసులో తీర్పునిస్తూ ముద్దాయి తాను తీసుకున్న 38 లక్షల రూపాయలను తిరిగి అప్పు ఇచ్చిన మంజులకు చెల్లించాలని అలాగే, సంవత్సరం పాటు జైలు శిక్షణ విధిస్తూ తీర్పునిచ్చారు.మరో కేసులో కూడా మంజుల ఇచ్చిన 22 లక్షల రూపాయలు అప్పును తిరిగి చెల్లించే క్రమంలో గతంలో ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో సూపరిండెంట్ గా పనిచేసిన రాచపూడి లక్ష్మీనారాయణ అనే వ్యక్తి చెల్లని చెక్కుఇవ్వడంతో మంజుల కేసు వేయడం జరిగింది. ఈ కేసులో కూడా న్యాయమూర్తి తీసుకున్నప్పుడు మొత్తం చెల్లించాలని అలాగే సంవత్సరం జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారూ.ఈ రెండు కేసుల్లో ఫిర్యాదుదారు తరఫున సీనియర్ న్యాయవాది సిరిపురం రాజేష్, న్యాయవాది శ్రీరామ్ వాదించారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పగడ్బందీగా నిర్వహించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు**



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 9 (భారత శక్తి): జూన్ 25వ తేదీ నుంచి చేపట్టనున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్, భీమారం, జైపూర్ మండల తహసిల్దార్ కార్యాలయాలను బి సెక్షన్ సూపరింటెండెంట్ మధుసూదన్ తో కలిసి సందర్శించి సిబ్బందితో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం, సాదా బైనామా దరఖాస్తులు, భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కరణ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 3వ విడత సర్ లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జూన్ 25 వ తేదీ నుంచి నిర్వహించనున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాటులకు తావు లేకుండా సక్రమంగా నిర్వహించాలని, బూతు స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, సూపర్వైజర్లు, ఏఈఆర్వోలు పనుల పురోగతిని పరిశీలించాలని తెలిపారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి పోర్టల్ ను అందుబాటులోని తీసుకువచ్చి ప్రజల యొక్క ప్రతి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని, ఈ క్రమంలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కరణ వేగవంతం చేయాలని తెలిపారు. సాదా బైనామా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించాలని తెలిపారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, కార్యాలయానికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని, సర్టిఫికెట్లను నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా జారీ చేయాలని తెలిపారు.

# శ్రీ వాసన్స్ అకాడమీ 10వ వార్షికోత్సవం

**- నూతన శాఖ ప్రారంభం**






బాలాపూర్: జూన్ 9 భారతశక్తి నాదర్గుల్ గ్రీన్ హోమ్స్ కాలనీ సమీపంలోని శ్రీ వాసన్స్ అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్స్‌లో అకాడమీ 10వ వార్షికోత్సవ వేడుకలు, నూతన శాఖ ప్రారంభోత్సవం నిర్వహించారు. అకాడమీ చైర్మన్ వాణి, మేనేజింగ్ డైరెక్టర్ సంపత్ కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

**- సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం**

మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి నూతన అకాడమీ శాఖను ప్రారంభించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

**- నాణ్యమైన శిక్షణే లక్ష్యం: సంపత్ కుమార్,**

పది సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందిస్తున్న శ్రీ వాసన్స్ అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్ ఇప్పటికే పలు ప్రాంతాల్లో సేవలను విస్తరించిందని అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ సంపత్ కుమార్ తెలిపారు. తాజాగా నాదర్గుల్‌లో నూతన శాఖను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అకాడమీలో కరాటే, డ్యాన్స్, మ్యూజిక్, ట్యూషన్లు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నామని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వార్షికోత్సవంలో సర్టిఫికెట్లు అందజేశామని వివరించారు.

**- హాజరైన ప్రముఖులు**

ఈ వార్షికోత్సవ వేడుకల్లో కరాటే రంగానికి చెందిన నరేంద్ర, శ్రీనివాస్, సాయి కుమార్, అశోక్ చక్రవర్తితో పాటు స్థానిక రాజకీయ నాయకులు యల్చల మమత సుదర్శన్ రెడ్డి, ఇంద్రసేన, కోటగిరి జంగయ్య, కుమార్ గౌడ్, నరేష్ చారి, లక్ష్మీ యాదవ్ తదితరులు పాల్గొని అకాడమీ అభివృద్ధికి శుభాకాంక్షలు తెలిపారు.

# నగరపాలక సంస్థకు 31 వినతులు

**- ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.**



**తిరుపతి** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 31 వినతులు వచ్చాయని కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 21 మంది వినతులు సమర్పించగా, 10 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా రాయల్ నగర్ లోని మా ఇంటి వద్ద ఉన్న చెట్టు వలన ఇబ్బంది గా ఉంది పరిష్కరిష్కరించాలని, వరదరాజ నగర్ లోని విశ్వం స్కూల్ ఉన్న రోడ్డు సగం నిర్మాణం చేసి ఆపారు పూర్తి చేయాలని, సంజయ్ గాంధీ కాలనీ లో స్థలం ఆక్రమించి కాంటీన్, కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేస్తున్నారు తగు చర్యలు తీసుకోవాలని, జూ పార్క్ రోడ్డు నందు తొలగించిన తోపుడు బండ్లు ఇప్పించాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, లక్ష్మీపురం కూడలి వద్దు రోడ్డు సమస్య పరిష్కరించాలని, రైతు బజార్, సుందరయ్య నగర్ దోభి కాలనీ, మధురనగర్ అక్కగార్ల గుడి వద్ద భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, సెక్రటరీ శ్రీవిద్య, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.

## ఇందుకూరు కాలేజీ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం దే

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నిమిత్తం పలు గ్రామాలను ప్రభుత్వ కార్యాలయాలను ఇందుకూరు ఇందుకూరుపేట పరిసర ప్రాంతాలకు తరలించడం జరిగినది దీనిలో భాగంగానే దేవీపట్నం లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇందుకూరు హైస్కూల్ నందు ఏర్పాటు చేయడం జరిగినది ఇదే హై స్కూల్ నందు కాలేజీ కొరకు నూతన బిల్డింగు నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి ఈ కాలేజీలో విద్యార్థులకు సీఈసీ, ఎంపీసీ, బైపిసి,,హెచ్ ఈ సి గ్రూపులకు విద్యార్థినీ విద్యార్థులకు విద్యాబోధన చేయడం జరుగుతుంది దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉండటం కోసం బాలురకు ప్రత్యేకంగా హాస్టల్ వసతి సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతున్నది ఈ వసతి సౌకర్యం ఏర్పాటు చేయడం వల్ల పేద విద్యార్థులకు దూర ప్రాంతంలో వెళ్లే ఇబ్బంది లేకుండా ఇక్కడే విద్యాభ్యాసం చేసి వసతి గృహం లో ఉండే సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుందని, సీనియర్ అధ్యాపకులచే ఉత్తమ బోధన అందించడం జరుగుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు, హాస్టల్ వెల్ఫేర్ అధికారి పచ్చు కూరు అర్జునుడు తెలిపారు.

# మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ వార్షిక తనిఖీ.


- రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసులపై సమగ్ర సమీక్ష.
- నాణ్యమైన దర్యాప్తుతో బాధితులకు సత్వర న్యాయం అందించాలి.
- రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లపై నిరంతర నిఘా కొనసాగించాలి.
- ట్రాఫిక్ నిబంధనలు పాటించడంలో పోలీసులే ఆదర్శంగా నిలవాలి.
- మెదక్ జిల్లా ఎస్పీడి.వి.శ్రీనివాస రావు.



మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 9: మంగళవారం మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలలో భాగంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పరిపాలన, నేరాల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును సమగ్రంగా పరిశీలించారు. ఎఫ్ఐఆర్‌ల నమోదు విధానం, స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసుల పురోగతి, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బీట్ బుక్స్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు,వారెంట్ల అమలు, సీసీటీఎన్ఎస్ నమోదు విధానం తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే పోలీస్ స్టేషన్ సిబ్బందికి కేటాయించిన సామగ్రి, సర్వీస్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి పెండెన్సీ లేకుండా రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని ఆదేశించారు. నిష్పక్షపాత విధుల ద్వారానే ప్రజల విశ్వాసాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలని సిబ్బందికి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది క్రమశిక్షణ వంటి అంశాలపై కూడా ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేస్తూనే మరింత మెరుగైన పనితీరు కనబర్చాలని సూచించారు. అలాగే రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లలో ఉన్న వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, వారి కదలికలు, ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారి ప్రస్తుత స్థితిగతులను తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు. నేరాల నియంత్రణలో బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఎస్పీ, వారి విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలతో పాటు వ్యక్తిగత సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొంటూ, వ్యక్తిగత ఇబ్బందులు ఉన్న వారు ప్రతి శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో తనను నేరుగా కలవవచ్చని తెలిపారు. దీంతో సిబ్బంది సమస్యలను స్వేచ్ఛగా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు జార్జ్, సందీప్ రెడ్డి, ఎస్ఐ లింగం తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బడిబాటలో 20శాతం అదనపు నమోదు సాధించాలి

**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్ 9: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం వెబెక్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యా ప్రమాణాల మెరుగుదల, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఈ ఏడాది విద్యార్థుల నమోదును కనీసం 20 శాతం పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. గతంలో జీరో ఎన్రోల్మెంట్ విద్యార్థులు లేని కారణంగా మూతపడిన పాఠశాలలను గుర్తించి, ఈ విద్యా సంవత్సరం నుండి వాటిని పునఃప్రారంభించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాకు కొత్తగా మంజూరైన 91 పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో ఇన్స్ట్రక్టర్లను, ఆయాలను త్వరితగతిన నియమించాలన్నారు. విస్తృత ప్రచారం నిర్వహించి ఈ కేంద్రాలలో చిన్నారులను పెద్ద సంఖ్యలో చేర్పించడంతో పాటు, అవసరమైన మౌలిక వసతులను సమకూర్చాలని స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా గ్యాస్ కనెక్షన్లు, మరుగుదొడ్ల సౌకర్యం ఉండాలన్నారు.

ముఖ్యంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ర్యాంపులు, వెస్ట్రన్ టాయిలెట్లను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలకు ఇప్పటికే మంజూరైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్లు, కంప్యూటర్లు నిరంతరం పనిచేసే స్థితిలో ఉండేలా చూసుకోవాలని, ఇంటర్నెట్ సౌకర్యం లేని పాఠశాలల వివరాలతో తక్షణమే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను మెరుగుపరిచి, డిజిటల్ బోధన ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రాధాన్యత అని అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి బడిబాటను విజయవంతం చేయాలని కోరారు. ఈ వెబెక్స్ సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు హరికృష్ణ, సూర్యనారాయణ, రేణుక దేవి, పూలన్, వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మరియు విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# చట్టసభల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలి

**- అల్లంపల్లి రామకోటి**

**-ఓట్ల యంత్రాలుగా, పల్లకీలు మోసే బోయీలుగానే బీసీలు**

**-పదవులు అనుభవిస్తూ సమాజాన్ని విస్మరిస్తున్న బీసీ ప్రజాప్రతినిధులు**

**-తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్.**




హైదరాబాద్, జూన్ 9 భారత శక్తి: దేశంలో మెజారిటీ జనాభా కలిగిన బీసీల జీవితాలు స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా నేటికీ దయనీయంగానే ఉన్నాయని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లంపల్లి రామకోటి ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా, పల్లకీలు మోసే బోయీలుగా, రాజకీయ బానిసలుగానే వాడుకుంటున్నారని మండిపడ్డారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. బీసీల రాజ్యాధికారం, చట్టసభల్లో రిజర్వేషన్ల సాధనపై పలు డిమాండ్లను తెరపైకి తెచ్చారు.

**- ప్రజాప్రతినిధుల స్వార్థం.. ప్రజల్లో అపనమ్మకం**

బీసీల ఓట్లతో గెలిచి అసెంబ్లీలు, పార్లమెంటుకు వెళ్తున్న ఎంతోమంది బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు తమ బాధ్యతను విస్మరిస్తున్నారని రామకోటి విమర్శించారు. పదవులు దక్కాక స్వార్థం, కుటుంబ ప్రయోజనాల కోసమే పనిచేస్తూ బడుగు, బలహీన వర్గాల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారని ధ్వజమెత్తారు. "బీసీ నాయకుల వైఖరి వల్లే.. వారి కంటే ఓసీ పార్టీలే మెరుగైన పాలన అందిస్తాయేమో అనే భావన ప్రజల్లో బలంగా నాటుకుంటోంది. అయితే అన్ని ఓసీ పార్టీలు ఒకేలా ఉండవు. బీసీలకు నిజంగా పెద్దపీట వేసే పార్టీలను సమాజం గుర్తించాల్సిన అవసరం ఉంది."

**అల్లంపల్లి రామకోటి**

**పార్లమెంట్‌లో 'బీసీ బిల్లు' పెట్టాలి**

దేశాన్ని బీసీ సామాజికవర్గానికి చెందిన నరేంద్ర మోదీ పాలిస్తున్న తరుణంలో.. బీసీల అభివృద్ధిని సాధించేందుకు ఇదొక గొప్ప అవకాశమని రామకోటి పేర్కొన్నారు. నాడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించి చరిత్రలో నిలిచిపోయారని గుర్తు చేశారు. అదేవిధంగా ప్రధాని మోదీ కూడా బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో తక్షణమే 'బీసీ బిల్లు'ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

**- చరిత్ర ప్రశ్నిస్తుంది..**

ఒక్క సంతకంతో బీసీ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదంపొందేలా చేస్తే బీసీ సమాజం ఉన్నంతకాలం ప్రధానిని గుర్తుంచుకుంటుందని రామకోటి అన్నారు. రేపు పదవుల నుంచి తప్పుకున్నాక, బీసీల కోసం ఏం చేశారనే ప్రశ్న ఎదురుకాకుండా ఉండాలన్నా, బీసీలకు ఆత్మగౌరవాన్ని అందించిన నాయకునిగా నిలవాలన్నా ఈ బిల్లు చట్టం కావాలన్నారు. బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడాలని, వారు సగర్వంగా తలెత్తుకొని బతికేలా చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

# జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వండి

**-హైదరాబాద్ కలెక్టర్, డీఈవోలకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ విజ్ఞప్తి**

హైదరాబాద్, జూన్ 09 (భారత శక్తి ): హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరాలలో ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) హైదరాబాద్ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జిల్లా కమిటీ ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలాను కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో బాగంగా వారి పిల్లల చదువులకు సహకరించాలని కోరారు.


ప్రస్తుతం జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాదాపు 80 శాతం మంది జర్నలిస్టులు వేతనాలు సరిగా లేక నెల వారీ ఆదాయం లేక, వారి పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారని, నానా బాధలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నారని, ఈ పరిస్థితిలో జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని వారు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రాయితీలు అమలు చేయాలని కోరారు. రాబోయే 2026-27 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేనాటికి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ ను కలిసి వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎం.రవికుమార్, పి.సంతోష్ కుమార్, అడ్వయిజర్ గోవింద్ నాయక్, టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య తదితరులున్నారు. అనంతరం వారు హైదరాబాద్ జిల్లా విద్యాధికారి(డీఈఓ) యాదయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు.



# పుల్లగా ఉందని దూరం పెడుతున్నారా.?

బరువు తగ్గించేందుకు తీసుకునే ఆహారాల్లో చింతపండు ఉందని నిపుణులు చెబుతున్నారు. తరుచుగా చింతపండును తీసుకుంటే చాలా తొందరగా బరువు తగ్గుతారని చెబుతున్నారు. చింతపండు లేనిదే భారతీయ వంటకాలు పూర్తి అవ్వవు. పుల్లగా ఉండే ఈ చింతపండులో ఎన్నో ఔషద గుణాలున్నాయని నిపుణులు వివరిస్తున్నారు. చింతపండులో మంచి కొవ్వులు, కార్బోహైడ్రేట్లు, విటమిన్లు ఇ, కె, సి, బి1, బి2, బి5, బి3, బి6 తో పాటుగా సోడియం, ఐరన్, ఎనర్జీ, జింక్, ఫాస్పరస్, కాల్షియం వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. చింతపండులో ఉండే హైడ్రక్సీ సిట్రిక్ యాసిడ్ మనలో ఫ్యాట్ ప్రొడక్షన్ను తగ్గిస్తుంది. అంతేకాదు ఇందులో ఉండే హెచ్‌సీఏ ఫ్యాట్ నిల్వలకు కారణమయ్యే ఎంజైమ్స్‌కు అడ్డుగా నిలుస్తుంది. చింతపండు తీసుకొంటే వ్యాయామం చేస్తున్నప్పుడు కొవ్వు తొందరగా కరిగేందుకు కూడా ఇది ఎంతో సహాయపడుతుందట. బరువు తగ్గాలనుకొంటే తప్పకుండా ప్రతిరోజూ దీని తీసుకోండి. చింతపండులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇవి ఇమ్యూనిటీ పవర్‌ను పెంచడానికి ఎంతో ఉపయోగపడుతుంది. బాడీలో ఉండే చెడు కొలెస్ట్రాల్ ను కూడా తగ్గిస్తుంది. అంతేకాదు ఈ చింతపండు గుండె ఆరోగ్యానికి ఎంతో సహాయపడుతుంది. చింతపండును రోజు వారి ఆహారంలో తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది. చింతపండులో పాలీఫెనాల్స్, ఫ్లైవనాయిడ్లు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. అంతేకాదు దీనితో మెటబాలిజం కూడా పెరుగుతుంది. తద్వారా ఆకలి చాలా వరకు తగ్గుతుంది. దీంతో మీరు ఈజీగా వెయిట్ లాస్ అవుతారు.



# బలహీనత ఇబ్బంది పెడుతుందా.?



ప్రస్తుత కాలంలో సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల శరీరం బలహీనతకు గురవుతుంది. బలహీనత వల్ల ఏ పని కూడా సక్రమంగా చేయలేం ఏకాగ్రత పూర్తిగా దెబ్బ తింటుంది. ఇలాంటి పరిస్థితుల్లో తేలికగా జీర్ణమయ్యేవి, శరీరానికి శక్తి లభించే వాటిని ఎప్పుడూ తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుత కాలంలో సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల శరీరం బలహీనతకు గురవుతుంది. బలహీనత వల్ల ఏ పని కూడా సక్రమంగా చేయలేం ఏకాగ్రత పూర్తిగా దెబ్బ తింటుంది. ఇలాంటి పరిస్థితుల్లో తేలికగా జీర్ణమయ్యేవి, శరీరానికి శక్తి లభించే వాటిని ఎప్పుడూ తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. శరీరంలో బలహీనతకు కారణం: విటమిన్ బి12 లేకపోవడం వల్ల శరీరంలో బలహీనత ఏర్పడుతుంది. డిప్రెషన్, ఆందోళన కూడా శరీరాన్ని బలహీనం చేస్తాయి. ఇది ఏదో ఒక రకమైన వ్యాధి వల్ల కూడా ఇలా జరుగుతుంది. శరీరంలో బలహీనత ఉంటే ఆహారంలో వీటిని జోడించండి. పచ్చి కూరగాయలు తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు. ఫైబర్ కూరగాయలలో లభిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. దీంతో పొట్ట త్వరగా నిండడంతో పాటు ఆకలిని ఎక్కువసేపు అదుపులో ఉంచుతుంది. బరువు తగ్గుతుంది. ఊబకాయం పెరగదు. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో పచ్చి కూరగాయలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. లీన్ ప్రొటీన్ తీసుకోండి: శరీర బలహీనతను తొలగించడానికి లీన్ ప్రొటీన్లు అధికంగా ఉండే వాటిని తీసుకోవాలి. దీని కోసం ఆహారంలో సముద్రపు (చేపలను) ఆహారాలను, మాంసం, గుడ్లు వంటి వాటిని చేర్చుకోవచ్చు. ఇంకా ఆకుకూరలు, పెరుగు, కాయధన్యాలను తీసుకోవచ్చు. లీన్ ప్రోటీన్ గుండెకు చాలా మంచిది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నట్స్, తృణ ధాన్యాలు తినండి: శరీరంలో బలహీనత ఉన్నప్పుడు నట్స్, తృణ ధాన్యాలు తినవచ్చు. ఎందుకంటే వీటిలో కేలరీలు తక్కువగా ఉంటాయి. దీని కారణంగా అవి సులభంగా జీర్ణమవుతాయి. మరోవైపు ప్రతిరోజూ నట్స్, తృణ ధాన్యాలును తీసుకుంటే మీ బలహీనత, అలసట తొలగిపోతుంది.

# ఓట్స్ ఇడ్లీతో అనారోగ్యం పరార్.. ఎలా తయారు చేయాలంటే.?



ఓట్స్ ఆరోగ్యానికి మంచిది. వీటిని తీసుకోవడం వల్ల శరీర బరువు అదుపులో ఉంటుంది. అలాగే బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. అయితే కాంతమందికి వీటి తినడం నచ్చదు. అలంటివారు వీటిని ఉప్మాగా, ఇడ్లీ లేదా మరేదైన రూపంలో తీసుకోవచ్చు. ఈరోజు ఓట్స్ ఉపయోగించి ఇడ్లీని మీ ఇంటిలోనే ఎలా తయారుచేసికోవాలి.? ఓట్స్ ఇడ్లీ కోసం కావలసినవి: 1 కప్పు ఓట్స్ పొడి, 1/2 కప్పు రవ్వ, 1 తురిమిన క్యారెట్, 1/2 కప్పు పెరుగు, ఆవాలు మరియు జీలకర్ర, మినపప్పు ఒ శనగపప్పు, 1 తరిగిన పచ్చిమిర్చి, కరివేపాకు, 1/2 టీస్పూన్ పండ్ల ఉప్పు, 1 టేబుల్ స్పూన్ నూనె, రుచికి తగినంత ఉప్పు.ముందుగా స్టవ్ ఆన్ చేసుకొని. దానిపై ఒక పాన్? పెట్టండి. అందులో 1 టేబుల్ స్పూన్ నూనె వేడి చేసి, ఆవాలు, జీలకర్ర, మినపప్పు, శనగపప్పు, పచ్చిమిర్చి, కరివేపాకు వేసి, ఆవాలు వేసుకొని బంగారు గోధుమ రంగులోకి మారే వరకు వేయించాలి. రవ్వను టెంపరింగ్‌లో వేసి 2 నిమిషాలు రోస్ట్ చేస్తూ, కలుపుతూ, తరువాత, తురిమిన క్యారెట్‌ను వేసి, మిశ్రమం బాగా కలిసే వరకు మరో 2 నిమిషాలు వేయించాలి. పాన్?లో ఓట్స్ పొడి వేసి అందుకో ఉప్పు వేసి బాగా కలిపి, ఆ మిశ్రమాన్ని మంచి వాసన వచ్చేవరకు వేయించాలి. తర్వాత కొద్దిగా చల్లబరచాలి. మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీసుకొని పెరుగు వేసి మందపాటి పిండిలా కలపండి. పిండి చాలా మందంగా ఉంటే, కావలసిన స్థిరత్వాన్ని పొందడానికి కొద్దిగా నీరు కలపండి. 15-20 నిమిషాలు అలాగే ఉంచండి. ఆవిరి పట్టే ముందు, పిండికి 1/2 టీస్పూన్ ఫ్రూట్ సాల్ట్ లేదా బేకింగ్ సోడా జోడించండి. బుడగలు ఏర్పడే వరకు మెత్తగా కలపండి. ఇడ్లీ పాత్ర అచ్చులపై కొద్దిగా నూనె రాసి, పిండిని వాటిలో పోయాలి. ఇడ్లీలను ఇడ్లీ కుక్కర్ లేదా స్టీమర్‌లో 10-12 నిమిషాలు మీడియం మంట మీద ఉడికించాలి. ఉడికిన తర్వాత, ఇడ్లీలను అచ్చుల నుంచి తొలగించండి. రుచికరమైన, ఆరోగ్యకరమైన భోజనం ఓట్స్ ఇడ్లీ రెడీ. రుచి కోసం కొబ్బరి చట్నీ లేదా సాంబార్‌తో వేడిగా తినండి.

# గింజ గింజలో ఆరోగ్యం

## అద్భుత ప్రయోజనాలు



వేసవి కాలంలో విరివిగా లభించే పుచ్చపండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఎండలో దాహార్తిని తీర్చేందుకు ముందు వరుసలో ఉంటుంది పుచ్చపండు. అయితే, మనందరం ఈ పండు తినేసి గింజలు ఊసేస్తాం. కానీ, అది చాలా పొరపాటు అంటున్నారు నిపుణులు. ఎందుకంటే పుచ్చకాయ గింజలు అంత రుచిగా ఉండకపోయినా గుండె ఆరోగ్యానికి చాలా మంచిదని చెబుతున్నారు. పుచ్చపండులోని నీరు శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. మూత్రపిండాలు, మూత్రనాళాల్లో ఇబ్బందులు ఉన్నవారికి పుచ్చపండు ఓ వరం లాంటిదని నిపుణులు చెబుతున్నారు.. భోజనం తర్వాత పుచ్చపండు రసం తాగడం వల్ల ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. ఊబకాయాన్ని తగ్గించడంలో ఇది ఎంతో తోడ్పడుతుంది. పుచ్చపండు గింజల్లో విటమిన్స్‌తో పాటు మెగ్నీషియం, ఐరన్, పొటాషియం, పాస్పరస్, కాపర్, జింక్, మాంగనీస్ సమృద్ధిగా ఉంటాయి. ఈ గింజల్లో ఉండే అమైనో ఆసిడ్స్ రక్తనాళాలను వెడల్పు చేసి రక్తప్రసరణ సాఫీగా జరిగేలా చేస్తాయి. పుచ్చగింజల్లో ప్రోటీన్స్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. పుచ్చపండులో విటమిన్ ఎ, బి, సి, ఐరన్ సమృద్ధిగా లభిస్తాయి..పుచ్చకాయ గింజలలో కాల్షియం కూడా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన ఎముకలను నిర్వహించడానికి సహాయపడుతుంది. ఎముకలు కాకుండా, కండరాల పనితీరును పెంచడంలో, నరాలను చురుకుగా ఉంచడంలో ఉపయోగకరంగా ఉంటుంది. పుచ్చకాయలో ఉండే లైకోపీన్ అనే పదార్థం పురుషుల్లో వీర్యకణాల ఉత్పత్తిని పెంచుతుంది. పుచ్చకాయ గింజల్లో ఉండే లైసిన్ మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. అంతేకాదు.. పుచ్చకాయ గింజల్లో లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది.. ఇది లైకోపీన్ వల్ల క్యాన్సర్ కణాలను నియంత్రిస్తుంది. మెదడు నరాలను బలపరుస్తుంది. కామెర్లు వంటి సమస్యలలో పుచ్చకాయ గింజలను తీసుకోవడం వల్ల చాలా మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పుచ్చకాయ గింజల్లో ప్రొటీన్, ఐరన్, మెగ్నీషియం, జింక్, కాపర్ పుష్కలంగా ఉంటాయి.. ఇవి జుట్టు నాణ్యతను మెరుగుపరుస్తాయి. జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జుట్టు రాలడం, డ్యామేజ్‌ని నిరోధించడంలో సహాయపడతాయి. తరచూ పుచ్చకాయ గింజలు తినటం వల్ల ముఖం కాంతివంతంగా మారుతుంది. ముడతలు తగ్గి యవ్వనంగా కనిపిస్తారు. చర్మం పొడిబారకుండా కాపాడుతుంది.

# మధుమేహానికి దివ్య ఔషధం ఈ పండు





ఎరుపు అరటి.. షుగర్ బాధితులకు దివ్య ఔషధం ఈ పండ్లు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇందులో అనేక ఆరోగ్య ప్రయోజనాలు నిండివున్నాయని నిపుణులు చెబుతున్నారు. సాధారణ అరటి కంటే ఎరుపు అరటి పండులో ఎక్కువ పోషకాలు ఉన్నాయని అంటున్నారు. ఎరుపు అరటిలో బీటా కెరోటిన్, విటమిన్ సి, పొటాషియం, ఐరన్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దీని తీసుకోవడం వల్ల మధుమేహంతో పాటుగా శరీరానికి మరెన్నో లాభాలు కలుగుతాయని చెబుతున్నారు. ఎరుపు అరటి పండును తరచూ తీసుకోవటం వల్ల కంటిచూపును మెరుగుపరుస్తుందని నిపుణులు అంటున్నారు. దృష్టి లోపాలను నివారిస్తుంది. మహిళల్లో ఎక్కువగా వచ్చే రక్తహీనతను తగ్గించడంలో సహాయపడుతుంది. నరాలను బలపరుస్తుంది. అంతేకాదు..కొన్ని రకాల క్యాన్సర్లను నిరోధించడంలో సహాయపడుతుంది. ఎరుపు రంగు అరటి పండు తరచూ తీసుకోవటం వల్ల అజీర్తి, పైల్స్, దృష్టి లోపాలను తొలగిస్తుందని నిపుణులు చెబుతున్నారు.. రోజుకు ఓ అరటి పండును 21 రోజుల పాటు తీసుకుంటే దృష్టి లోపాలతో పాటు విటమిన్ సి లోపం తొలగిపోతుంది. ఎరుపు అరటితో జీర్ణక్రియ మెరుగవుతుంది. శరీరానికి శక్తిని ఇస్తుంది, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఎరుపు రంగు అరటి పండ్లకు పంటి నొప్పులను దూరం చేసే గుణం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఛాతిలో మంటతో ఇబ్బంది పడేవారు.. రోజుకో ఎరుపు అరటిని తీసుకోవచ్చునని సూచిస్తున్నారు. దీంతో ఛాతి, కడుపులో మంట సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా సంతానలేమి సమస్యలను తగ్గించడంలో ఎరుపు అరటి పండు అద్భుత మేలు చేస్తుందని నిపుణులు అంటున్నారు. ఎరుపు రంగు అరటిలో ఐరన్, క్యాల్షియం అధికం. సంతానం కోసం ఎదురుచూసే దంపతులు రోజు ఓ ఎరుపు అరటిని తీసుకుంటే శరీరంలో జీవకణాల ఉత్పత్తి పెరుగుతుంది. తద్వారా గర్భం దాల్చడం సులభం అవుతుందని అంటున్నారు. ఎరుపు అరటి పోషకాల గని అయినప్పటికీ, కొంతమంది వ్యక్తులు దీన్ని జాగ్రత్తగా తీసుకోవడం మంచిది. ముఖ్యంగా షుగర్ పేషెంట్స్. అరటిపండులో చక్కెర పరిమాణం ఎక్కువగా ఉండటం వల్ల షుగర్ ఉన్నవారు దీన్ని తీసుకోవడానికి ముందు వైద్యుని సలహా తీసుకోవాలి. మలబద్ధకం ఉన్నవారు, కిడ్నీ సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా మేరకు మాత్రమే తీసుకోవటం ఉత్తమం.

# బార్లీ నీళ్లు తాగితే కొలెస్ట్రాల్ ప్రాబ్లమ్ పరార్..!



బార్లీ వాటర్‌తో బోలెడన్నీ ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పోషకాహార, ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఫోలేట్ (ఒక%దీ విటమిన్), ఇనుము, రాగి, మాంగనీస్ అధికంగా ఉన్నాయి. ఇవన్నీ శరీరంలోని అవయవాలపై ఆక్సీకరణ ఒత్తిడిని కలిగించే ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తూ ఆరోగ్యకరమైన కణాల పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ముఖ్యంగా ఇది శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్?ను తగ్గించడానికి చక్కటి ఔషధంలా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. బార్లీ వాటర్‌లోని ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియ ప్రక్రియను మెరుగు చేస్తుంది. త్వరగా ఆకలి వేయకుండా ఎక్కువ టైమ్ కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తుంది. అతిగా తినకుండా నిరోధిస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారంతో పాటుగా, వ్యాయామం చేస్తూ బార్లీ నీరు తీసుకోవటం ఈజీగా బరువు తగ్గొచ్చు అంటున్నారు నిపుణులు. బార్లీలోని ఫ్రీ-రాడికల్ లక్షణాలతో పాటు, విటమిన్లు, మినరల్స్ రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తాయి. ఇందులోని ఫైబర్, పేగు కదలికలకు, జీర్ణక్రియకు సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి బార్లీ నీటిలో కరిగే ఫైబర్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. బార్లీ నీరు రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది. బార్లీ నీరు తక్కువ గ్లైసెమిక్ కలిగి ఉంటుంది. ఇది మధుమేహం ఉన్నవారికి ప్రయోజనకంగా ఉంటుంది. బార్లీ నీరు రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది. బరువు తగ్గేందుకు కూడా బార్లీలోని ఫైబర్ కంటెంట్ సహాయపడుతుంది. ఇది క్యాలరీలను తగ్గించేందుకు, బరువును తగ్గించేందుకు ముందుంటుంది. బార్లీ నీరు మూత్రపిండాలలో రాళ్లకు సహజ నివారణగా ఉపయోగపడుతుంది. ఎముకల ఆరోగ్యానికి బార్లీలోని కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు సహకరిస్తాయి. పోషకాలతో నిండిన బార్లీ నీటిని తీసుకోవడం వల్ల హైడ్రేటెడ్‌గా ఉండటానికి వీలుంటుంది. దీనిలో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రణలో ఉంచడానికి తోడ్పడుతుంది. బార్లీలో ఫెరులిక్ యాసిడ్ ఉంటుంది. ఇది శరీరంలో కణతులు పెరగకుండా చేస్తుంది. బార్లీలో లభించే యాంటీఆక్సిడెంట్ల ద్వారా పెద్దప్రేగు క్యాన్సర్ కణాలు పునరుత్పత్తి జరగకుండా నిరోధిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. బార్లీ శరీరంలో అధిక నీటిని తొలగిస్తుంది. మూత్ర సంబంధ సమస్యలను కూడా అదుపులో ఉంచుతుంది.

భారత శక్తి
VOICE OF INDIAN
బుధవారం, జూన్ 10, 2026

## విజయవంతంగా పూర్తి అయిన జోజిలా టన్నెల్

(భారత శక్తి)శ్రీనగర్ లడక్ మధ్య త్వరలో నిరంతర రాకపోకలకు మార్గం సుగమం. మేఘా బ్రేక్ త్రూ లో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ. జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, మేఘా ఇంజనీరింగ్ అండ్‌ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పీ వీ కృష్ణా రెడ్డి, డైరెక్టర్ సి హెచ్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్న

## సర్ కార్యక్రమంలో పాల్గోనాలి

**– శేఖర్ కమ్ముల**

**సికింద్రాబాద్ (భారత శక్తి):** ఓటు రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు అని. ప్రముఖ చిత్ర దర్శకులు శేఖర్ కమ్ముల అన్నారు. మంగళవారం పద్మారావు నగర్ లోని ఆయన నివాసంలో ప్రత్యేక ఓటరు సవరణ (ూఎఖీ) కార్యక్రమంలో భాగంగా మ్యాపింగ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్ కార్యక్రమం గురించి. సనత్ నగర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఇఖీూ) వివరించారు. దర్శకులు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ ప్రతి ఒక్క ఓటరు ూఎఖీ కార్యక్రమంలో పాల్గొనాలని, జాబితా లో తమ పేరు ఉండేలా పరిశీలన చెలుకోవడం తప్పని సరి అన్నారు.

## కార్పోరేట్ కాలేజీల ఫీజు దోపిడి అరికట్టాలి

**హైదరాబాద్ (భారత శక్తి)**కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ, భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్ లోని హైయ్యర్ ఎడ్యుకేషన్ ముందు ఆందోళన జరిగింది. విద్యార్థులను మరియు తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ, భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) తెలంగాణ రాష్ట్ర శాఖ నాయకులు, హైయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ కు వినతిపత్రం అందజేసారు.

## రామంతాపూర్లో దోపిడీ ముఠా అరెస్ట్..

**– నలుగురు రిమాండ్కు, బాలుడు సీసీఎల్ హోంకు తరలింపు**

**మేడ్చల్ (భారత శక్తి)** ఉప్పల్ పిఎస్ పరిధిలోని రామంతాపూర్లో దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.4,000 నగదు, నేరానికి ఉపయోగించిన యాక్టివా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. జూన్ 7 అర్ధరాత్రి 1 గంట సమయంలో (తెల్లవారితే జూన్ 8) లక్ష్మీనారాయణ కాలనీకి చెందిన చంద్రశేఖర్ తన స్నేహితులతో కలిసి పెట్రోల్ కోసం వెళ్తుండగా మోడ్రన్ బేకరీ సమీపంలో నిందితులు దాడి చేసి శివకాంత్ వద్ద ఉన్న రూ.4,000 నగదును లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనలో చంద్రశేఖర్ తలకు గాయమైంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు దర్యాప్తు చేపట్టి రామంతాపూర్ డీ-మార్ట్ సమీపంలో నిందితులను పట్టుకున్నారు. విచారణలో రాత్రివేళ ఒంటరిగా వెళ్లే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నట్లు తేలింది. అరెస్టైన నలుగురు నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. కేసులో ఉన్న బాలుడిని సీసీఎల్ హోంకు తరలించారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని అధికారులు అభినందించారు.

## రామంతాపూర్లో దోపిడీ ముఠా అరెస్ట్..

**– నలుగురు రిమాండ్కు, బాలుడు సీసీఎల్ హోంకు తరలింపు**



**మేడ్చల్(భారత శక్తి)** ఉప్పల్ పిఎస్ పరిధిలోని రామంతాపూర్లో దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.4,000 నగదు, నేరానికి ఉపయోగించిన యాక్టివా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. జూన్ 7 అర్ధరాత్రి 1 గంట సమయంలో (తెల్లవారితే జూన్ 8) లక్ష్మీనారాయణ కాలనీకి చెందిన చంద్రశేఖర్ తన స్నేహితులతో కలిసి పెట్రోల్ కోసం వెళ్తుండగా మోడ్రన్ బేకరీ సమీపంలో నిందితులు దాడి చేసి శివకాంత్ వద్ద ఉన్న రూ.4,000 నగదును లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనలో చంద్రశేఖర్ తలకు గాయమైంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు దర్యాప్తు చేపట్టి రామంతాపూర్ డీ-మార్ట్ సమీపంలో నిందితులను పట్టుకున్నారు. విచారణలో రాత్రివేళ ఒంటరిగా వెళ్లే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నట్లు తేలింది. అరెస్టైన నలుగురు నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. కేసులో ఉన్న బాలుడిని సీసీఎల్ హోంకు తరలించారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని అధికారులు అభినందించారు.

## ప్రయాణికులకు తప్పని తిప్పలు




**సి.బెళగల్, (భారత శక్తి)**మంత్రాలయం నుంచి కర్నూలు జిల్లా కేంద్రానికి రోడ్డు మార్గం ద్వారా ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఇసుక టిప్పర్ వాహనాల నిరంతర రాకపోకల వల్ల రహదారులు పూర్తిగా దెబ్బతిని, ప్రయాణం నరకప్రాయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాత్రి, పగలు తేడా లేకుండా భారీ సంఖ్యలో ఇసుక టిప్పర్ వాహనాలు సంచరిస్తుండటంతో రోడ్ల పరిస్థితి రోజురోజుకు అధ్వాన్నంగా మారుతోంది. ఈ సమస్యపై సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామాల్లో నియమితులైన ప్రత్యేక అధికారులు ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.సి.బెళగల్ మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామం వద్ద పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇసుక వాహనాల అధిక రద్దీ కారణంగా బీటీ రహదారి మొత్తం గుంతలమయంగా మారిపోయింది. రహదారిపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, ఆటో ప్రయాణికులు, బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలను తప్పించుకునే క్రమంలో ప్రమాదాల బారిన పడే పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయి.విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసర పనుల నిమిత్తం ప్రయాణించే ప్రజలు ప్రతిరోజూ అవస్థలు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారులను వెంటనే మరమ్మతు చేయడంతో పాటు, ఇసుక వాహనాల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని రహదారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## యాక్సిడెంట్‌లో గాయపడిన టీడీపీ కార్యకర్తను పరామర్శించిన డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు



**బద్వేలు (భారత శక్తి)**బద్వేల్ పట్టణం 4వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త వంకెల శ్రీనివాసులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి మంగళవారం ఆయనను పరామర్శించారు.శ్రీనివాసులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సూర్యనారాయణ రెడ్డి గారు, ఆయనకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన వైద్య సేవలు అందేలా చూసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తల సంక్షేమమే తమకు ముఖ్యమని, కష్టసుఖాల్లో కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. శ్రీనివాసులు పూర్తిగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డబ్బులు ఇచ్చుకో... నకిలీ పట్టా పుచ్చుకో..!

**– తిమ్మందొడ్డి గ్రామంలో నకిలీ ఇంటి పట్టాల కలకలం?**

**– అధికార పార్టీ గ్రామ నాయకుడే సూత్రధారి అంటూ ఆరోపణలు**

**– చనిపోయిన వ్యక్తి పేరుతోనూ పట్టాల సృష్టి!?**

**– నిద్రమత్తులో రెవెన్యూ అధికారులు**

**– బాధితుల తీవ్ర ఆగ్రహం**

**సి.బెళగల్ (భారత శక్తి)** కర్నూలు జిల్లా సి.బెళగల్ మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో నకిలీ ఇంటి పట్టాల వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రభుత్వ భూములే లక్ష్యంగా, అమాయక ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని లక్షలాది రూపాయల చేతులు మారుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. “డబ్బులు ఇచ్చుకో.. నకిలీ పట్టా పుచ్చుకో” అనే చందంగా గ్రామంలో బహిరంగంగానే భూ అక్రమాలు జరుగుతున్నాయని గ్రామస్తులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ స్థలాలను అడ్డగోలుగా ఆక్రమించేందుకు కొందరు రాజకీయ నాయకులు, దళారులు చేతులు కలిపి నకిలీ పత్రాలను సృష్టిస్తున్న తీరు స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది.అసలు వివాదం ఏమిటి??గ్రామానికి చెందిన తెలుగు వెంకటేశ్వరమ్మ అనే మహిళకు గతంలో ప్రభుత్వం న్యాయబద్ధంగా ఇంటి పట్టా మంజూరు చేసింది. ఆర్‌సీ నెం. 135/85 కింద 20 ఫిబ్రవరి 1999న ఆమెకు 240-బి ప్లాట్‌ను ప్రభుత్వం కేటాయించింది. అప్పటి నుండి ఆ స్థలంపై ఆమె సర్వహక్కులు కలిగి ఉన్నారు. అయితే, ఇటీవల కాలంలో ఆ స్థలంపై కొందరు అక్రమార్కుల కన్ను పడింది. అదే స్థలానికి బెస్త పెద్ద వెంకటరాముడు అనే వ్యక్తి పేరుతో మరొక నకిలీ పట్టాను సృష్టించి, తెలుగు వెంకటేశ్వరమ్మకు చెందిన స్థలాన్ని అక్రమంగా కబ్జా చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. దీంతో బాధితురాలు ఆందోళనకు గురై న్యాయం కోసం గళమెత్తారు.? మరణించిన వ్యక్తి పేరిట పట్టా ఎలా వచ్చింది??ఈ నకిలీ పట్టాల వ్యవహారంలో ఒక విస్తుపోయే నిజం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలుగు వెంకటేశ్వరమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఏ వ్యక్తి పేరునైతే ఇప్పుడు నకిలీ పట్టా సృష్టించారో, ఆ బెస్త పెద్ద వెంకటరాముడు అనే వ్యక్తి 1980 సంవత్సరంలోనే మరణించారు.?”1980లోనే మరణించిన వ్యక్తి పేరుపై, తిరిగి 1999లో ప్రభుత్వ ఇంటి పట్టా ఎలా మంజూరు అవుతుంది? మరణించిన వ్యక్తి వచ్చి దరఖాస్తు చేసుకున్నాడా? లేక అధికారులు వచ్చి ఆయన సమాధి దగ్గర పట్టా ఇచ్చారా? దీనికి రెవెన్యూ అధికారులే సమాధానం చెప్పాలి” అని బాధితురాలు నిలదీశారు.?ఈ ఒక్క ఉదాహరణ చాలు గ్రామంలో ఏ స్థాయిలో నకిలీ పట్టాల దందా సాగుతుందో అర్థం చేసుకోవడానికి అని స్థానికులు పేర్కొంటున్నారు. సూత్రధారి ఆయనే.. గ్రామస్తుల సంచలన ఆరోపణలు?తిమ్మందొడ్డి గ్రామంలో సాగుతున్న ఈ నకిలీ పట్టాల దంద వెనుక ఓ బలమైన రాజకీయ హస్తం ఉందని గ్రామస్తులు నేరుగా ఆరోపిస్తున్నారు. గ్రామంలో అధికార పార్టీ నాయకుడిగా చలామణి అవుతున్న బి. సూర్యచంద్ర అనే వ్యక్తి ఈ వ్యవహారానికి ప్రధాన సూత్రధారి అని విమర్శలు వస్తున్నాయి.?అక్రమాల తీరు ఇలా ఉంది:?గ్రామంలో ఎక్కడైనా ప్రభుత్వ ఖాళీ స్థలాలు ఉంటే చాలు, వాటిపై ఈ నాయకుడు కన్నేస్తాడు.?నిరుపేదలు, అమాయక ప్రజలను నమ్మించి, “మీకు ప్రభుత్వ స్థలం ఇప్పిస్తాం” అంటూ ఆశ చూపుతాడు.?ఒక్కో ఇంటి పట్టా సృష్టించడానికి రూ. 30 వేల నుండి రూ. 50 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

## నగరపాలక సంస్థకు 31 వినతులు

**– ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.**



**తిరుపతి (భారత శక్తి)** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 31 వినతులు వచ్చాయని కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 21 మంది వినతులు సమర్పించగా, 10 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా రాయల్ నగర్ లోని మా ఇంటి వద్ద ఉన్న చెట్టు వలన ఇబ్బంది గా ఉంది పరిష్కరిష్కరించాలని, వరదరాజ నగర్ లోని విశ్వం స్కూల్ ఉన్న రోడ్డు సగం నిర్మాణం చేసి ఆపారు పూర్తి చేయాలని, సంజయ్ గాంధీ కాలనీ లో స్థలం ఆక్రమించి కాంటీన్, కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేస్తున్నారు తగు చర్యలు తీసుకోవాలని, జూ పార్క్ రోడ్డు నందు తొలగించిన తోపుడు బండ్లు ఇప్పించాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, లక్ష్మీపురం కూడలి వద్దు రోడ్డు సమస్య పరిష్కరించాలని, రైతు బజార్, సుందరయ్య నగర్ దోభి కాలనీ, మధురనగర్ అక్కగార్ల గుడి వద్ద భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, సెక్రటరీ శ్రీవిద్య, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.

## ఇందుకూరు కాలేజీ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం దే

**పోలవరం (భారత శక్తి)** ప్రాజెక్టు నిర్మాణం నిమిత్తం పలు గ్రామాలను ప్రభుత్వ కార్యాలయాలను ఇందుకూరు ఇందుకూరుపేట పరిసర ప్రాంతాలకు తరలించడం జరిగినది దీనిలో భాగంగానే దేవీపట్నం లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇందుకూరు హైస్కూల్ నందు ఏర్పాటు చేయడం జరిగినది ఇదే హై స్కూల్ నందు కాలేజీ కొరకు నూతన బిల్డింగు నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి ఈ కాలేజీలో విద్యార్థులకు సీఈసీ, ఎంపీసీ, బైపిసి,,హెచ్ ఈ సి గ్రూపులకు విద్యార్థినీ విద్యార్థులకు విద్యాబోధన చేయడం జరుగుతుంది దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉండటం కోసం బాలురకు ప్రత్యేకంగా హాస్టల్ వసతి సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతున్నది ఈ వసతి సౌకర్యం ఏర్పాటు చేయడం వల్ల పేద విద్యార్థులకు దూర ప్రాంతంలో వెళ్లే ఇబ్బంది లేకుండా ఇక్కడే విద్యాభ్యాసం చేసి వసతి గృహం లో ఉండే సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుందని, సీనియర్ అధ్యాపకులచే ఉత్తమ బోధన అందించడం జరుగుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు, హాస్టల్ వెల్ఫేర్ అధికారి పచ్చు కూరు అర్జునుడు తెలిపారు.

## నాగారం గ్రామంలో ఘోర రోడ్డు ప్రమాదం ఒకరు మృతి, మరొకరికి గాయాలు



జగిత్యాల, జూన్ 9 (భారత శక్తి ప్రతినిధి): ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన పులి గంగాధర్ (43) మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గంగాధర్ కమలాపూర్‌లో ట్యాంకర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం, తాను నడుపుతున్న ట్యాంకర్ ట్రాక్టర్‌ను మరమ్మతుల కోసం జగిత్యాలకు తీసుకెళ్తుండగా నాగారం గ్రామ శివారులోని కల్లుమండవ సమీపంలో ట్రాక్టర్ ముందు టైర్ పగిలింది. దీంతో ఎదురుగా వస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్‌ను ఢీకొని ట్రాక్టర్ అదుపుతప్పి రహదారి పక్కనున్న మర్రిచెట్టు వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న గంగాధర్ వాహనం నుంచి ఎగిరిపడి తలకు, శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న మామిడి సాయి కృష్ణకు గాయాలయ్యాయి. మృతుడి తల్లి పులి లింగవ్వ ఫిర్యాదు మేరకు ధర్మపురి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ధర్మపురి సబ్ ఇన్‌స్పెక్టర్ జి. మహేష్ తెలిపారు.

## కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి జూన్ 18న “చలో హైదరాబాద్”




సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 9: కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు గురి అవుతున్నామని బిల్లులో కోసమే సభను నిర్వహిస్తున్నామని కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి జూన్ 18న తలపెట్టిన ఈ సభకు సంగారెడ్డి జిల్లా నుండి పెద్ద సంఖ్యలో కాంట్రాక్టర్లు తరలిరావాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. నిర్మాణ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జూన్ 18న హైదరాబాద్‌లో నిర్వహించనున్న “చలో హైదరాబాద్” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బి ఏ ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు డి. రవీందర్ రెడ్డి, ఆల్ ఇండియా పాస్ట్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డి.ఎన్.ఎస్. రెడ్డి, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బి.ఎన్.ఎస్. రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సి.హెచ్. పవన్, రాష్ట్ర ట్రెజరర్ జి. సంతోష్ రెడ్డి, సంగారెడ్డి సెంటర్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా నాయకులు శ్రీధర్ రెడ్డి, సత్యం, అశోక్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని శివ బ్యాంక్ వెట్ హాల్లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి మెదక్ జిల్లా సన్నాహక సమావేశం సంగారెడ్డి సెంట్రల్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రైవేట్ రంగంతో పాటు ప్రభుత్వ ఇంజినీరింగ్ శాఖల్లో సేవలందిస్తున్న కాంట్రాక్టర్ల వ్యవస్థ ప్రస్తుతం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడం, సిమెంట్, ఇనుము, డీజిల్ వంటి నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం, జీఎస్టీ భారం అధికంగా ఉండటం వల్ల కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా అనేక మంది కాంట్రాక్టర్లు అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కాంట్రాక్టర్లు కీలక భాగస్వాములని, రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యా, వైద్య రంగాల మౌలిక సదుపాయాల నిర్మాణంలో వారి సేవలు అమూల్యమని అన్నారు. ఈ విషయమై దృష్టి సారించి ప్రభుత్వం పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి, నిర్మాణ రంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జూన్ 18న హైదరాబాద్‌లో జరిగే “చలో హైదరాబాద్” కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేందర్ రెడ్డి, వీరారెడ్డి, సుధాకర్, మనోజ్, నవీన్ రెడ్డి, అశోక్, భాస్కర్ రెడ్డి, విష్ణువర్ధన్, పి భాస్కర్ రెడ్డి, జావేద్, వి రవీందర్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## అక్రమ మైనింగ్‌కు చెక్ వానకొండయ్య గుట్ట క్వారీ లీజు రద్దు: పల్లా సుందర్ రాం రెడ్డి



జనగామ(భారత శక్తి)జూన్ 9: దేవరుప్పుల మండలంలోని కడవెండి గ్రామ శివారులోని వానకొండయ్య గుట్ట వద్ద జిల్లా బీఆర్ఎస్ నాయకుడు పల్లా సుందర్ రాం రెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు చేసిన పోరాట ఫలితంగానే వానకొండయ్య గుట్టలో మైనింగ్ కార్యకలాపాలు నిలిపివేయబడి, క్వారీ లీజు రద్దుకు దారితీసిందని పేర్కొన్నారు. 2018లో ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందిన ప్రాజెక్టుకు ఇప్పుడు మైనింగ్ కార్యకలాపాలు ఎలా నిర్వహిస్తున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వానకొండయ్య గుట్టలో మైనింగ్ పనులకు అనుమతి ఇవ్వలేదని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల కోసం మైనింగ్‌కు అనుమతులు ఇస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల కంటే స్కాములు, కమిషన్లకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు.ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేసే పార్టీగా బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని ఆయన అన్నారు. వానకొండయ్య జాతర అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే యశాశ్విని రెడ్డి కోటి రూపాయల నిధులు తీసుకొచ్చామని చెప్పారని, ఆ నిధులు ఎక్కడ ఖర్చు చేశారో ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ పార్టీ ఆరాటం తప్ప పోరాటం పేరు అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు దీ=హా నాయకులు,మండలపార్టీ అధ్యక్షులు తీగల దయాకర్. ఏల సుందర్. కోతి ప్రవీణ్, పాము మోహన్,జొగు నరసయ్య. రాము సింగ్ నాయక్. వివిధగ్రామల సర్పంచులు పార్టీ నాయకులు అధ్యక్ష కార్యదర్శులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శాటర్ డే.. నో బ్యాగ్ డే

**వరంగల్(భారత శక్తి)** తెలంగాణలోని పాఠశాల విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ విద్యాశాఖ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఈసారి కేవలం చదువుకే పరిమితం కాకుండా విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్యాలెండర్‌లో పెద్దపీట వేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో.. క్యాలెండర్‌లోనే ప్రతిరోజూ క్రీడలు, ఆటలు నిర్వహించాలనే నిబంధనను విద్యాశాఖ పొందుపరిచింది.కొత్త నిబంధనల ప్రకారం.. పాఠశాలల్లో పిల్లలకు సాధారణ బోధనతో పాటు ప్రతిరోజూ క్రీడలు నిర్వహించాలి. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంచేందుకు కథల పుస్తకాలు, పత్రికలు, మ్యాగజైన్లు లాంటి వాటిని రోజుకు అరగంట పాటు చదివించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వీటితో పాటు ప్రార్థన సమయంలో లేదా అది పూర్తయిన తర్వాత తరగతి గదిలో ఐదు నిమిషాల పాటు విద్యార్థులకు యోగా లేదా ధ్యానం చేయించడం తప్పనిసరి చేశారు.ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలు మొత్తం 227 రోజులు పాటు పనిచేస్తాయి. పదో తరగతి సిలబస్‌ను 2027 జనవరి 10వ తేదీ నాటికి, మిగిలిన తరగతులకు ఫిబ్రవరి 28 నాటికి పూర్తి చేయాలని అధికారులు గడువు విధించారు. వచ్చే ఏప్రిల్ 23వ తేదీ పాఠశాలలకు చివరి పనిదినంగా ఉంటుంది. వచ్చే సంవత్సరం ఏప్రిల్ 24 నుంచి జూన్ 13వ తేదీ వరకు (2027) వేసవి సెలవులు ఉంటాయి. 2027 మార్చి 15 నుంచి చివరి పనిదినం వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. తొలిసారిగా ఈ ఒంటిపూట బడుల తేదీలను విద్యా క్యాలెండర్‌లోనే ముందుగా ప్రకటించడం విశేషం.ఇక ప్రతి నెలా మూడో శనివారం విద్యార్థులకు నో బ్యాగ్ డేగా అమలు చేస్తారు. అదే రోజున అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశాలు కూడా జరపాలి. 1 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు భోజన విరామం తర్వాత సెప్టెంబరు వరకు ప్రతిరోజూ ఒక సబ్జెక్టుపై ప్రత్యేకంగా రెమిడియల్ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. దీనివల్ల చదువులో వెనుకబడిన విద్యార్థులు సబ్జెక్టులపై అవగాహన పెంచుకునే అవకాశం లభిస్తుంది. కాగా.. మే 14న ప్రారంభమైన బడిబాట కార్యక్రమాన్ని ఈ నెల 19 వరకు కొనసాగించాలని విద్యాశాఖ ఆదేశించింది. అలాగే.. గత ఏడాది స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను 6 నుంచి 7కు పెంచగా.. ఈసారి మళ్లీ వాటిని 6కు తగ్గించారు. ఈ సమావేశాలు జులై, ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు, డిసెంబరు, ఫిబ్రవరి నెలల్లో జరుగుతాయి.విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు వివిధ సైన్స్ ప్రదర్శనల షెడ్యూల్‌ను క్యాలెండర్‌లో చేర్చారు. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025-26 జాతీయస్థాయి ఎగ్జిబిషన్‌ను అక్టోబరులో నిర్వహించనున్నారు. 2026-27 సంవత్సరానికి సంబంధించి జిల్లా స్థాయి పోటీలను నవంబరు లేదా డిసెంబరులో, రాష్ట్రస్థాయి పోటీలను డిసెంబరు లేదా జనవరిలో జరుపుతారు. సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ 2027 జనవరిలో నిర్వహించనున్నారు.

# రేవంత్ మైండ్ గేమ్‌లో కేసీఆర్

**హైదరాబాద్ (భారత శక్తి):** కేసీఆర్ దమ్ముంటే అసెంబ్లీకి రావాలి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై చర్చ పెడదాం. ఒకవేళ ఆ చర్చలో నేను ఓడిపోతే అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ కు క్షమాపణలు చెబుతా" "వచ్చే ఎన్నికల్లో నా సంగతి చూస్తానంటున్న కేసీఆర్ కు పాలమూరు గడ్డపై సవాలు విసురుతున్నా. నిన్ను మళ్లీ మొలకెత్తనివ్వం. మీ పార్టీ జెండాలు ఎగురనివ్వం. గద్దెలు కూలుతాయి. పార్టీ గుర్తును మర్చిపోవాల్సిందే" "వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రావటం ఖాయం. ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్. కాంగ్రెస్ సర్కారు ఏర్పాటు తథ్యం. వచ్చే ఎన్నికల్లో ఆయన డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించిన ఊళ్లలో కేసీఆర్ ఓట్లు అడగాలి. నేను ఇందిరమ్మ ఇళ్లు కట్టిన ఊళ్లల్లో ఓట్లు అడుగుతా. ఇలా చేస్తే కేసీఆర్ కు డిపాజిట్లు కూడా రావు'. "పాలూమరు ప్రాజెక్టులపై పాదయాత్ర చేస్తామని బీఆర్ఎస్ నాయకులు బయలుదేరారు. పాలమూరు నుంచి కాశీ వరకు పొర్లుదండాలు పెట్టినా వాళ్ల పాపాలు తీరవు. ప్రజలు క్షమించరు" "ప్రజలు ఇచ్చిన ధైర్యంతో గల్లీలో ఉండే కేడీతోనైనా.. ఢిల్లీలో ఉండే మోడీతో అయినా కొట్లాడతా. కేసీఆర్ మేకవన్నె పులి అని గుర్తించక రెండుసార్లు ముఖ్యమంత్రి చేశాం. దొంగలకు సద్దులు మోసే వారితో జాగ్రత్తగా ఉండాలి. మన వారైనా అప్రమత్తత అవసరం. వనపర్తిలో ఒకరు.. పాలమూరులో ఒకరు మోపు అయ్యారు.తాజాగా మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో ప్రజాపాలన – ప్రగతి ఉత్సవాల సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో కీలకమైనవి. ఎప్పటిలానే ఆయన తరచూ తాను చెప్పే కొన్ని మాటల్ని ఈ సభలోనూ రిపీట్ చేశారు. ఎప్పటిలానే మరోసారి కేసీఆర్ కు సవాలు విసిరారు. గతంలో అసెంబ్లీకి రావాలని తరచూ కోరే ఆయన..ఇటీవల కాలంలో అసెంబ్లీలో చర్చకు రావాలన్న ఛాలెంజ్ చేశారు. గతానికి ఈసారి తేడా ఒక్కటే. అసెంబ్లీలో నిర్వహించే చర్చలో తాను కానీ ఓడితే అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ కు క్షమాపణలు చెబుతానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.తెలంగాణాలో రాజకీయాన్ని ఏకపక్షం చేసుకోవాలని కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తున్నట్లుగా కనిపిస్తోంది. రాజకీయాల్లో అదను చూసి దెబ్బ తీయాలని సామెత ఉంది. విపక్షం వీక్ గా ఉన్నపుడే జోరు చేయాలని తెలిసిన వారే ముందుకు సాగుతారు. రేవంత్ రెడ్డి ఇపుడు అదే పంథాను అనుసరిస్తున్నారు. బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ అయితే గత రెండున్నరేళ్ళుగా ఫాం హౌజ్ లోనే ఉంటున్నారు. ఓటమి తరువాత ఎందుకో ఆయన మునుపటి మాదిరిగా దూకుడు చేయడం లేదు. దాంతో ఈ అవకాశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అతి పెద్ద అడ్వాంటేజ్ గా తీసుకుని స్పీడ్ పెంచేశారు అని అంటున్నారు. రేవంత్ రెడ్డి సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఎన్నికలు నేడో రేపో అన్నట్లుగా ఆయన హడావుడి చేస్తున్నారు. తాజాగా చూస్తే ఆయన బీఆర్ఎస్ కి బలం ఉంది అన్న చోట పాలమూరు లో పర్యటించారు. అక్కడ భారీ బహిరంగ సభను నిర్వహించడమే కాదు ఏకంగా కేసీఆర్ కే సవాల్ చేశారు. తన రెండున్నరేళ్ల పాలన కేసీఆర్ పదేళ్ల పాలనకు తేడా ఏంటో చర్చిద్దాం సిద్ధమేనా అని సవాల్ చేశారు. కేసీఆర్ చర్చకు రెడీ అంటే తాను కూడా రెడీ అన్నారు. అభివృద్ధి సంక్షేమం విషయంలో తాను బీఆర్ఎస్ కంటే మెరుగైన పాలన అందిస్తున్నానని రేవంత్ రెడ్డి చెప్పుకున్నారు. ఇక ఈ మధ్య కాలంలో అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని తమ ప్రభుత్వం ఏమి చేసిందో తాను చెబుతాను అని కూడా రేవంత్ రెడ్డి చెప్పారు.కేసీఆర్ అయితే జనం లోకి రావడం లేదు. ఆయన గత డిసెంబర్ లో ప్రెస్ మీట్ పెట్టారు. ఒక రోజు శీతాకాల సమావేశాలకు అటెండ్ అయ్యారు. 2026 లో కొత్త ఏడాదిలో మూడు ప్రాంతాలలో మూడు భారీ బహిరంగ సభలు పెడతామని కూడా ప్రకటించారు. కానీ అవేమీ జరగలేదు. యధా ప్రకారం కేసీఆర్ ఫాం హౌజ్ కే పరిమితం అయిపోయారు. మరో వైపు బీఆర్ఎస్ నుంచి కవిత బయటకు వెళ్ళి కొత్త పార్టీని పెట్టుకుంది ఆమె బాణాలు బీఆర్ఎస్ మీదనే ఎక్కుపెడుతోంది. అదొక చికాకు అనుకుంటే హరీష్ రావు బీజేపీలో చేరిపోతున్నారని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రకటనలు మరో చికాకుగా మారాయి. వాటికి హరీష్ రావు ధీటుగా బదులిస్తూ ఖండిస్తున్నప్పటికీ జనంలో గులాబీ పార్టీ రేకులు విడిపోతున్నాయని చెప్పడానికే ఈ వ్యూహాత్మకమైన విమర్శలు అన్నది కూడా ఉంది. ఇక కేటీఆర్ విమర్శలు కానీ ఆయన స్టేట్మెంట్స్ కానీ కాంగ్రెస్ పట్టించుకోవడం లేదు. తన మీదకు ఇద్దరు నాయకులను వదిలేశారని కానీ వారి వల్ల ఏమీ కాదని రేవంత్ రెడ్డి హరీష్ కేటీఆర్ లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు గమనార్హం. తనకు సమ ఉజ్జీ కేసీఆర్ తప్ప బీఆర్ఎస్ లో ఎవరూ కారని రేవంత్ రెడ్డి చెప్పకనే చెబుతున్నారని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే కేసీఆర్ ఇప్పటప్పట్లో వచ్చే అవకాశం అయితే కనిపించడం లేదని అంటున్నారు. దాంతో రేవంత్ రెడ్డి దూకుడు రాజకీయం తెలంగాణాలో కొనసాగుతోంది. పైగా 2034 వరకూ మాదే అధికారం అని బల్ల గుద్ది మరీ రేవంత్ రెడ్డి చెబుతున్నారు.

# రేవంత్ వర్సెస్ పవన్

**హైదరాబాద్ (భారత శక్తి)** సాధారణంగా రాజకీయాలలో కొందరి మధ్య వైరం అనేది అంత ఈజీగా సాధ్యం కాదు. ఎందుకంటే వారి మధ్య అటువంటి వ్యవహారాలు ఎప్పుడూ చోటు చేసుకోవు కాబట్టి.. ప్రజలు ఆ విధంగా ఆలోచించరు. కానీ తెలంగాణలో అందుకు విరుద్ధమైన పరిస్థితులు చోటుచేసుకున్నాయి.. ఎవరు ఊహించని విధంగా.. కలలో కూడా అనుకోని విధంగా రాజకీయ వైరం ఏర్పడింది. అది కాస్త ఒక రకమైన సంచలనానికి దారితీసింది. ఇది ఎటువైపు వెళుతుంది.. దేని వైపు దారితీస్తుందో చూడాలి.ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడిన మాటల తర్వాత.. అది రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ సంచలనం సృష్టించిన తర్వాత.. ఈ ఎపిసోడ్లోకి కాంగ్రెస్ నాయకులు వచ్చేసారు. ఆ విశ్లేషకుడిని బాధిత పక్షం లాగా చూపించేందుకు ప్రయత్నాలు చేశారు. ముందుగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ ఈ వ్యవహారంలోకి ప్రవేశించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను హైదరాబాద్ ఖాళీ చేసి వెళ్లిపోవాలని.. డిమాండ్ చేశారు. ఆ తర్వాత జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ ప్యాకేజి స్టార్ అంటూ మండిపడ్డారు. ఇక టీఆర్ఎస్ అధినేత్రి పళ్లు రాలుతాయి అంటూ పవన్ కళ్యాణ్ మీద మండిపడ్డారు. కాంగ్రెస్ మంత్రి పొన్నం ప్రభాకర్ పవన్ కళ్యాణ్ బిజెపి, బీఆర్ఎస్ కు అమ్ముడుపోయిన వ్యక్తి అని.. ఆయన ఒక ప్యాకెజిస్టార్ అంటూ ఆరోపించారు..ఈ పరిణామాల తర్వాత పవన్ కళ్యాణ్ స్పందించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలను పెద్దగా లెక్కలోకి తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఎప్పుడైతే హస్తం పార్టీ నాయకులు తనమీద విమర్శలు చేయడం మొదలుపెట్టారో ఆయన నేరుగా రంగంలోకి దిగారు. అంతేకాదు.. తెలంగాణలోని గచ్చిబౌలి ప్రాంతంలో సంధ్య కన్వెన్షన్ హాల్ లో అంతర్గత సమావేశం నిర్వహించుకుంటామని తెలంగాణ పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం చివరి నిమిషంలో పవన్ కళ్యాణ్ కు హ్యాండ్ ఇచ్చింది. దీనికి తెలంగాణ పోలీసులు చెప్పిన కారణమేంటంటే.. ప్రొఫెసర్ నాగేశ్వర్ మీద జనసేన నాయకులు విమర్శలు చేయడం ద్వారా.. తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతిన్నది.. తెలంగాణ ప్రజలు పవన్ కళ్యాణ్ మీద ఆగ్రహంగా ఉన్నారు.. అందువల్ల ఈ సమావేశానికి అనుమతి ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. జన సేన అధినేత తన గృహం నుంచి విలేకరుల సమావేశం నిర్వహించారు. చాలా ఆవేశంగా మాట్లాడారు. తాను ఇక్కడ పోటీ చేసే విషయం మీద స్పష్టత ఇచ్చారు. పోరాటల పురిటిగడ్డలో ఎందుకు సమావేశంనిర్వహిస్తున్న విషయం మీద కూడా క్లారిటీ ఇచ్చారు. జనసేన అధినేత మీద కవిత ఆరోపణలు చేస్తే ఒక రకంగా తీసుకోవచ్చు. ఎందుకంటే ఆమెకు ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకమైన గుర్తింపు కావాలి. అందువల్లే ఆమె అలా చేస్తుందనుకోవచ్చు. భారత రాష్ట్ర సమితి పవన్ కళ్యాణ్ మీద విమర్శలు చేస్తే.. దాన్ని కూడా ఒక రకంగా తీసుకోవచ్చు. ఎందుకంటే భారత రాష్ట్ర సమితికి ఆంధ్రా ప్రాంతం మీద.. అక్కడి రాజకీయ నాయకుల మీద విమర్శలు చేస్తేనే ఆ పార్టీకి మనుగడ. అదే గనుక లేకపోతే ఆ పార్టీకి తెలంగాణలో కొనసాగింపు ఉండదుభారత రాష్ట్ర సమితి నుంచి కవిత వరకు ఏపీ డిప్యూటీ సీఎం మీద విమర్శలు చేశారంటే దాని వెనక ఒక అర్థం ఉంది. కానీ కాంగ్రెస్ నాయకులు ఈ స్థాయిలో జనసేన అధినేత మీద విమర్శలు చేయడం నిజంగా ఆశ్చర్యం. రేవంత్ రెడ్డి ఆదేశాల లేకుండా వారు ఇలా చేశారనుకోవడానికి లేదు. కానీ ఈ ఉద్దేశ్యాలు ఆశించి కాంగ్రెస్ పార్టీ ఇలాంటి విమర్శలు చేస్తుందో అర్థం కావడం లేదు..త్వరలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికలు అన్ని పార్టీలకు అత్యంత ప్రతిష్టాత్మకం. అలాంటప్పుడు తెలంగాణ సెంటిమెంట్ రగిలితేనే ఓట్లు పడతాయని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందువల్లే జనసేన అధినేత మీద ఈ స్థాయిలో విమర్శలు చేసినట్టు కనిపిస్తోంది. కానీ హైదరాబాదులో సెటిలర్ ఓటర్లు చాలా ఎక్కువగా ఉన్నారు. పవన్ కళ్యాణ్ మీద విమర్శలు చేస్తే..ఆంధ్రా వాదం మీద ఆరోపణలు చేస్తే అప్పుడు ఆ ఓట్లు వేరే పార్టీ వైపు వెళ్లే అవకాశం ఉంది.మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తానని జనసేనాని స్పష్టం చేశారు. అలాంటప్పుడు కాంగ్రెస్ ఎందుకు అతడిని టార్గెట్ చేసినట్టు.. కాంగ్రెస్ జాతీయ పార్టీ.. మన పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్లో కూడా రాజకీయాలు చేస్తోంది. అలాంటప్పుడు పవన్ కళ్యాణ్ విషయంలో రేవంత్ ఇలాంటి వైఖరి ఎందుకు తీసుకున్నారు.. భారత రాష్ట్ర సమితికి అవకాశం ఇవ్వకూడదనా.. పవన్ కళ్యాణ్ వస్తే భారత రాష్ట్ర సమితికి ప్రయోజనం దక్కుతుందనా.. ఈ ప్రశ్నలు రాజకీయ విశ్లేషకులు వేస్తున్నారు.. ఒకవేళ ఇదే విధానం కనుక రేవంత్ రెడ్డిది అయితే.. ఆయన ముందుగానే మేల్కొన్నట్టు..కానీ, గత ఎన్నికల్లో సెటిలర్ ఓటర్లు భారత రాష్ట్ర సమితి వైపు మొగ్గు చూపించారు. ఇప్పుడు పవన్ కళ్యాణ్ విషయంలో రేవంత్ రెడ్డి కొనసాగించిన వైఖరి వల్ల వారి ఓట్లు ఎటువైపు వెళ్తాయో చూడాల్సి ఉంది. కాకపోతే ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్న వ్యాఖ్యల ద్వారా గోటితో పోయే వ్యవహారాన్ని ఇక్కడ దాకా తీసుకొచ్చారు. రెండు రాష్ట్రాల మధ్య వివాదంగా మార్చారు. అయితే ఇది ఎక్కడదాకా దారి తీస్తుందో చూడాల్సి ఉంది.

# రాంగ్ రూట్‌లో వస్తే అడ్డంగా బుక్కైనట్టే...

## - 100 ప్రధాన మార్గాల్లో సీసీ కెమెరాలు..

**హైదరాబాద్, (భారత శక్తి)**ట్రాఫిక్ పోలీసులు లేరు కదా అని కాస్త దూరం తగ్గించుకోవడానికి అడ్డదారిలో బండి నడిపితే ఇకపై నేరుగా కెమెరా కంటికి చిక్కాల్సిందే. నగరంలో రాంగ్ సైడ్ డ్రైవింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ట్రాఫిక్ విభాగం పూర్తిగా సిద్ధమైంది. అడ్డదారిలో వెళ్తూ నిబంధనలు ఉల్లంఘిస్తే క్షణాల వ్యవధిలోనే మొబైల్‌కు ఈ-చలానా సందేశం వచ్చేలా ఏర్పాట్లు చేశారు. పదేపదే ఇలాంటి తప్పులకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి కూడా పోలీసులు వెనుకాడటం లేదు.నగరవ్యాప్తంగా వాహనదారులు అడ్డదారిలో ప్రయాణిస్తున్నట్లు సుమారు 200కు పైగా ప్రాంతాలను ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. వీటిలో అత్యంత ప్రధానమైన 100 మార్గాల్లో అత్యాధునిక సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే వారిని ఈ కెమెరాల ద్వారా గుర్తించి, కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి నేరుగా జరిమానాలు విధిస్తున్నారు.ఎలాగైనా వెంటనే గమ్యస్థానానికి చేరాలనే తొందరతో వాహనదారులు తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఈ సంవత్సరం కేవలం 5 నెలల వ్యవధిలోనే రాంగ్‌రూట్ ప్రయాణాల వల్ల 50కి పైగా ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో కుటుంబానికి ఆధారమైన ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. ఉదయం, రాత్రి వేళల్లో రోడ్లు ఖాళీగా ఉంటాయని, పోలీసులు ఉండరనే ఉద్దేశంతో ఇష్టానుసారంగా ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.ఎదురుగా వాహనాలు వేగంగా దూసుకొస్తున్నా వినకుండా అడ్డదారిలో వచ్చే వాహనదారులు, పోలీసుల తనిఖీల్లో పట్టుబడినప్పుడు రకరకాల సాకులు చెబుతున్నారు. చుట్టూ తిరిగి రావడం ఇబ్బందని, కొద్ది దూరమే కదా వచ్చామంటూ మాయమాటలతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరికొందరైతే అడ్డదారిలో రావడమే కాకుండా పోలీసులతో గొడవకు దిగుతూ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తున్న వారిపై ప్రతి నెల నమోదవుతున్న కేసుల్లో సగానికి పైగా (20 మందిపై కేసులు నమోదైతే అందులో 10 మంది) రాంగ్ సైడ్‌లో వచ్చే వాహనదారులే ఉంటుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.మలుపులు దూరంగా ఉన్నాయని కాలనీల్లోకి వెళ్లేందుకు రాంగ్‌సైడ్‌ను ఎంచుకునే వాహనదారులు, ట్రాఫిక్ చలానాల నుండి తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్లను తొలగించడం లేదా మార్చడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నారు. నగరంలో కేవలం ఒక నెల వ్యవధిలోనే రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై 30 ప్రాంతాల్లోనే ఏకంగా 2 లక్షలకు పైగా ఈ-చలానాలు నమోదు కావడం ఈ ఉల్లంఘనల తీవ్రతను నిరూపిస్తోంది.నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఎదురవుతున్న ప్రాంతాలుగా షేక్‌పేట్, ఫిలింనగర్, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, టోలిచౌకి, మెహదీపట్నం, మాసబ్‌ట్యాంక్, అత్తాపూర్, చార్మినార్, అబిడ్స్, నారాయణగూడ, ఖైరతాబాద్, పంజాగుట్ట, బేగంపేట్, అమీర్‌పేట్, రాణిగంజ్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, అఫ్జల్‌గంజ్, కాచిగూడ, సుల్తాన్‌బజార్ వంటి నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించారు. ఈ ప్రదేశాలలో అడ్డదారి ప్రయాణాల వల్ల తరచూ తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

### విశాఖ స్టీల్ ఘటనలో

# తొమ్మిదికి చేరిన మృతుల సంఖ్య

**విశాఖపట్నం(భారత శక్తి)** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతుల సంఖ్య తొమ్మిదికి చేరింది. మరో ఆరుగురు కార్మికులకు గాయాలు అయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. సోమవారం నాడు సాయంత్రం 1500 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉన్న 150 టన్నుల మోల్టెన్ మెటల్ లాడెల్ పేలిపోయి, దాదాపు 25 అడుగుల విస్తీర్ణంలో హాట్ మెటల్ ఎగసిపడింది. ఘటన సమీపంలో ఉన్న కార్మికుల మీద హాట్ మెటల్ పడడంతో, ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడంతో ప్రాణాలు తొమ్మిది మంది కోల్పోయారు. మృతులు: గోల్డ్ కుమార్ (మేనేజర్) జీవీ అప్పారావు (సైడ్ ఆపరేటర్) ప్రభాకరరావు (స్టాండ్ 3 ఆపరేటర్) జి.భానుకుమార్ (షిఫ్ట్ ఇన్చార్జి, స్టాండ్-ఆ) కృష్ణ నాగు (స్టాడ్ -4 ఆపరేటర్) రమణ (పౌడర్ కలాసీ-కాంట్రాక్ట్ వర్కర్) త్రినాథ్ (స్టాండ్ ఆపరేటర్-కాం ట్రాక్టు వర్కర్) ఎన్. అప్పలరాజుగా (స్టాండ్ ఆపరేటర్- కాంట్రాక్టు వర్కర్) గుర్తుతెలియని మరో వ్యక్తి క్షతగాత్రులు: పైడిరాజు రావూరి మల్లికార్జునరావు పల్లెల శ్రీనివాస్ అర్జున్ అప్పారావు సత్యానంద్ సూరిబాబు స్టీల్ మెల్టింగ్ షాప్) నిర్వహణ ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడంతోనే ఈ ప్రమాదం జరిగిందని కార్మికుల ఆరోపణలు. ఇదే నాటూ?1లో మెటల్ రన్సింగ్ ప్రక్రియ సరిగ్గా చేయక గత నాలుగు రోజుల కింద హాట్ మెటల్ ఎగసిపడిందని, కానీ ప్రమాద తీవ్రత ఎక్కువగా లేదని, ఆరోజే జాగ్రత్త పడి ఉంటే ఇంత పెద్ద ప్రమాదం జరిగేది కాదని చెప్తున్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్ట పరిహారం ప్రకటిచారు.

# గంజాయి మత్తులో యువకుల వీరంగం

**సత్తెనపల్లి(భారత శక్తి)** గంజాయి మత్తులో యువకుతు వీరంగం సృష్టించారు. ఒక మహిళతో వాగ్వాదం చేసారు. వలస కూలీపై విచక్షణారహితంగా దాడి చేసారు. దాడికి పాల్పడిన యువకులు జనసేన కార్యకర్తలుగా స్థానికులు చెబుతున్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని దమ్మాలపాడులో ఘటన జరిగింది. రామాలయ నిర్మాణ పనుల కోసం వచ్చామని చెప్పినా వినిపించుకోకుండా కార్మికుడిపై దాడి జరిపారని బాధితుడు పేర్కొన్నాడు.

# అర్ అండ్ బీ ఈఎన్సీ ఇంటిపై ఏసీబీ దాడులు

**హైదరాబాద్ (భారత శక్తి)**ఆర్.అండ్.బి. ఈ ఎన్ సి అధికారి మోహన్ నాయక్ పై ఏసీబీ దాడులు జరిపింది. మంగళవారం ఉదయం నుంచి మియాపూర్ లోని మోహన్ నాయక్ నివాసం లో సోదాలు కొనసాగుతున్నాయి. మోహన్ నాయక్ ఇంటి తో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ ఉదయం నుండి దాడులు జరగుతున్నాయి. మియాపూర్ లోని వసంత సిటీ విల్లా నెంబర్ 98 లో మోహన్ నాయక్ వుంటున్నారు.

# స్టీల్ ప్లాంట్లో జరిగిన ఘటన దురదృష్టకరం

**- మంత్రి వాసంశెట్టి సుభాష్**



**విశాఖపట్నం(భారత శక్తి)** విశాఖ స్టీల్ ప్లాంట్లో జరిగిన ఘటన దురదృష్టకరం. ప్రమాదంలో గాయపడిన ముగ్గురు ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించానని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.మంత్రి మాట్లాడుతూ గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందుతోంది. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాం. గాయపడిన వారికి రూ.10 లక్షల ఎక్స్గ్రేషియా అందజేస్తాం. కార్మిక సంఘాల నేతలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. ప్రమాదం జరిగిన సమయంలో అవసరమైన సంఖ్యలోనే కార్మికులు విధుల్లో ఉన్నారు. ప్లాంట్లో భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాం. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని అన్నారు.

# మూడు మృతదేహాల గుర్తింపు

**విశాఖపట్నం (భారత శక్తి)** విశాఖ స్టీల్ప్లాంట్ ప్రమాద ఘటనలో ముగ్గురి మృతదేహాలు గుర్తింపు పూర్తయింది. భానుకుమార్, రమణ, అప్పలరాజు, మృతదేహాలను అధికారులు గుర్తించారు. మిగిలినవారి మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నందున.. డిఎన్ఏ పరీక్షల కోసం బాధిత కుటుంబాల నుంచి నమూనాలు సేకరించారు. సేకరించిన ఆరెం నమూనాలను విజయవాడ ల్యాబ్కు కేజీహెచ్ సిబ్బంది పంపుతున్నారు.

# ఘటన అత్యంత విషాదకరం

**- కేంద్రమంత్రి కుమారస్వామి**

**విశాఖపట్నం(భారత శక్తి)** విశాఖ స్టీల్ ప్లాంట్లో అగ్నిప్రమాద ఘటన అత్యంత విషాదకరం అని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, హోంమంత్రి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, ఎంపీ భరత్తో కలిసి ప్రమాద స్థలాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గాయపడిన కార్మికులను పరామర్శించి, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులను, బాధి కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

# తాగు నీరు కోసం నీళ్ల ట్యాంకు పెకెక్కి నిరసన

**మీర్ పేట్ (భారత శక్తి)**తాగడానికి చుక్క నీళ్లు ఇవలేని ఎమ్మెల్యే మాకొద్దని మీర్పేట్ డబల్ బెడ్ రూమ్ కాలనీ ప్రజలు నిరసనకు దిగారు. డౌన్ డౌన్ రేవంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలతో బిందెలతో నీళ్ల ట్యాంకు పైకి ఎక్కి నిరసన తెలిపారు.

# రొయ్యల రైతుల సంక్షేమం, ఆక్వాకల్చర్ రంగాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## - ఫీడ్ ధరల అంశంపై రైతులు, తయారీదారులు పరస్పర అంగీకారంతో ముందుకు రావాలి

## - అదనంగా 12 వేల ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లకు యూనిట్‌కు రూ.1.50 రాయితీ

## - ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


**అమరావతి/విజయవాడ,(భారత శక్తి)** రాష్ట్రంలో ఆక్వాకల్చర్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రొయ్యల రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో రొయ్యల రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, సముద్ర ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు తదితర రంగ ప్రతినిధులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రొయ్యల ఫీడ్ ధరల పెరుగుదలపై రైతులు, పరిశ్రమ వర్గాలు తమ అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చాయని మంత్రి తెలిపారు. ఫిష్‌మీల్, సోయాబీన్ తదితర ముడి పదార్థాల ధరలు పెరగడంతో ఉత్పత్తి వ్యయాలు అధికమయ్యాయని తయారీ సంస్థలు వివరించగా, ఇప్పటికే ఖర్చుల భారం పెరిగిన నేపథ్యంలో ధరల పెంపును నియంత్రించాలని రైతులు కోరినట్లు చెప్పారు. ఆక్వాకల్చర్ రంగ సమగ్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రైతులు, తయారీదారులు చర్చల ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారానికి రావాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు.

ఇరు వర్గాలు ఏకాభిప్రాయానికి వచ్చిన తర్వాత తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఫీడ్ ధరల నిర్ణయంలో శాస్త్రీయ విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమైనట్లు మంత్రి వెల్లడించారు. ముడి పదార్థాల ధరలు, టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ)తో పాటు మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తులో పారదర్శక ధరల వ్యవస్థ ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు. ఆక్వాకల్చర్ రైతులకు విద్యుత్ రాయితీపై మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి అదనంగా 12 వేల ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున రాయితీ అందించే ప్రక్రియ తుది దశలో ఉందన్నారు.

ఉత్తర్వులు జారీ అయిన తర్వాత అర్హత కలిగిన అన్ని ఆక్వాకల్చర్ కనెక్షన్లు అవి చిన్న, పెద్ద ఫారాలు అయినా, ఆక్వా జోన్ లేదా నాన్-ఆక్వా జోన్‌లో ఉన్నా ఈ పథకం పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో ఉత్పత్తి వ్యయం తగ్గడంతో పాటు రైతులకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందని తెలిపారు. మత్స్య, ఆక్వాకల్చర్ రంగాల్లో స్థిరమైన అభివృద్ధి, పోటీతత్వ సామర్థ్యాల పెంపు, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.

# కారును ఢీకొన్ డీసీఎం: ప్రయాణికులు క్షేమం

**రంగారెడ్డి** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. మహాలక్ష్మి టిఫిన్ సెంటర్ ఎదురుగా డీసీఎం-కార్ ఢీ కొన్నాయి. ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి డీజీఎం ఢీకొట్టింది. ప్రమాదంతో కారు డివైడర్ పైకెక్కింది. ఘటనతో రోడ్డుపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్ను క్లియర్ చేసి వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసుల ప్రాథమిక అంచనా. ప్రమాదంలో ప్రాణనష్టం లేదని సమాచారం.



## జార్ఖండ్‌లో నత్వానీ వర్సెస్ విజయసాయి

**రాంచీ (భారత శక్తి):** జార్ఖండ్ రాజకీయాల్లో జూన్ 18న జరగబోయే రాజ్యసభ ఎన్నికలు ఇప్పుడు అత్యంత ఆసక్తికరమైన మలుపులు తిరుగుతున్నాయి. అధికార, ప్రతిపక్ష కూటముల మధ్య సీట్ల సర్దుబాటు ఒక కొలిక్కి వచ్చినట్లే కనిపించినా, తెరవెనుక జరుగుతున్న సమీకరణాలు సరికొత్త సస్పెన్స్‌ను రేకెత్తిస్తున్నాయి. జార్ఖండ్ రాజ్యసభ ఎన్నికల వేళ రాంచీ నుండి ఢిల్లీ వరకు పొలిటికల్ హీట్ ఒక్కసారిగా పెరిగింది. అధికార ఇండియా కూటమిలో జార్ఖండ్ ముక్తి మోర్చా , కాంగ్రెస్ మధ్య నెలకొన్న వివాదం ఎట్టకేలకు సమసిపోయింది. సీఎం హేమంత్ సోరెన్, కాంగ్రెస్ పరిశీలకుల మధ్య జరిగిన చర్చల అనంతరం.. జేఎంఎం తరపున మాజీ మంత్రి బైద్యనాథ్ రామ్, కాంగ్రెస్ తరపున ఏఐసీసీ సెక్రటరీ ప్రణవ్ ఝా బరిలోకి దిగుతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 81 మంది సభ్యులున్న జార్ఖండ్ అసెంబ్లీలో ఒక రాజ్యసభ సీటు గెలవడానికి 28 మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం కాగా, అధికార కూటమికి 56 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. ఈ లెక్కన కూటమిలోని రెండు సీట్లు సులభంగా గెలిచే అవకాశం ఉన్నప్పటికీ, తెరవెనుక జరుగుతున్న 'థర్డ్ క్యాండిడేట్' వ్యూహాలు ఇప్పుడు అందరినీ ఉత్కంఠకు గురిచేస్తున్నాయి.ఈ ఎన్నికల్లో అసలైన సస్పెన్స్ ఎక్కడ మొదలైందంటే.. నామినేషన్ దాఖలుకు సమయం దగ్గర పడుతున్న వేళ ముగ్గురు ప్రముఖులు నామినేషన్ పత్రాలను కొనుగోలు చేయడం కలకలం రేపింది. బీజేపీ ప్రతినిధి గౌరవ్ వల్లభ్, ప్రముఖ పారిశ్రామికవేత్త, సిట్టింగ్ ఎంపీ పరిమళ్ నత్వానీతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. విజయసాయిరెడ్డి జార్ఖండ్ రాజ్యసభ ఎన్నికల కోసం నామినేషన్ పత్రాలు తీసుకోవడం జాతీయ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే, అసలు ఏపీకి చెందిన విజయసాయిరెడ్డి జార్ఖండ్ నుండి నామినేషన్ పేపర్లు ఎందుకు కొనుగోలు చేశారు? ఎవరి కోసం కొనుగోలు చేశారు? అనే ప్రశ్నలు ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్‌లో విపరీతంగా హల్‌చల్ చేస్తున్నాయి.విజయసాయిరెడ్డి స్వయంగా పోటీ చేయడానికి ఈ పత్రాలను కొనుగోలు చేయలేదని, దీని వెనుక ఒక పెద్ద కార్పొరేట్, జాతీయ రాజకీయ వ్యూహం దాగి ఉందనే ప్రచారం జరుగుతోంది. పారిశ్రామికవేత్త పరిమళ్ నత్వానీకి మద్దతుగా , ఎన్డీయే కూటమి తరపున వ్యూహాత్మక డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు, ఏదైనా ఊహించని పొలిటికల్ ఈక్వేషన్ మారితే రంగంలోకి దిగడానికి క్లియర్ రూట్ ఉంచుకునేలా ఆయన ఈ పత్రాలను సేకరించినట్లు తెలుస్తోంది. గతంలో పరిమళ్ నత్వానీ జార్ఖండ్ నుండి పోటీ చేసినప్పుడు జేఎంఎం మద్దతు ఇచ్చింది. ఇప్పుడు కూడా నత్వానీ స్వయంగా సీఎం హేమంత్ సోరెన్‌ను కలవడం, ఈ పరిణామాలన్నింటినీ విజయసాయిరెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నట్లుగా నామినేషన్ పత్రాలు తీసుకోవడం వెనుక ఆయనకు ఉన్న అపారమైన ఫైనాన్షియల్ , పొలిటికల్ నెట్‌వర్కింగ్ కారణమని భావిస్తున్నారు. ప్రస్తుతం జార్ఖండ్ అసెంబ్లీలో జేఎంఎంకు 34 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇందులో ఒక అభ్యర్థి విజయానికి 28 ఓట్లు పోగా, ఇంకా 6 అదనపు ఓట్లు మిగిలి ఉంటాయి. ఈ ఆరు ఓట్లను కాంగ్రెస్ అభ్యర్థి ప్రణవ్ ఝాకు బదిలీ చేస్తామని జేఎంఎం బహిరంగంగా చెబుతున్నప్పటికీ, లోపల మాత్రం ఇంకా ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదు. సరిగ్గా ఈ ఆరు ఓట్లను, అలాగే ప్రతిపక్ష బీజేపీ , దాని మిత్రపక్షాల ఓట్లను నమ్ముకునే పరిమళ్ నత్వానీ ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగేందుకు స్కెచ్ వేశారు. ఒకవేళ నత్వానీ గనుక ఎన్డీయే మద్దతుతో రంగంలోకి దిగితే, కాంగ్రెస్ అభ్యర్థి విజయం కష్టతరంగా మారుతుంది.మొత్తంగా చూస్తే, జార్ఖండ్ రాజ్యసభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసే సమయానికి ఎంత మంది ఫైనల్‌గా బరిలో ఉంటారనే దానిపై క్లారిటీ రానుంది. బీజేపీ తొలుత గౌరవ్ వల్లభ్‌ను రంగంలోకి దించాలని భావించినా, ఇప్పుడు వ్యూహం మార్చి నత్వానీకి తెరవెనుక మద్దతు ఇచ్చేలా కనిపిస్తోంది. మరి ఈ కార్పొరేట్ చదరంగంలో విజయసాయిరెడ్డి కొనుగోలు చేసిన నామినేషన్ పత్రాల వెనుక ఉన్న అసలైన లబ్ధిదారుడు ఎవరు? జేఎంఎం ఆరు మిగులు ఓట్లు ఎటు వైపు పడతాయి? అనేది రాబోయే రెండు రోజుల్లో తేలిపోనుంది.

## నీట్ ఎక్సపర్ట్స్ లాక్ డౌన్..

**న్యూఢిల్లీ (భారత శక్తి):** వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యూజీ 2026 రీ ఎగ్జామినేషన్‌కు ముహూర్తం దగ్గరపడుతుండటంతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అసాధారణమైన భద్రతా చర్యలకు శ్రీకారం చుట్టింది. మే 3న జరిగిన మొదటి పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ఎన్‌టీఏ.. ఈసారి జూన్ 21న జరగబోయే రీ టెస్ట్ విషయంలో జీరో ఎర్రర్ పాలసీని అమలు చేస్తోంది. పేపర్ లీకేజీకి అస్సలు ఛాన్స్ లేకుండా పేపర్ తయారీ దశ నుంచే ఊహించని రేంజ్‌లో కట్టుదిట్టమైన కమాండో తరహా భద్రతను ఏర్పాటు చేసింది.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. నీట్ రీ ఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో భాగస్వాములైన సబ్జెక్ట్ నిపుణులు, పర్యవేక్షకులు, వివిధ భాషల్లోకి అనువదించే ట్రాన్స్‌లేటర్లతో కూడిన యావత్ టీమ్‌ను కేంద్ర భద్రతా బలగాల పర్యవేక్షణలో ఒక అత్యంత రహస్య ప్రాంతంలో లాక్‌డౌన్ చేశారు. ఈ లాక్‌డౌన్ ప్రాంగణంలో ఉన్నవారికి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌వాచీలు లేదా ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉన్న ఎలాంటి కమ్యూనికేషన్ పరికరాలనూ అనుమతించడం లేదు. కేవలం ముందస్తు అనుమతి పొందిన ప్రత్యేక సిబ్బందికి మాత్రమే ఈ జోన్‌లోకి ప్రవేశం ఉంటుంది. జూన్ 21న పరీక్ష ముగిసేంతవరకు ఈ నిపుణుల బృందం బయటి ప్రపంచానికి పూర్తిగా దూరంగా ఇదే నిఘా నీడలో గడపనుందిగతంలో రవాణా, స్టోరేజ్ దశల్లోనే లీకేజీలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో.. ఈసారి ఎన్‌టీఏ సరికొత్త మల్టీ లేయర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ను రంగంలోకి దించింది. క్వశ్చన్ పేపర్ల ప్రింటింగ్, ప్యాకేజింగ్, స్టోరేజ్ నుంచి పరీక్షా కేంద్రాలకు చేరే వరకు ప్రతి దశలోనూ బహుళ అంచెల నిఘా ఉంటుంది. అత్యంత కీలకమైన విషయం ఏంటంటే.. ఈ ప్రశ్నపత్రాల రవాణా కోసం ఈసారి భారత వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానాలను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల ప్రైవేట్ రవాణా సంస్థల జోక్యం తగ్గి.. పేపర్లు అత్యంత సురక్షితంగా జిల్లాలకు చేరుకుంటాయి.ఇదిలా ఉండగా.. రీ ఎగ్జామ్ పేపర్ కూడా ముందే లీక్ అయిందంటూ సోషల్ మీడియాలో కొన్ని ఫేక్ వార్తలు చక్కర్లు కొట్టడంపై ఎన్‌టీఏ తీవ్రంగా స్పందించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ దుష్ప్రచారం పూర్తిగా అవాస్తవమని, మోసపూరితమైనదని స్పష్టం చేసింది. ఇలాంటి పుకార్లను నమ్మి అభ్యర్థులు, తల్లిదండ్రులు మోసపోవద్దని, కేవలం అధికారిక వెబ్‌సైట్ సమాచారాన్ని మాత్రమే నమ్మాలని విజ్ఞప్తి చేసింది. ఇలాంటి ఫేక్ ప్రచారం చేసే అకౌంట్లపై సైబర్ క్రైమ్ పోలీసుల సహాయంతో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షలో లీకేజీ కలకలం రేగడంతో.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మే 12న ఆ పరీక్షను ఎన్‌టీఏ అధికారికంగా రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 21న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు నీట్ యూజీ రీ ఎగ్జామినేషన్ జరగనుంది. లక్షలాది మంది విద్యార్థులు హాజరవుతున్న ఈ పరీక్షను ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా ముగించేందుకు కేంద్ర విద్యాశాఖ, ఎన్‌టీఏ సర్వసన్నద్ధమయ్యాయి.

## లక్ష డాలర్ల ఫీజు.. తలబొప్పి కట్టింది

**న్యూఢిల్లీ (భారత శక్తి):** దెబ్బ మీద దెబ్బ.. ఇది మామూలు దిబ్బ కాదు. ట్రంప్ దిమ్మ తిరిగిపోయే దెబ్బ. కాళ్ళ కింద భూమి కంపించి పోయే దెబ్బ. ఇక జన్మలో ఆ మాట కూడా ఎత్తడానికి కూడా భయపడే దెబ్బ.. అమెరికాలో ఏకచత్రాధిపత్యంగా.. మూర్ఖుడి మాదిరిగా నిర్ణయాలు తీసుకుంటున్న ట్రంప్ కు అక్కడి కోర్టు తిరుగులేని తీర్పు ఇచ్చింది. ఇకపై జన్మలో ఆ ఊసు ఎత్తడానికి కూడా వణుకు పుట్టేలా చేసింది.ట్రంప్ తన పరిపాలన నిర్లక్ష్యాన్ని ప్రపంచ మీద రుద్దడానికి రకరకాల విన్యాసాలకు పాల్పడుతున్నాడు. ప్రపంచ దేశాల మీద అనవసరమైన సుంకాలు విధించడం.. ఇంకా లేనిపోని షరతులు విధించడం.. యుద్ధాలు చేయడం.. ఇలాంటి ఎన్నో దారుణాలకు పాల్పడుతున్నాడు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే. ట్రంప్ తీసుకున్న మరో దారుణమైన నిర్ణయం అమెరికా కంపెనీలకు కోలుకోలేని ఇబ్బందిగా మారింది. అమెరికా యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశం లో భాగంగా.. అమెరికన్ కంపెనీల పై ట్రంప్ ప్రత్యేకమైన రుసుము వసూలు చేస్తామని ప్రకటించారు.

ప్రత్యేకమైన నైపుణ్యాల కోసం విదేశీ కార్మికులను నియమించుకునే యాజమాన్యాలు లక్ష డాలర్లు రుసుము చెల్లించాలని ట్రంప్ ఒక పనికిమాలిన విధానాన్ని తెరపైకి తీసుకొచ్చాడు. దీనిపై నిరసనలు వ్యక్తమయ్యాయి.ట్రంప్ తీసుకొని నిర్ణయం పట్ల అమెరికా కాంగ్రెస్ కూడా ఆమోదం తెలపలేదు. దీనిని చట్ట విరుద్ధమైన పన్ను అని బోస్టన్ ఫెడరల్ కోర్టు అభిప్రాయపడింది. విదేశాల నుంచి వచ్చే వృత్తి నిపుణులకు హెచ్ 1 బీ వీసాలు ఇవ్వడానికి లక్ష డాలర్ల ఫీజు వసూలు చేయడం ఏంటని కోర్టు మండిపడింది.ట్రంప్ తీసుకున్న నిర్ణయం చల్లదని యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియోసోరోకిన్ అత్యంత చారిత్రాత్మకమైన తీర్పు చెప్పారు.. గత ఏడాది సెప్టెంబర్ లో ట్రంప్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విదేశాలలో ఉంటూ అమెరికా తాత్కాలిక వలస వీసా ఆయన హెచ్1బికి ఎంపికైన వారు లక్ష డాలర్ల ఫీల్ చెల్లించాలని ఒక విధానాన్ని తెరపైకి తీసుకువచ్చింది. దీనిని దాదాపు 20 రాష్ట్రాల అటార్నీ జనరల్ తీవ్రంగా తప్పుపట్టారు. అదే కాదు పోస్ట్ అని కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటిని జడ్జి విచారించారు. లక్ష డాలర్ల ఫీజు వసూలు చేయడం ఏంటని మండిపడ్డారు..అది పెనాల్టీ ఎలా అవుతుంది. అలా తీసుకోవడానికి మీరెవరు. అటువంటి విధానం అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం లేకుండా ఎలా సాధ్యమవుతుంది. అమెరికా అధ్యక్షుడు ఇటువంటి నిర్ణయం ఎలా తీసుకుంటారని"కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. "కళాశాలలు.. ఆస్పత్రులు.. వంటి ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగులను నియమించుకోవడానికి మా సామర్థ్యానికి మించి లక్ష డాలర్ల రుసుము చెల్లించాలంటే ఇబ్బందిగా ఉండేదని" ఆయా రాష్ట్రాలకు చెందిన అటార్నీ జనరల్స్ తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును కోర్టు తీవ్రంగా పరిగణించి.. ట్రంప్ ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది. ఇక జన్మలో లక్ష డాలర్ల రుసుము వసూలు చేయాలనే ఆలోచన ట్రంప్ మదిలో ఉండదని విశ్లేషకులు చెబుతున్నారు.

# రేవంత్ రాజకీయం

## నార్త్ జనానికి దూరమౌతున్న కాంగ్రెస్

**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇటీవల జాతీయ వేదికలపై దక్షిణాది ఆత్మగౌరవ వాదాన్ని అత్యంత అగ్రెసివ్‌గా వినిపిస్తూ దేశ రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపారు. ముఖ్యంగా ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన , కేంద్రం నుంచి వచ్చే నిధులు , పన్నుల పంపిణీలో జరుగుతున్న అసమానతలపై ఆయన ఎక్కుపెట్టిన విమర్శలు జాతీయస్థాయిలో హాట్ టాపిక్‌గా మారాయి. మేము కేవలం పన్నులు చెల్లిస్తూ, ఢిల్లీకి సలాం కొట్టే ద్వితీయ శ్రేణి పౌరులం కాబోం అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కేవలం ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవేదన మాత్రమే కాదు.. ఒక దీర్ఘకాలిక రాజకీయ వ్యూహంగా విశ్లేషకులు భావిస్తున్నారు.ఒక జాతీయ పార్టీ తరఫున ముఖ్యమంత్రిగా ఉంటూ ఇలాంటి ప్రాంతీయ సెంటిమెంట్‌ను, ముఖ్యంగా ఉత్తరాది వర్సెస్ దక్షిణాది వాదాన్ని లేవనెత్తడం వెనుక కాంగ్రెస్ పార్టీ మారుతున్న అంతర్గత రాజకీయ సమీకరణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత కొన్ని ఎన్నికల సరళిని పరిశీలిస్తే, ఉత్తరాది రాష్ట్రాలలో కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో పుంజుకోలేకపోతోంది. అదే సమయంలో కర్ణాటక, తెలంగాణ వంటి దక్షిణాది రాష్ట్రాలు కాంగ్రెస్‌కు ప్రధాన ఆర్థిక, రాజకీయ వనరులుగా మారాయి. ఉత్తరాదిపై ఆశలు వదులుకోకపోయినా, తమకు పెట్టని కోటగా మారిన దక్షిణాదిని మరింత పటిష్టం చేసుకోవాలనే వ్యూహంలో భాగంగానే రేవంత్ రెడ్డి చేత కాంగ్రెస్ అధిష్ఠానం ఈ తరహా వాయిస్ వినిపిస్తోందని భావించవచ్చు.ఈ మొత్తం వ్యవహారంలో రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణ ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా, దక్షిణాదిలో కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన పిల్లర్ గా రూపాంతరం చెందుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజన కేవలం జనాభా ప్రాతిపదికన జరిగితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసినందుకు దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ ప్రాధాన్యతను కోల్పోతాయని రేవంత్ రెడ్డి గణాంకాలతో సహా హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఆయన తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వంటి ఇతర దక్షిణాది నేతలకు లేఖలు రాస్తూ అందరినీ ఏకం చేసే ప్రయత్నం చేయడం ద్వారా ప్రాంతీయ పార్టీల కంటే తానే ఈ వాదాన్ని బలంగా మోయగలనని నిరూపించుకుంటున్నారు. రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ మోడల్' అంటే 50% సీట్లను జనాభా ప్రాతిపదికన, మిగిలిన 50% సీట్లను ఆయా రాష్ట్రాల ఆర్థిక సహకారం ఆధారంగా కేటాయించాలనే డిమాండ్ ? ఆయన పొలిటికల్ మెచ్యూరిటీని చూపిస్తోంది. దీనివల్ల ఆయన కేవలం గుడ్డిగా కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం లేదని, ఒక నిర్మాణాత్మకమైన ప్రత్యామ్నాయాన్ని చూపిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది అటు జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ ఇమేజ్‌ను దెబ్బతీయకుండా, ఇటు దక్షిణాది ప్రయోజనాలను కాపాడే సమతుల్య వ్యూహంగా ఉపయోగపడుతోంది.భవిష్యత్ రాజకీయాల కోణంలో చూస్తే, ఈ 'దక్షిణాది సెంటిమెంట్' రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. ఢిల్లీ పాలకుల నిర్ణయాల వల్ల దక్షిణాది రాజకీయంగా అణగారిపోతుందనే భయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ప్రాంతీయ సెంటిమెంట్‌ను ఓట్లుగా మార్చుకునే ప్రయత్నం కాంగ్రెస్ చేయవచ్చు. అయితే, ఒక జాతీయ పార్టీగా కాంగ్రెస్‌కు ఈ వ్యూహం రెండు అంచుల కత్తి లాంటిదే. దక్షిణాదిలో ఈ వాదం మైలేజ్ ఇచ్చినప్పటికీ, ఉత్తరాది రాష్ట్రాలలో దీనివల్ల కాంగ్రెస్ మరింత రక్షణలో పడే ప్రమాదం ఉంది. అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో దక్షిణాది హక్కుల కోసం పోరాడే ఒక 'ఫైర్ బ్రాండ్' లీడర్‌గా రేవంత్ రెడ్డి జాతీయ స్థాయిలో తన స్థానాన్ని పటిష్టం చేసుకుంటున్నారు.

### మంత్రి పదవి ఇవ్వాలంటూ వినతులు

తెలంగాణకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు.. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీంతో భేటీ అయ్యారు. వీరిలో ప్రముఖంగా మునుగోడు ఎమ్మెల్యే, ఫైర్ బ్రాండ్ నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని ఆయన సుదీర్ఘ లేఖను రాహుల్‌గాంధీకి అప్పగించారు. తాను పార్టీకి ఎంత విధేయుడినో ఆయన వివరించారు. 15 పేజీల లేఖలో పలు వివరాలను ఆయన వెల్లడించినట్టు తెలిసింది త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ ఉంటుందన్న చర్చల నేపథ్యంలో కోమటిరెడ్డి సహా.. సీనియర్ నాయకు లు రాహుల్‌తోభేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఒకసారి మంత్రివర్గాన్ని విస్తరించారు. అప్పట్లో అడ్లూరి లక్ష్మణ్ సహా.. మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు అవకాశం కల్పించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముందు ఈ కూర్పు జరిగింది. అయితే.. ఇప్పుడు మరోసారి విస్తరించాలని చూస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.ఈ క్రమంలో ఎప్పటి నుంచో మంత్రి పీఠంపై ఆశలు పెట్టుకున్న కోమటిరెడ్డి మంత్రి పీఠం కోసం విస్తృ తంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రివర్గంలో సీటును ఆయన అత్యంత ప్రతిష్టాత్మకంగా కూడా భావి స్తున్నారు. గత ఆరు మాసాల నుంచి తన వ్యాఖ్యల ద్వారా మరింత వేడి పుట్టిస్తున్నారు. తనకు మంత్రి వర్గంలో ఎందుకు చోటివ్వరంటూ కోమటిరెడ్డి ప్రశ్నించిన సందర్భాలు కూడా ఉన్నాయి.

# బ్రహ్మోస్‌కు ఫుల్ డిమాండ్..

**న్యూఢిల్లీ (భారత శక్తి):** ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత సైనిక శక్తి ప్రపంచానికి తెలిసింది. పాకిస్తాన్‌లోని నిర్దిష్ట లక్ష్యాలపై దాడి చేయడంతోపాటు పాకిస్తాన్ చేసిన ప్రతిదాడులను భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఎలాంటి ప్రాణ నష్టం జరుగకుండా భారత్ జరిపిన దాడులతో ప్రపంచం దృష్టి ఒక్కసారిగా భారత ఆయుధాలపై పడింది. ఆపరేషన్ సిందూర్‌లో మన బ్రహ్మోస్ మిస్సైల్ సమర్థవంతంగా పనిచేసింది. దీంతో అత్యాధునిక సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్‌ను కొనుగోలుకు చాలా దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. తాజాగా దక్షిణ తూర్పు ఆసియా దేశాలకు విక్రయించడంలో ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. సింగపూర్‌లో జరిగిన షాంగ్రి?లా డైలాగ్‌లో భారత రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, వియత్నాంతో ఒప్పందం ఇప్పటికే సంతకం అయిందని, ఇండోనేషియాతో చర్చలు తుది దశలో ఉన్నాయని ప్రకటించారు. ఇది భారత రక్షణ ఎగుమతుల రంగంలో కొత్త అధ్యాయం.వియత్నాంతో 2012 నుంచి చర్చలు కొనసాగుతున్నాయి. 14 ఏళ్ల తర్వాత ఒప్పందం ఖరారైంది. అయితే ఒప్పంద విలువ, ఎన్ని క్షిపణులు అందించాలనే వివరాలు ఇంకా గోప్యంగా ఉన్నాయి. ఇండోనేషియాతో కూడా చర్చలు దగ్గరలో ముగిసే దశలో ఉన్నాయి. ఇంతకు ముందు 2022లో ఫిలిప్పీన్స్‌తో సంతకం చేసిన 375 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 3,100 కోట్లు) ఒప్పందం కింద మూడు బ్రహ్మోస్ వ్యవస్థలను అందించాల్సి ఉంది. ఇప్పటికే రెండు సెట్లు డెలివరీ అయ్యాయి. ఫిలిప్పీన్స్ వీటిని తన తీరప్రాంత రక్షణ కోసం మోహరించింది.వియత్నాం చైనా మధ్య దక్షిణ చైనా సముద్రంలో సరిహద్దు వివాదం ఉంది.

ఈ నేపథ్యంలో బ్రహ్మోస్ విక్రయం చైనా అసంతృప్తిని రేకెత్తించవచ్చని భారత్ గతంలో జాగ్రత్తగా వ్యవహరించింది. ఇప్పుడు ఒప్పందం ఖరారు కావడం దక్షిణ తూర్పు ఆసియాలో చైనా ప్రభావానికి వ్యతిరేకంగా భారత్ సక్రమమైన రణనీతిని అవలంబిస్తోందని సూచిస్తుంది.

### బ్రహ్మోస్ క్షిపణి విశేషాలు..

భారత్?రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్షిపణికి భారతప్రదేశ్ బ్రహ్మపుత్ర నది, రష్యా మాస్కో నది పేర్లను కలిపి పెట్టారు. హైదరాబాద్‌లో తయారవుతుంది. దీని బరువు సుమారు 3 వేల కిలోలు. పొడవు సుమారు 10 మీటర్లు. దీని దాడి పరిధి 300 కిలో మీటర్లు. ఇటవల భారత సాంకేతికతతో 500 కిలోమీటర్లకు పెంచారు.

గంటకు సుమారు 4 వేల కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తుంది. భూమికి చాలా దగ్గరగా పయనిస్తూ రాడార్‌లకు తప్పించుకుంటుంది. లక్ష్యాన్ని అత్యంత కచ్చితంగా ఛేదిస్తుంది.బ్రహ్మోస్ అణ్వాయుధాలను మోసుకెళ్లలేని కన్వెన్షనల్ క్షిపణి కాబట్టి అంతర్జాతీయ ఒప్పందాల పరిమితులు లేకుండా ఎగుమతి చేయవచ్చు. దీనిలో 85 శాతం సాంకేతికత భారత్ సొంతం. మిగిలిన 15 శాతం (ప్రధానంగా ఇంజిన్, కొన్ని లోహ భాగాలు) రష్యా నుంచి వస్తాయి.ఫిలిప్పీన్స్, వియత్నాం, ఇండోనేషియా వంటి దేశాలు బ్రహ్మోస్‌ను ఎంచుకోవడానికి మూడు ముఖ్య కారణాలు ఉన్నాయి. ఇది ఇప్పటికే యుద్ధక్షేత్రంలో పరీక్షించి నిరూపించుకున్న విజయవంతమైన క్షిపణి.పశ్చిమ దేశాలు లేదా ఇతర మేజర్ సరఫరాదారుల కంటే తక్కువ ఖర్చు.భారత్ శిక్షణ, మోహరింపు సహాయం, స్పేర్ పార్ట్స్‌ను తక్కువ ధరకు లేదా ఉచితంగా అందిస్తోంది. ఈ క్షిపణిని భూమి నుంచి, నౌకలు, జలాంతర్గాములు, విమానాల నుంచి కూడా ప్రయోగించవచ్చు.

### పెరిగిన భారత రక్షణ ఎగుమతులు..

కొన్ని సంవత్సరాల్లో భారత రక్షణ ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. 2023?24లో రూ. 21 వేల కోట్లు, 2024?25లో రూ. 28 వేల కోట్లు, 2025?26లో రూ. 38 వేల కోట్లకు చేరాయి. 2029?30 నాటికి రూ. 50 వేల కోట్ల లక్ష్యం నిర్దేశించారు. బ్రహ్మోస్‌తో పాటు ఆకాశ్, పినాకా, డ్రోన్లు, మందుగుండు సామగ్రి వంటివి కీలక పాత్ర పోషిస్తున్నాయి.

గతంలో ప్రభుత్వ ఏకస్వామ్యంగా ఉన్న రక్షణ రంగం ఇప్పుడు ప్రైవేట్ సంస్థల సహకారంతో వేగంగా మారుతోంది. ఇది స్వావలంబన (ఆత్మనిర్భర్ భారత్) లక్ష్యానికి దోహదపడుతోంది. బ్రహ్మోస్ ఎగుమతులు కేవలం వ్యాపారం కాదు. చైనా ప్రభావం ఎక్కువగా ఉన్న దక్షిణ తూర్పు ఆసియాలో భారత్ తన రణనీతి, సాంకేతిక సామర్థ్యం, విశ్వసనీయతను ప్రదర్శిస్తున్న సంకేతం. వియత్నాం, ఇండోనేషియా వంటి దేశాలు భారత్‌ను విశ్వసనీయ భాగస్వామిగా చూడడం భారత రక్షణ రంగానికి పెద్ద విజయం.

## ఒక్కో పోస్టుకు 88 మంది అభ్యర్థులు

**లక్నో,(భారత శక్తి)** ఓ చేత్తో డిగ్రీ పట్టా.. మరో చేత్తో ఖాళీ పొట్ట పట్టుకుని తిరుగుతున్నాం సార్. ఉద్యోగం ఎవడూ ఇవ్వడం లేదు. ఎక్కడికి వెళ్లినా రిఫరెన్సులు అడుగుతున్నారు. ఉద్యోగం ఇవ్వకుంటే అనుభవం ఎక్కడి నుంచి వస్తుంది.. ఈ దేశం ఇలా నాశనం అవుతోంది అంటే దానికి ప్రధాన కారణం మీరే సార్. మీరు ఉద్యోగాలు ఇవ్వరు. మమ్మల్ని బతకనివ్వరు" అప్పట్లో విపరీతంగా ప్రాచుర్యం పొందిన ఓ చిత్రంలో కథానాయకుడు చెప్పిన డైలాగ్ ఇది.ఆ సినిమా ఇప్పటికాలానికి నిజంగా సరిపోతుంది. కొన్ని సంవత్సరాల క్రితమే ఇప్పటి పరిస్థితి ఊహించి ఆ సినిమా తీసినట్టు కనిపిస్తోంది. ఆ సినిమాలో మాదిరిగానే ఇప్పుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో నిరుద్యోగులు హాహా కారాలు చేస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ కు భారీగా దరఖాస్తులు చేస్తున్నారు. ఆ పోటీ ఎంతలా ఉందంటే ఒక్క ఉద్యోగానికి దాదాపు 88 మంది దరఖాస్తు చేసుకునేలా.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 32,679 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉద్యోగాలకు దాదాపు 28.86 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రకారం ఒక్కొక్క పోస్టుకు 88 మంది పోటీ పడుతున్నారు. మూడు రోజులపాటు రాధా పరీక్షలు నిర్వహిం చనున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తండోపతండాలుగా వెళ్లిపోతున్నారు. అభ్యర్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రవాణా ఏర్పాటు చేయలేకపోవడంతో.. రైల్వే స్టేషన్ లు.. బస్ స్టేషన్లలో విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. దీంతో తర్వాత పరీక్షకు హాజరు కావడానికి అభ్యర్థులు మొత్తం కిక్కిరిసి వెళ్ళిపోవాల్సి వస్తోంది. బస్సులు.. రైళ్లు కిటకిటలా డుతున్నాయి.ఉత్తర్ ప్రదేశ్ అతి పెద్ద రాష్ట్రం. అక్కడ జనాభా కూడా అదే స్థాయిలో ఉంటుంది. అయితే నిరుద్యోగ యువతకు తగ్గట్టుగా అక్కడ నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలాకాల తర్వాత పోలీస్ డిపార్ట్మెంట్లో నోటిఫికేషన్ విడుదల చేయడంతో.. నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో ఉద్యోగానికి 88 మంది పోటీ పడుతున్నారంటే అక్కడ నిరుద్యోగ సమస్య ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో కూడా ఉత్తరప్రదేశ్లో కొన్ని శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. అప్పుడు కూడా ఇంతే సంఖ్యలో నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అప్పుడు కూడా రైల్వే స్టేషన్ లు.. బస్ స్టేషన్ లు నిరుద్యోగులతో కిటకిటలాడాయి. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంది.

## స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనపై విచారణకు

### బొకారో స్టీల్ ప్లాంట్ నుంచి త్రీ మ్యాన్ కమిటీ ఏర్పాటు

**విశాఖపట్నం(భారత శక్తి)** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటన మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం. క్షతగాత్రులకు రూ. 10 లక్షల పరిహారం, చికిత్సకి అయ్యే ఖర్చు మొత్తం ఆర్.ఐ.ఎన్.ఎల్. భరిస్తుంది. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తున్నామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. మంగళవారం నాడు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనా స్థలిని సందర్శించిన తరువాత అయన మీడియాతో మాట్లాడారు.పదవీ విరమణ ప్రయోజనాల కింద రెగ్యులర్ ఉద్యోగులకు రూ. 1.72 కోట్లు. కాంట్రాక్టు ఉద్యోగులకు రూ. 45.75 లక్షల అందుతాయి. స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల పిల్లల మాదిరి మృతుల పిల్లల చదువులు కొనసాగించేందుకు సహకారం అందిస్తామని అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనపై విచారణకు బొకారో స్టీల్ ప్లాంట్ నుంచి త్రీ మ్యాన్ కమిటీ ఏర్పాటు. విచారణ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి సహకారం అందిస్తాం. స్టీల్ ప్లాంట్ కార్మికుల సమస్యలు, యాజమాన్య లోపాలు, సాంకే తికపరమైన ఇబ్బందులు తెలుసుకునేందుకు త్వరలో కార్మిక సంఘాలతో సమావేశం అవుతామని అన్నారు.విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు.. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ జరగకూడదన్నదే కూటమి ప్రభుత్వ ఆకాంక్ష అని పవన్ కళ్యాణ్ అన్నారు.

# 75 లక్షల టన్నుల మార్కు

## - రికార్డు స్థాయిలో వరి...

**హైదరాబాద్(భారత శక్తి)** వ్యవసాయ రంగంలో తెలంగాణ రాష్ట్రం మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. 2025-26 యాసంగి (రబీ) సీజన్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా వరి సాగు విస్తీర్ణంలో, ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని ప్రణాళికశాఖ నివేదిక స్పష్టం చేసింది. సాధారణంగా నీటి కొరత కారణంగా దేశంలోని మెజారిటీ రాష్ట్రాల్లో వానాకాలం (ఖరీఫ్)తో పోలిస్తే యాసంగిలో వరి సాగు చాలా తక్కువగా ఉంటుంది. కానీ తెలంగాణలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా ఈ యాసంగిలో రికార్డు స్థాయిలో 59.90 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్లు నివేదిక వెల్లడించింది. దేశం మొత్తం మీద జరిగిన యాసంగి వరి సాగు విస్తీర్ణంలో సగానికి పైగా వాటా కేవలం తెలంగాణదే కావడం విశేషం. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడులో 30.76 లక్షల ఎకరాలు, ఆంధ్రప్రదేశ్‌లో 17.29 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగైంది. ఇక వానాకాలం, యాసంగి రెండు సీజన్లను కలిపి చూస్తే.. అత్యధిక సాగు విస్తీర్ణంలో ఉత్తరప్రదేశ్ దేశంలోనే తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది.వరి సాగులోనే కాకుండా ధాన్యం కొనుగోళ్లలోనూ తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. శనివారం నాటికి రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు 72.30 లక్షల టన్నులకు చేరాయి.

కొనుగోళ్లు మరో వారం పాటు సాగనుండటంతో ఈ సంఖ్య సులభంగా 75 లక్షల టన్నుల మార్కును దాటుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా.. మన పొరుగున ఉన్న తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మొత్తం కొనుగోళ్లు కలిపినా 40 లక్షల టన్నుల లోపే ఉండటం గమనార్హం.తెలంగాణలో ఈ స్థాయి దిగుబడి రావడానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలే ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రాజెక్టుల ద్వారా నిరంతర నీటి లభ్యత, వ్యవసాయ రంగానికి అందిస్తున్న ఉచిత విద్యుత్, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుభరోసా పథకం, సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 అదనపు బోనస్ అందించటం, పకడ్బందీగా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ కారణంగా సాగు విస్తీర్ణం పెరిగిందని అంటున్నారు. గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది వానాకాలంలో 69.90 లక్షల ఎకరాలు, యాసంగిలో 59.90 లక్షల ఎకరాలు కలిపి మొత్తం 129.80 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఈ రెండు సీజన్ల ద్వారా రాష్ట్రంలో సుమారు 282 లక్షల టన్నుల భారీ ధాన్యం దిగుబడి వచ్చినట్లు పౌరసరఫరాల సంస్థ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ అనుకూల విధానాల వల్లే తెలంగాణ దేశానికే అన్నపూర్ణగా మారిందని నిపుణులు కొనియాడుతున్నారు.



## ఆయన నటన గురించి మాటల్లో చెప్పలేను

# సంయుక్త మీనన్

మలయాళం, తెలుగు చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న నటి సంయుక్త మీనన్, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతిపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆయనతో కలిసి 'స్లమ్‌డాగ్ -- 33 టెంపుల్ రోడ్' చిత్రంలో నటిస్తున్న ఆమె, విజయ్ నటనను ప్రత్యక్షంగా చూడటం ఒక అద్భుతమైన అనుభూతి అని తెలిపారు. ఆయన సెట్‌లో ఉన్నప్పుడు, తెరపై చూసేదానికంటే భిన్నమైన శక్తిని తీసుకొస్తారని ఆమె అభిప్రాయపడ్డారు. విజయ్ సేతుపతితో కలిసి పనిచేయడం గురించి సంయుక్త మాట్లాడుతూ, "నేను విజయ్ సర్‌కు పెద్ద అభిమానిని. ఆయన నటనను దగ్గర నుంచి చూడటం మాటల్లో చెప్పలేను. ఒక పాత్రలోకి ఆయన మారే తీరు చాలా సహజంగా ఉంటుంది. డైలాగ్స్ చెబుతుంటే, అవి నిజంగా తనలో నుంచే వస్తున్నట్లు అనిపిస్తుంది. ఒక సహనటిగా ఆ ప్రక్రియను చూడటం నాకు దక్కిన అదృష్టం" అని వివరించారు.'స్లమ్‌డాగ్' చిత్రంలో తన పాత్ర గురించి చెబుతూ, "ఇందులో నా పాత్ర చాలా అందమైనది, ఎన్నో విభిన్న కోణాలు ఉంటాయి. నటిగా ఇది నాకు ఒక పెద్ద సవాల్. ఇలాంటి ప్రత్యేకమైన పాత్ర చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది" అని సంయుక్త మీనన్ అన్నారు. ఈ చిత్ర దర్శకుడు పూరి జగన్నాథ్ పనితీరును కూడా సంయుక్త మెచ్చుకున్నారు. "పూరి సర్ దర్శకత్వం చేసే విధానం చాలా స్టైలిష్‌గా, అందంగా ఉంటుంది. ఆయన సమయానికి షూటింగ్ మొదలుపెట్టి, అనుకున్నదానికంటే ముందే పూర్తి చేస్తారు. ఆయన పనితీరు చూడటం ఎంతో అద్భుతంగా అనిపిస్తుంది" అని తెలిపారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలో విడుదల కానుంది.

# 'వలవార' మూవీ రివ్యూ!




కన్నడలో రూపొందిన ఒక ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామానే 'వలవార'. ఈ ఏడాది జనవరి 30వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఇప్పుడు 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది. సతన్ గౌడ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఇప్పుడు కన్నడతో పాటు తెలుగులోను అందుబాటులోకి వచ్చింది. గిరిధర్ – అనిరుధ్ గౌతమ్ నిర్మించిన ఈ సినిమాలో, మాస్టర్ వేద కౌశల్ ప్రధానమైన పాత్రను పోషించాడు. అది పట్టణానికి దూరంగా ఉన్న ఒక మారుమూల పల్లె. ఆ గ్రామంలో కుందేశి (కౌశల్) అతని తల్లిదండ్రులు .. తమ్ముడు 'కొసుడి' నివసిస్తూ ఉంటారు. ఊరికి దూరంగా .. పంటపొలాలకు దగ్గరగా ఉన్న ఇల్లు వారిది. కుందేశిపట్ల తండ్రి చాలా కోపంగా వ్యవహరిస్తూ ఉంటాడు. అందువలన అతను తండ్రికి భయపడుతూ ఉంటాడు. తండ్రి చేతిలో కుందేశి దెబ్బలు తింటాడేమోనని తల్లి కూడా ఆందోళన చెందుతూ ఉంటుంది. ఇలాంటి పరిస్థితులలో ఒక ముఖ్యమైన పనిపై కుందేశి తండ్రి పట్నం వెళతాడు. అదే సమయంలో కుందేశి .. అతని తమ్ముడు 'గౌరీ' అనే తమ ఆవును మేపుకు రావడానికి వెళతారు. కుందేశి తమ్ముడి నిర్లక్ష్యం కారణంగా ఆవు కనిపించకుండా పోతుంది. అది వేరేవారి చేలోపడి మేయడంతో, వాళ్లు దానిని తమ కొట్టంలో కట్టేస్తారు. 200 రూపాయలు ఇచ్చి ఆవును తీసుకుని వెళ్లమని కుందేశితో చెబుతారు.కుందేశి విషయం చెప్పడంతో, అతని తల్లి చేబదులుగా పక్కింటావిడ దగ్గర 200 రూపాయలు తీసుకుని ఇస్తుంది.తండ్రి పట్నం నుంచి వచ్చేసరికి ఆవు ఇంట్లో ఉండాలి. పైగా అది సూడి ఆవు కావడంతో కుందేశి మరింత భయపడతాడు. ఆవును కట్టేసిన ఇంటికి వెళ్లిన అతను, తల్లి తనకి ఇచ్చిన 200 రూపాయల నోటు ఎక్కడో పడిపోయిందనే విషయాన్ని గ్రహిస్తాడు. వెనక్కి వెళ్లి ఎంతగా వెదికినా ఆ నోటు కనిపించదు. అప్పుడు కుందేశి ఏం చేస్తాడు? తండ్రి వచ్చేలోగా ఆవును విడిపించగలుగుతాడా? అతనిపై తండ్రికి గల కోపానికి కారణం ఏమిటి? అనేది కథ.విలేజ్ లలో ఆవును తమ కుటుంబంలో ఒక సభ్యుడిగా భావిస్తూ ఉంటారు. ఆవు తప్పిపోతే తమ కుటుంబ సభ్యుడు కనిపించకుండా పోయినంతగా కంగారు పడిపోతారు. ఆవు కోసం తలో దిక్కుకు వెళ్లి వెదకడం మొదలు పెడతారు. ముఖ్యంగా ఆ ఇంట్లోని పిల్లలు ఆవుని మరింతగా ప్రేమిస్తూ ఉంటారు. అలా ఒక పిల్లాడికి .. తప్పిపోయిన ఆవుకు మధ్య నడిచే కథ ఇది. ఈ కథ అంతా కూడా విలేజ్ నేపథ్యంలోనే కొనసాగుతుంది. కుందేశి ఓ పదేళ్ల పిల్లాడు. తండ్రి అంటే విపరీతమైన భయం. తండ్రి ఇంట్లో లేని సమయంలో ఆవు తప్పిపోతోంది. అతను వచ్చేలోగా ఆవును వెదికి తీసుకురావడం కోసం ఆ పిల్లాడు పడే ఆరాటం చుట్టూనే ఈ కథ తిరుగుతూ ఉంటుంది. విలేజ్ నేపథ్యం .. పేద కుటుంబం .. ఆర్థిక ఇబ్బందులు ..కుందేశి బర్త్ డేకి కేక్ కట్ చేయించాలానే తల్లి ముచ్చటతో పాటు, ఈ మధ్యలో చోటు చేసుకునే ఒక చిన్న లవ్ ట్రాక్ ను కలుపుకుంటూ ఈ కథ ముందుకు వెళుతుంది. విలేజ్ నేపథ్యం .. కుర్రాడి వైపు నుంచి ఉన్న ఆవు ఎమోషన్ కారణంగా ఈ కంటెంట్ ఆసక్తికరంగా ఉంటుందని అనుకోవడం సహజం. కానీ బలహీనమైన కథాకథనాలతో .. తేలికపాటి సన్నివేశాలతో ఈ కథ కదులుతుంది.తల్లీ కొడుకు మధ్య .. కొడుకు పట్ల తండ్రి కోపానికి గల కారణం .. ఆవు పట్ల పిల్లాడికి గల ప్రేమ .. ఇవేవీ ఆడియన్స్ కి కనెక్ట్ కావు. ఆ ఫీల్ ను వర్కౌట్ చేయలేకపోయారు. బలమైన .. బరువైన సన్నివేశాలను డిజైన్ చేసుకోలేకపోయారు. ఆర్టిస్టుల నుంచి సరైన అవుట్ పుట్ తీసుకోకుండా పైపైన చుట్టేసినట్టుగా అనిపిస్తుంది.ఈ సినిమాలో ఆకట్టుకునే అంశాలు ఏవైనా ఉన్నాయంటే అవి లొకేషన్స్ అని చెప్పాలి. గ్రామీణ నేపథ్యంలోని లొకేషన్స్ ను కవర్ చేసిన విధానం అలరిస్తుంది. చందమామ కథల్లోని దృశ్యాల మాదిరిగా అందమైన లొకేషన్స్ మనసుకు హత్తుకుపోతాయి.

ఆ లొకేషన్స్ కి వెళ్లాలనిపించేలా ఉన్నాయి. అయితే ఆ లొకేషన్స్ లో నడిచే కథపై కసరత్తు జరగకపోవడం కనిపిస్తుంది .. నిరాశను కలిగిస్తుంది. ప్రధానంగా కనిపించేది 6 పాత్రలే. వారి నటన ఫరవాలేదు. ఫొటోగ్రఫీ మెప్పిస్తుంది .. లొకేషన్స్ ను తెరపైకి తీసుకొచ్చిన విధానం వైపు నుంచి ఎక్కువ మార్కులు ఇస్తుంది. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. బలమైన కంటెంట్ ను రాసుకోకుండా సినిమా స్థాయి నిడివికి సాగదీసినట్టుగా కనిపిస్తుంది. సింపుల్ లైన్ ను తీసుకున్నప్పటికీ, కసరత్తు బలంగా చేసుంటే మరింత బెటర్ అవుట్ పుట్ వచ్చేదని అనిపిస్తుంది.

# భారీ స్కామ్..

## సన్నీ లియోన్‌కు సీఐడీ నోటీసులు



బాలీవుడ్ హాట్ బ్యూటీ సన్నీ లియోన్ ఒక భారీ ఆర్థిక వివాదంలో చిక్కుకోవడం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. కర్ణాటకకు చెందిన 'శివమ్ అసోసియేట్స్' అనే సంస్థ దాదాపు రూ.2,400 కోట్ల మేర అక్రమ డిపాజిట్లు సేకరించి, ప్రజలను మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఈ సంస్థ యజమాని శివానంద నీలణ్ణవర్‌పై ఇప్పటికే కేసులు నమోదు కాగా, ఈ అక్రమ సొమ్ము వ్యవహారంలో సన్నీ లియోన్‌కు కర్ణాటక సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది.దశివమ్ అసోసియేట్స్ అధినేత 2023లో 'ఛాంపియన్' అనే సినిమాను నిర్మించాడు. ఈ చిత్రంలో ఒక ఐటెం సాంగ్ చేసినందుకు సన్నీ లియోన్‌కు ఏకంగా రూ.1 కోటి పారితోషికం ఇచ్చినట్లు బ్యాంక్ రికార్డుల ద్వారా అధికారులు గుర్తించారు. ప్రజల నుంచి వసూలు చేసిన అక్రమ సొమ్మునే ఆమెకు రెమ్యూనరేషన్‌గా ఇచ్చారా అనే కోణంలో ఆరా తీస్తున్న పోలీసులు... దీనిపై పూర్తి వివరణ ఇవ్వాల్సిందిగా కోరుతూ ఆమెకు నోటీసులు పంపారు. ఈ సంస్థ ప్రజల సొమ్ముతో గత డిసెంబరులో నిర్వహించిన 'కన్నడ ఉత్సవం' వేడుకల్లో పలువురు సినీ నటులు పాల్గొన్నారు. ఈ క్రమంలో ఈవెంట్‌లో పాల్గొన్నందుకు భారీగా పారితోషికాలు అందుకున్నారనే అనుమానంతో కన్నడ నటులు 'డాలి' ధనుంజయ్, సప్తమీ గౌడ (కాంతార ఫేమ్), వశిష్ఠ సింహ, రాగిణి ద్వివేదిలకు కూడా నోటీసులు ఇచ్చేందుకు సీఐడీ సిద్ధమైంది.

# 'కేడీ .. ది డెవిల్' మూవీ రివ్యూ!



మాస్ యాక్షన్ హీరోగా కన్నడలో ధృవ్ సర్జాకి మంచి పేరు ఉంది. అలాంటి ధృవ్ సర్జా నుంచి మరో యాక్షన్ మూవీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రేమ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, మే 15వ తేదీన థియేటర్లలో విడుదలైంది. సంజయ్ దత్ .. శిల్పా శెట్టి కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమాలో కిచ్చా సుదీప్ అతిథి పాత్రను పోషించాడు. జూన్ 5వ తేదీ నుంచి 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది. కన్నడతో పాటు తెలుగు .. తమిళ .. మలయాళ భాషల్లో అందుబాటులో ఉంది.కాళిదాస్ (ధృవ్ సర్జా) బెంగుళూర్ సమీపంలోని ఒక విలేజ్ లో తన అన్నయ్య ధర్మ (రమేశ్ అరవింద్)తో కలిసి నివసిస్తూ ఉంటాడు. ధర్మ వివాహం చేసుకోడు. ఆ విలేజ్ లోని పిల్లలకు చదువు చెబుతుంటాడు. అందువలన ఆయనను అందరూ అభిమానిస్తూ ఉంటారు. కాళిదాస్ కి చిన్నప్పటి నుంచి చదువు అబ్బకపోవడంతో, కిరోసిన్ డీలర్ గా పనిచేస్తూ ఉంటాడు. అన్నయ్య అంటే ఆయనకి ప్రాణం. కండబలం ఉన్నప్పటికీ, అన్నయ్య చెప్పిన మార్గంలో నడుస్తుంటాడు. ఆ ఊరు కుస్తీ పోటీలకు ప్రసిద్ధి. అయితే దేవా (సంజయ్ దత్)తో కుస్తీ ఆడటానికి ఎవరైనా భయపడాల్సిందే. మాఫియాతో లింకులున్న దేవా, ఆ కుస్తీ గ్రౌండ్ నుంచి తన అనుచరులను తయారు చేయడం మొదలుపెడతాడు. వాళ్లను తన ముఠాలో చేర్చుకుంటూ ఒక ప్రత్యేకమైన గ్యాంగ్ ను తయారు చేస్తాడు. అక్కడి ప్రజలకు తానంటే ఉన్న భయాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయంగా ఎదగాలనే ప్రయత్నాలలో ఉంటాడు.కాళిదాస్ తన అన్నయ్య ధర్మాతో పాటు, మరో ఇద్దరిని తన జీవితంలో ముఖ్యమైన వ్యక్తులుగా భావిస్తుంటాడు. ఒకరు తనకి చిన్నప్పుడు రక్తమిచ్చి బ్రతికించిన దేవా అయితే, మరొకరు తాను ఇష్టపడిన కొడవలి లక్ష్మి (రీష్మా). దేవాతో పటు ఆమె భార్య అయిన సత్యవతి (శిల్పా శెట్టి)ని కూడా కాళిదాస్ ఎంతో గౌరవిస్తుంటాడు. దేవా చేసే అరాచకాలకు సత్యవతి పూర్తి సపోర్టు ఉంటుంది. అతను తీసుకునే నిర్ణయాలు సరైనవిగా ఆమె భావిస్తూ ఉంటుంది. ఒకానొకసారి కుస్తీలో దేవా ఆటతీరును కాళిదాస్ తప్పుబడతాడు. ఎలా ఆడాలో చెబుతూ, దేవాను ఓడిస్తాడు. అప్పుడు జరిగిన అవమానాన్ని దేవా మనసులో పెట్టుకుంటాడు. సత్యవతి కూడా లోలోపలే రగిలిపోతూ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే దేవా మనుషుల కారణంగా లక్ష్మికి అవమానం జరుగుతుంది. అప్పుడు కాళిదాస్ ఏం చేస్తాడు? అన్నిరకాలుగా బలవంతుడైన దేవాను అతను ఎలా ఎదుర్కొంటాడు? ధర్మ పెళ్లి చేసుకోకుండా ఉండిపోవడానికి కారణం ఏమిటి? అనేది మిగతా కథ.ఈ కథ 1980లలో మొదలవుతుంది. ఒక మాఫియా ముఠా నాయకుడికీ .. అమాయకుడైన ఒక సాధారణ యువకుడికి మధ్య జరిగే కథ ఇది. ఎన్నో అరాచకాలు చేస్తూ వెళుతున్న దేవాను, తనకి ఒక చిన్న సాయం చేసిన కారణంగా మంచివాడిగా భావిస్తూ ఉంటాడు కాళిదాసు. అయితే అదే దేవా కారణంగా తన కుటుంబం ప్రమాదంలో పడినప్పుడు కాళిదాస్ ఏం చేస్తాడు? అనే ఒక అంశం చుట్టూ ఈ కథ తిరుగుతూ ఉంటుంది. సమర్థులైనవారు .. బలవంతులు సహనంతో ఉండటం చాలా అరుదు. తమచుట్టూ ఉన్నవాళ్లలోను మంచితనాన్ని మాత్రమే చూస్తూ సర్దుకుపోతుంటారు. అలాంటివారిని రెచ్చగొడితే ఏం జరుగుతుంది? మంచివారి కోపం ఎంత తీవ్రంగా ఉంటుంది? తమ కుటుంబం కోసం ఎంతకష్టమైనా పడే అలాంటివాళ్లు, ఆ కుటుంబమే ఆపదలో పడే పరిస్థితి వస్తే ఎలా రియాక్ట్ అవుతారు? అనే అంశాన్ని కేంద్రబిందువుగా చేసుకుని దర్శకుడు ఈ కథను ముందుకు తీసుకుని వెళ్లాడు. హీరో వైపు నుంచి చూస్తే, అన్నకోసం ప్రాణాలు ఇవ్వడానికి వెనుకాడని ఒక తమ్ముడు. విలన్ వైపు నుంచి చూస్తే తన భర్తను సపోర్ట్ చేసే విలన్ భార్య సత్యవతి. ఈ రెండు కుటుంబాలకు మధ్యలో 'లక్ష్మి' అనే హీరోయిన్ పాత్ర. ఈ ఐదు పాత్రల చుట్టూనే ప్రధానమైన సన్నివేశాలు ప్లే అవుతూ ఉంటాయి. కథా పరంగా చూసుకుంటే, ఏ మాత్రం కొత్తదనం లేకుండా ఒక రెగ్యులర్ ఫార్ములాను ఫాలో అవుతూ వచ్చిన సినిమానే ఇది. ఫస్టాఫ్ లో చాలావరకూ కథను సాగదీస్తూ వెళ్లారు. అలా ఎందుకు చేశారనేది మనకి సెకండాఫ్ చివరో తెలుస్తుంది. సీక్వెల్ కోసమని ఉన్న కథను దాచడానికి చేసిన ప్రయత్నం తాలూకు ప్రభావం ఫస్టాఫ్ పై పడిపోయింది. అలా కాకుండా ఇదే సినిమాలో చెప్పేసి ఉంటే, ఇంపాక్ట్ వేరేలా ఉండేదే. ఎందుకంటే సత్యవతి పాత్ర తాలూకు ఛాయలు అలా కనిస్తాయి. ఆ పాత్ర రంగంలోకి దిగడంతో సీక్వెల్ రానున్నట్టు చూపించారు. ఇక ఫస్టాఫ్ లో హీరో – హీరోయిన్ మధ్య ప్రేమను పాటల్లో చూపిస్తే బాగుండేది.లేదంటే ఎమోషనల్ గా కనెక్ట్ చేసినా బాగుండేది. కానీ ఈ రెండు పాత్రల మధ్య అతివాగుడు పెట్టేసి, ఆడియన్స్ తో ఒక ఆట ఆడుకున్నారు. ఈ వయసులో సంజయ్ దత్ కుస్తీలు .. భవతి బిక్షామ్ దేహి అంటూ సత్యవతి పోలీస్ స్టేషన్ కి రావడం .. భైరవ పాత్రలో సుదీప్ ఎంట్రీ .. కాస్త ఓవర్ గా అనిపిస్తాయి. ఇక రవిశంకర్ పాత్రను పోలీస్ ఆఫీసర్ గా కాకుండా, ఎక్కడికక్కడ హీరో గురించి గొప్పలు చెప్పే పాత్రలో చూపించారు. ఆర్టిస్టులంతా పాత్ర పరిధిలో నటించారు. విలియం డేవిడ్ ఫొటోగ్రఫీ .. అర్జున్ జన్య సంగీతం .. సంకేత్ ఆచార్ ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తాయి. 'కేడీ .. ది డెవిల్' టైటిల్ కి తగినట్టుగానే హింసతో .. రక్తపాతంతో నడిచే కథ ఇది. విలన్ కంటే ఎక్కువ హింసకి పాల్పడే హీరో చేష్టలతో .. రొటీన్ కథాకథనాలతోనే నడిచే కంటెంట్ ఇది.

## నాని 'ది పారడైజ్' మళ్లీ వాయిదా?
## రవితేజ 'ఇరుముడి' కోసమేనా!




నాచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ది పారడైజ్' మరోసారి వాయిదా పడే దిశగా కనిపిస్తోంది. మొదట మార్చి 26న విడుదల కావాల్సిన ఈ చిత్రం, ఆ తర్వాత ఆగస్టు 21కి వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఆ ఆగస్టు 21వ తేదీని మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న 'ఇరుముడి' సినిమా లాక్ చేసుకోవడంతో నాని సినిమా పోస్ట్‌పోన్ కాక తప్పని పరిస్థితి ఏర్పడింది. సినిమాకు సంబంధించిన కొంత వర్క్ ఇంకా పెండింగ్‌లో ఉండటమే ఈ ఆలస్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. సోషల్ మీడియాలో వినిపిస్తున్న తాజా సమాచారం ప్రకారం.. 'ది పారడైజ్' చిత్రం సెప్టెంబర్ నెలలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఇది కేవలం ప్రచారం మాత్రమేనని, దీనిపై చిత్ర యూనిట్ నుండి అధికారిక ప్రకటన రావాల్సి ఉందని ఇండస్ట్రీ టాక్. బ్లాక్‌బస్టర్ 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ది పారడైజ్' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఎస్-ఎల్‌వి సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో కాయాడు లోహర్ హీరోయిన్ గా నటిస్తుండగా, కలెక్షన్ కింగ్ మోహన్ బాబు విలన్ పాత్రలో నటిస్తున్నాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నాడు.

# వారాహి అమ్మవారి శాపం వెనుక దాగిన రహస్యం..

## థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఆకట్టుకున్న 'మహేంద్రగిరి వారాహి' టీజర్!




తెలుగు ప్రేక్షకులకు మరో ఆసక్తికరమైన డివోషనల్ థ్రిల్లర్‌ను అందించేందుకు సిద్ధమవుతోంది 'మహేంద్రగిరి వారాహి'. సుమంత్, మాళవిక నాయర్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి గోస్వామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని దర్శకుడు సంతోష్ జాగర్లపూడి తెరకెక్కిస్తున్నారు. రాజశ్యామల ఎంటర్టైన్మెంట్స్ మరియు బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై మధు కలిపు, వెంకట్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, అలీ, రాజీవ్ కనకాల తదితర ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ విడుదల చేయగా, అది ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. టీజర్ ఆరంభం నుంచే మిస్టరీ, భక్తి, ఉత్కంఠభరిత అంశాలతో కథపై అంచనాలను పెంచేసింది. మహేంద్రగిరి అనే గ్రామం, అక్కడి ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్న వారాహి అమ్మవారి ఆరాధన, అలాగే ఒక వంశాన్ని వెంటాడుతున్న శాపం చుట్టూ కథ తిరుగుతున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది.తెలుగు వార్తలు టీజర్‌లో చూపించిన విజువల్స్, గ్రామీణ నేపథ్యంలో నెలకొన్న భయానక వాతావరణం, దేవతా శక్తులతో ముడిపడిన సంఘటనలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఒక రహస్యాన్ని ఛేదించేందుకు మహేంద్రగిరికి వచ్చిన హీరో పాత్ర కథలో కీలక మలుపులు తీసుకురానుందని సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆ రహస్యానికి వారాహి అమ్మవారి శాపంతో ఉన్న సంబంధం ఏమిటి? గ్రామంలో జరుగుతున్న విచిత్ర ఘటనల వెనుక అసలు కారణం ఏమిటి? అనే ప్రశ్నలను టీజర్ ప్రేక్షకుల ముందుంచింది. సుమంత్ పాత్ర చాలా సీరియస్ మరియు ఇన్వెస్టిగేటివ్ షేడ్‌లో కనిపించగా, మాళవిక నాయర్, ఐశ్వర్య రాజేష్ పాత్రలు కూడా కథలో బలమైన ప్రాధాన్యం కలిగి ఉన్నట్లు అర్థమవుతోంది. మరోవైపు బ్రహ్మానందం, వెన్నెల కిషోర్ వంటి నటులు తమ పాత్రల ద్వారా కథకు అవసరమైన వినోదాన్ని జోడించే అవకాశం కనిపిస్తోంది.

# మేకపాటి ఫ్యామిలీలో ఆస్తులు వార్

**నెల్లూరు (భారత శక్తి)**నెల్లూరు జిల్లాకు చెందిన పొలిటికల్ ఫ్యామిలీ మేకపాటి కుటుంబంలో ఆస్తుల రచ్చ రోడ్డుకెక్కింది. ఈ కుటుంబం నుంచి పలువురు నాయకులు రాజకీయాల్లో ఉన్నారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆయన సోదరులు.. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డిలతోపాటు.. మేకపాటి విక్రమ్ రెడ్డి(రాజమోహన్‌రెడ్డి కుమారుడు) ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్నారు. గతంలో మంత్రిగా పనిచేసిన మేకపాటి గౌతం రెడ్డి మృతిచెందిన విషయం తెలిసిందే. దాదాపు 45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న ఈ కుటుంబానికి నెల్లూరులో మంచి పేరుందిమేకపాటి రాజమోహన్‌రెడ్డి నెల్లూరు ఎంపీగా పలుమార్లు విజయం దక్కించుకున్నారు. ఇక, మేకపాటి చంద్రశేఖరరెడ్డి కూడా ఉదయగిరి నియోజకవర్గం నుంచి పలుమార్లు అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం రాజగోపాల్‌రెడ్డి మాత్రం వైసీపీ తరఫున ఉదయగిరి నియోజకవర్గానికి ఇంచార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్‌గా ఉన్నారు. అయితే.. ఇప్పటి వరకు వీరి కుటుంబ ఆస్తులపై వివాదాలు చెలరేగిన దాఖలాలు లేవు. కానీ, తొలిసారి మేకపాటి చంద్రశేఖరరెడ్డి మీడియా సమావేశం పెట్టి మరీ.. కుటుంబ ఆస్తుల వివాదాలపై మాట్లాడారు.తనకు రెండు పెళ్లిళ్లు జరిగాయని.. ఈ నెపాన్నిచూపించి.. తన సోదరులు రాజమోహన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి ఆస్తులను పంచడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం చంద్రశేఖరరెడ్డి వయసు 63 ఏళ్లు. అయితే.. ఆయన ఆస్తుల వివాదంతో రోడ్డెక్కడం అందరినీ విస్మయానికి గురి చేసింది. తన సోదరుడు రాజమోహన్‌రెడ్డి తనకు ఆస్తులు పంచడం లేదని.. రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. ఇప్పుడు తాను ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నానని.. ఈ విషయాన్ని పదే పదే చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నారు. మేకపాటి కుటుంబం స్వతంత్రంగా వ్యవహరించడం లేదని జగన్ చెప్పినట్టు ఆడుతున్నారని ఆయన విమర్శించారు.వైసీపీని వీడి.. టీడీపీలో చేరినందుకే.. తనకు ఆస్తులు పంచకుండా జగన్ తెరచాటున అడ్డు పడుతున్నారని చంద్రశేఖరరెడ్డి దుయ్యబట్టారు. చెల్లికి, తల్లికి కూడా ఆస్తులు పంచని వాడు.. వారిని ఇంటి నుంచి వెళ్లగొట్టిన వాడు చెబితే.. రాజమోహన్‌రెడ్డి ఎలా వింటున్నారని ప్రశ్నించారు.ఉమ్మడి ఆస్తిలో తనకు రూపాయిపంచినట్టు చెప్పినా.. తను ఏమీ అడగబోనన్నారు. దీనిపై బహిరంగ చర్చకు కూడా తాను సిద్ధమేనని అన్నారు. జగన్ కారణంగానే వైసీపీ నాశనం అయిందని, ఇంకా అవుతుందని చెప్పారు. సుపరిపాలన అందిస్తున్న చంద్రబాబు నేతృత్వంలోని కూటమి మళ్లీ మళ్లీ అధికారంలోకి వస్తుందని వ్యాఖ్యానించారు.

# ఏపీలో సరికొత్త సోషల్ ఇంజనీరింగ్

**విజయవాడ,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక సరికొత్త సోషల్ ఇంజనీరింగ్ ప్రయోగానికి జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. కేవలం ఒకే వర్గానికి పరిమితమైన పార్టీగా జనసేనపై ప్రత్యర్థులు వేస్తున్న ముద్రను చెరిపేస్తూ.. కులాలను కలపడం అనే తన మూల సిద్ధాంతాన్ని ఆయన క్షేత్రస్థాయిలో సీరియస్ గా అమలు చేస్తున్నారు. ఎన్నికల విజయం అనంతరం ఆయన తీసుకుంటున్న రాజకీయ నిర్ణయాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను గమనిస్తే, రాష్ట్రంలో సుస్థిరమైన రాజకీయాలు, సామాజిక సమతుల్యతను సాధించడమే లక్ష్యంగా పవన్ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.జనసేన పార్టీకి కాపు సామాజికవర్గం ప్రధాన కోర్ ఓటు బ్యాంక్ అనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, ఆ వర్గానికి సముచిత ప్రాధాన్యత ఇస్తూనే, ఇతర సామాజికవర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా పవన్ కల్యాణ్ సమదృష్టిని ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం జనసేన తరఫున గెలిచిన ఇద్దరు లోక్‌సభ ఎంపీలు కాపు సామాజికవర్గానికి చెందిన వారే కావడంతో.. తాజాగా వచ్చిన రాజ్యసభ ఎంపీ స్థానాన్ని ఇతర వర్గానికి కేటాయించడం ఆయన రాజకీయ పరిణతికి నిదర్శనం. రాజకీయాల్లో కేవలం సమీకరణాలకే పరిమితం కాకుండా, పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందనే బలమైన భరోసాను ఆయన ఈ నిర్ణయం ద్వారా క్యాడర్‌కు పంపారు.ఈ సామాజిక సమతుల్యతపై పవన్ కల్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో పార్టీ కోసం పనిచేసి, ప్రస్తుతం పార్టీలో లేని జేడీ లక్ష్మినారాయణ లాంటి నేతలను ఆయన ప్రస్తావిస్తూ.. ఒకవేళ ఆయన ఇప్పుడు పార్టీలో ఉండి ఉంటే కచ్చితంగా ఈ రాజ్యసభ అవకాశం ఆయనకే ఇచ్చి ఉండేవాడినని ఓపెన్‌గా ప్రకటించారు. ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అంతరార్థం ఒక్కటే.. పార్టీ కోసం నిలబడే వారి విషయంలో తాను కులమతాల పట్టింపులను అస్సలు చూడనని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. కేవలం ఒకే కులం ముద్ర పడకుండా, సర్వమానవ సమానత్వం అనే జనసేన ఆశయాలకు అనుగుణంగా ఆయన నడుచుకుంటున్న తీరు విశ్లేషకులను సైతం ఆకర్షిస్తోంది.ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి కేవలం ఐదేళ్ల పరిపాలనకే పరిమితం కాకూడదని, రాబోయే పదిహేనేళ్ల పాటు ఈ బంధం బలంగా కొనసాగాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షిస్తున్నారు. ఈ సుదీర్ఘ రాజకీయ ప్రయాణం సాధ్యం కావాలంటే కేవలం పార్టీ అగ్రనాయకత్వాలు కలిస్తే సరిపోదని, క్షేత్రస్థాయిలో విభిన్న కులాలు, వర్గాల మధ్య సఖ్యత ఏర్పడాలని ఆయన బలంగా నమ్ముతున్నారు. ఈ 'కులాల కలయిక' అనే కాన్సెప్ట్ సక్సెస్ అయితేనే కూటమి సుస్థిరంగా ఉంటుందని, రాష్ట్రంలో శాంతిభద్రతలు, అభివృద్ధి సాధ్యమవుతాయని ఆయన ఒక దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు.రాజకీయంగా ఈ విధమైన సోషల్ ఇంజనీరింగ్ ప్రయోగాలు గతంలో చాలా తక్కువ మంది నేతలే చేశారు. ప్రాంతీయ పార్టీలు సాధారణంగా తమ కోర్ ఓటు బ్యాంక్‌ను దాటి బయటకు రావడానికి సాహసించవు. కానీ పవన్ కల్యాణ్ భవిష్యత్తు రాజకీయాల కోసం ఈ రిస్క్ తీసుకుంటున్నారు. పార్టీ అంతర్గత పదవుల నుంచి, ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల వరకు అన్ని వర్గాలకు, ముఖ్యంగా వెనుకబడిన తరగతులకు , మైనారిటీలకు తగిన ప్రాధాన్యత కల్పించేలా ఆయన ఒక రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకున్నారు.

ఇది కేవలం ఎన్నికల లబ్ధి కోసం చేసిన తాత్కాలిక వ్యూహం కాదని, ఏపీ రాజకీయాల్లో ఒక శాశ్వత మార్పు కోసం వేస్తున్న పునాది అని చెప్పవచ్చు. పవన్ కల్యాణ్ అనుసరిస్తున్న ఈ వైఖరి జనసేన పార్టీని ఒక సరికొత్త లీగ్‌లోకి తీసుకెళ్తోంది. "అధికారాన్ని పంచుతూ అందరినీ కలుపుకుపోతా" అనే స్థాయికి ఆయన ఎదిగారు. కులాల మధ్య ఉన్న అంతరాలను తొలగించి, రాజకీయంగా అందరికీ భాగస్వామ్యం కల్పించాలనే ఆయన ప్రయత్నం ఏ మేరకు సఫలీకృతమవుతుందో రాబోయే రోజుల్లో తేలనుంది.

# గోదారోళ్లు... ఆ మాత్రం ఉండాల్సిందే...

**రాజమండ్రి,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించారు. సిద్ధాంతంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం.. రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విశాఖపట్నం, రాయలసీమ జిల్లాలలో పరిశ్రమలు కోసం భూములు కావాలంటే ఇచ్చేందుకు ముందుకు వస్తారని.. కానీ గోదావరి జిల్లాలలో సెంటు భూమి కూడా ఇచ్చేందుకు అంగీకరించరంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.గోదావరి జిల్లాలలో భూముల ధరలు భారీగా ఉండటంతో భూమిని సేకరించడం కష్టంగా ఉందనే అభిప్రాయాన్ని చంద్రబాబు వ్యక్తం చేశారు. రాయలసీమ, విశాఖ జిల్లాలలో రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తుండటంతో అక్కడికి పరిశ్రమలు వస్తున్నాయని.. గోదావరి జిల్లాలలో భూములు ఇచ్చేందుకు ముందుకు రాకపోవటంతో పరిశ్రమలు తక్కువగా వస్తున్నాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు.ఉభయ గోదావరి జిల్లాలలో భూముల ధరలు ఇంతలా ఉండటానికి అనేక కారణాలు ఉన్నాయి.

వ్యవసాయం, పారిశ్రామికీకరణ, రవాణా సౌకర్యాలు, నగరీకరణ వంటి అంశాలు ఇందుకు ప్రధాన కారణాలు. డెల్టా ప్రాంతంలోని సారవంతమైన నేలలు వ్యవసాయానికి అత్యంత అనుకూలం. దీంతో ఇక్కడి రైతులు వరితో పాటుగా చేపలు, రొయ్యల సాగు వంటి ఆక్వాకల్చర్ వైపు ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. వాణిజ్య పంటలు బాగా పండే కారణంగా గోదావరి జిల్లాలలో భూములకు మంచి డిమాండ్ ఉంటుంది. ఆక్వా సాగు ద్వారా లాభాలు గడిస్తూ ఉండటంతో ఇక్కడి రైతులు భూములు అమ్మేందుకు ఆసక్తి చూపించరు. అలాగే ఈ జిల్లాల మీదుగా జాతీయ రహదారులు, రైల్వేలైన్లు ఉండటంతో వీటికి ఆనుకుని ఉన్న భూముల ధరలకు కూడా రెక్కలు వచ్చాయి.ఇక కాకినాడ, ఏలూరు, రాజమండ్రి, భీమవరం, అమలాపురం, పాలకొల్లు వంటి పట్టణాలు క్రమంగా విస్తరిస్తూ ఉండటటంతో.. ఈ ఏరియాల్లో రియల్ ఎస్టేట్ బూమ్ పెరుగుతోంది. ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడిన వారు.. తిరిగి ఇక్కడ పెట్టుబడులు పెడుతూ ఉండటం కూడా భూముల ధరలు పెరగడానికి కారణమని నిపుణులు చెప్తున్నారు.

# గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ చోరీ

**హైదరాబాద్ (భారత శక్తి)**గచ్చిబౌలి హిల్ రిడ్జ్ విల్లా లో నివాసం ఉంటున్న వ్యాపారవేత్త ఇంట్లో సుమారు 1 కేజీ బంగారు ఆభరణాలు వజ్రాలను నేపాల్ గ్యాంగ్ ఎత్తుకెళ్లింది. ఇంట్లో పనిచేసే నేపాల్కు చెందిన భార్యాభర్తలు ప్రధాన అనుమానితులుగా పోలీసులు భావిస్తున్నారు. నెల రోజుల క్రితమే వ్యాపారవేత్త వీరిని పనిలో పెట్టుకున్నారు. కొద్దిరోజుల క్రితం యజమాని కుటుంబం ముంబైకి వెళ్లి,ఆదివారం తిరిగి వచ్చేసరికి నేపాలీ దంపతులు మాయం అయ్యారు, ఇంట్లో తాళాలు పగలగొట్టినట్లు ఎలాంటి గుర్తులు లేకపోవడంతో మొదట వారు చెప్పకుండా వెళ్లిపోయారని వ్యాపార వేత్త భావించారు. పూజా గదిలోని విగ్రహానికి ఉన్న బంగారు గొలుసు, తదుపరి జరిపిన తనిఖీల్లో మరికొన్ని ఆభరణాలు మాయమైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసారు. పోలీసులు సిసిటివి (అఊఎ) ఫుటేజ్ ను పరిశీలిస్తున్నారు. రంగంలోకి దిగిన ప్రత్యేక దర్యాప్తు బృందాలు,నిందితుల కోసం గాలిస్తోన్నాయి. .

# అనకాపల్లి జిల్లాలో 'రియల్' బూమ్ షురూ

**విశాఖపట్టణం(భారత శక్తి) :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా జిల్లాల వారీగా అభివృద్ధిపై ఫోకస్ పెట్టింది. ఆయా రంగాల వారీగా ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ జిల్లాలకు పరిశ్రమలు, కంపెనీలను తీసుకొచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తోంది. రాష్ట్రంలో ఇండస్ట్రియల్ హబ్‌లను ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం.. పారిశ్రామిక ప్రగతితో నగరాలు, పట్టణాలతో పాటుగా పల్లె ప్రాంతాల రూపురేఖలు మార్చే ప్రణాళికల్ని సిద్ధం చేస్తోంది. కూటమి ప్రభుత్వ ప్రయత్నాలతో రాష్ట్రానికి పరిశ్రమలు వస్తుండటంతో.. జిల్లాల్లో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంటోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలోని అనకాపల్లి జిల్లా పారిశ్రామిక ప్రగతి వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఒకప్పుడు బెల్లం, చెరకు, మామిడికి ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లా ఇప్పుడు పరిశ్రమలను ఆకర్షించడంలో ముందంజలో ఉంది. ఆర్ఎస్ఎల్ఆర్ మిట్టల్, వారీ ఎనర్జీస్, లారస్ ల్యాబ్స్, బ్లూజెట్ హెల్త్‌కేర్ లిమిటెడ్, లిథియం అయాన్ సెల్ ఫ్యాక్టరీ తదితర కంపెనీలు అనకాపల్లి జిల్లాలో ఏర్పాటవుతున్నాయి. ఆర్ఎస్ఎల్ఆర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభం కావడంతోపాటు.. నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడటంతో ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోంది.అనకాపల్లి జిల్లాలోని పరవాడ, అచ్యుతాపురంలో అపార్ట్‌మెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్ల నిర్మాణం ఊపందుకుంది. ఎస్ రాయవరం, నక్కపల్లి, యలమంచిలి, పాయకరావుపేట మండలాల్లో స్థిరాస్థి రంగం ఇటీవలి కాలంలో బాగా పుంజుకుందని చెబుతున్నారు. గతంలో అనకాపల్లి జిల్లాలో ఎకరం భూమి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉండేదని.. ఇప్పుడు ఎకరా రూ.కోటి వరకు పలుకుతోందని టాక్ వినిపిస్తోంది. విశాఖపట్నం తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనకాపల్లి జిల్లావైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలువురు వ్యాపారులు అనకాపల్లి జిల్లాలో స్థలాల కొనుగోలుపై ఫోకస్ పెట్టినట్లు చెబుతున్నారు. నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటవుతున్న ఆర్ఎస్ఎల్ఆర్ మిట్టల్ ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాల్లో స్థలాలకు గిరాకీ పెరిగిందంటున్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతంలో భూముల ధరలు మరింత పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటు వల్ల భూములకు డిమాండ్ పెరగడంతో ఇటీవల కాలంలో ఈ జిల్లాలో రిజిస్ట్రేషన్లు కూడా భారీగా పెరిగాయి.అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లి నుంచి భోగాపురం వరకు సెమీ రింగ్ రోడ్డు కూడా సిద్ధమవుతోంది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే గంటన్నరలోనే భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లొచ్చు. సెమీ రింగ్ రోడ్డు రాకతో అనకాపల్లి జిల్లా మరింత అభివృద్ధి చెందడం ఖాయమంటున్నారు. అనకాపల్లి జిల్లాలో ఏర్పాటైన, త్వరలోనే రాబోతున్న పరిశ్రమలకు ఎయిర్‌పోర్టు అనుసంధానం వరంగా మారనుంది. అంతే కాకుండా తుని, పాయకరావుపేట సమీపంలో ఎయిర్ స్ట్రిప్ ప్లాన్ చేస్తున్నారు. అనకాపల్లి - పాయకరావు పేట జాతీయ రహదారి వెంట చిన్న చిన్న వ్యాపారాలు మొదలయ్యాయి. విశాఖపట్నంతో అనకాపల్లి జిల్లాకు రోడ్డు అనుసంధానం కూడా పెరగడం కూడా కలిసి వస్తుందని భావిస్తున్నారు. అనకాపల్లి, నక్కపల్లి, పరవాడ, పాయకరావుపేట ప్రాంతాలు పెట్టుబడికి అనుకూలమని కొందరు స్థిరాస్థి రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ ప్రారంభమైతే ఇక్కడ స్థలాల రేట్లు మరింత పెరుగుతాయని.. అనకాపల్లి మెగా స్టీల్ సిటీగా మారబోతుందని అంచనా వేస్తున్నారు.రాబోయే రోజుల్లో మరికొన్ని పరిశ్రమలు రాబోతున్నాయని.. భవిష్యత్తులో నక్కపల్లి మండలం పరిశ్రమలకు కేంద్రంగా మారబోతుందని భావిస్తున్నారు. ఒకప్పుడు అనకాపల్లి ప్రాంత ప్రజలు ఉపాధి కోసం విశాఖపట్నం వెళ్లేవారు.. పరిశ్రమల ఏర్పాటుతో అనకాపల్లి జిల్లాలోనే భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావడంతోపాటు.. విశాఖ డివిజన్ పరిధిలోకి వెళ్లిన అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి రైల్వే స్టేషన్‌లను కూడా అభివృద్ధి చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా నుంచి చెరుకు, మామిడి పంట ఎగుమతి అవుతున్నాయి. అలాగే యలమంచిలి, పాయకరావుపేటలో మామిడి తాండ్ర కుటీర పరిశ్రమతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సమీపంలోనే మంచినీటి సరస్సు ఉండటంతో పర్యావరణ పరంగానూ అభివృద్ధి జరుగుతోంది.పరవాడ, అచ్యుతాపురంలో పెద్ద ఎత్తున అపార్ట్‌మెంట్లు, ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. అనకాపల్లి విశాఖపట్నానికి దాదాపు 40 కిలో మీటర్ల దూరంలో ఉంది.. గంటలోపే విశాఖపట్నం నుంచి అనకాపల్లి చేరుకోవచ్చు. రాబోయే రోజుల్లో విశాఖపట్నం, అనకాపల్లి జంట నగరాలుగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే అనకాపల్లిలోని కొన్ని ప్రాంతాలు విశాఖపట్నంలో కలిసిపోయాయి. రాబోయే రోజుల్లో పరిశ్రమలతో పాటుగా ఐటీ కంపెనీలను అనకాపల్లి వరకు విస్తరించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. ఈ కారణాలతో అనకాపల్లి జిల్లాలో రియల్ బూమ్ మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. దీంతో చాలామంది ముందు చూపుతో అక్కడ భూములు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

# కాసులు కురిపిస్తున్న కందులు...

**కర్నూలు,(భారత శక్తి)** నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి.. రైతులు ఖరీఫ్ సాగు కోసం సిద్ధమయ్యారు. ఈ ఏడాది రాయలసీమ రైతులు ఎక్కువశాతం కందిని సాగు చేయాలని చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అధిక విస్తీర్ణంలో వేరుశెనగ సాగు కోసం విత్తనాల పంపిణీకి సిద్ధమైంది. వేరుశెనగ మొత్తం 2.20 లక్షల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ లక్ష్యం పెట్టుకున్నారు. రాష్ట్రంలో కంది విత్తనాలను 6,172 క్వింటాళ్లు రాయితీపై అందిస్తోంది.. ఈ విత్తనాలు లక్ష ఎకరాల వరకు సరిపోతుందని అంచనా వేస్తున్నారు. కంది విత్తనాలు కిట్స్ రూపంలో ఇస్తే మరో 50వేల ఎకరాలకు అదనంగా సరిపోతాయి. రాయలసీమలో పదేళ్ల క్రితం 2.75 లక్షల ఎకరాలున్న కంది సాగు.. 2025లో 5.59 లక్షల ఎకరాలకు పెరిగింది. వేరుశెనగ విషయానికి వస్తే పదేళ్ల క్రితం 22.58 లక్షల ఎకరాలు ఉంటే.. 2025లో 5 లక్షల ఎకరాలకు పడిపోవడం గమనార్హం.వాస్తవానికి రాయలసీమలో వేరుశెనగను అధికంగా సాగు చేస్తుంటారు. ఏకంగా 20 లక్షల ఎకరాల్లో సాగుచేసేవారు.. కానీ ఆ తర్వాత క్రమంగా సాగు తగ్గుతూ వచ్చింది. వేరుశెనగ సాగు చేయాలంటే పెట్టుబడి రైతులకు భారంగా మారింది. దీనికి తోడు ప్రతికూల వాతావరణ పరిస్థితులు, గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు వేరశెనగ సాగుపై ఆసక్తిగా ఉండటం లేదు. గతేడాది కేవలం 5 లక్షల ఎకరాలకు పరిమితమైందంటే పరిస్థితిన అర్థం చేసుకోవచ్చు. వేరుశెనగ వర్షాధారంగా సాగు చేస్తే రైతుకు ఎకరాకు రూ.35 వేల వరకు ఖర్చవుతోంది. దిగుబడి 2.50 క్వింటాళ్ల నుంచి 4 క్వింటాళ్ల వరకు ఉంటోందని చెబుతున్నారు. వర్షాలు పెరిగినా, అసలు వర్షాలు లేకపోయినా దిగుబడి సరిగా ఉండటం లేదు.. తెగుళ్ల బెడద తప్పడం లేదు.రాయలసీమ రైతులు వేరుశెనగ సాగుకు బదులుగా కంది సాగుపై ఆసక్తిగా ఉన్నారు. రాయలసీమలో 2025 ఖరీఫ్‌లో ఏకంగా 5.59 లక్షల ఎకరాల్లో కంది సాగు చేశారు. వేరుశెనగతో పోలిస్తే కంది సాగుకు పెట్టుబడి తక్కువ.. ఎకరా కంది సాగుకు పెట్టుబడి సగటున రూ.20 వేల నుంచి రూ.25 వేలు అవుతోంది. ఎకరాకు 5 క్వింటాళ్లు దిగుబడి వచ్చినా రూ.40వేలు ఆదాయం వస్తోందని చెబుతున్నారు. కొంతమంది రైతులకు ఎకరాకు 9 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కంది క్వింటాకు రూ.8,450 పలకడంతో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కందిలో పంటకాలం ఎక్కువగా ఉండే రకాల్ని 30% రాయితీపై ఎకరాకు 4 కిలోల చొప్పున రైతులకు అందిస్తోంది. దాదాపు 150 రోజులకు పంట వస్తుందని చెబుతున్నారు. రైతులు మాత్రం ప్రైవేట్ కంపెనీల విత్తనాల్ని కొనుగోలు చేస్తున్నారు.. ఇవి పంటకాలం తక్కువ ఉంటాయంటున్నారు. ఈ విత్తనాలు కిలో రూ.200 వరకు ఉంటాయి.. ఎకరాకు 6 కిలోల విత్తనాలు సరిపోతాయి. ప్రభుత్వం తక్కువ పంటకాలం ఉండే విత్తనాలపై రాయితీ ఇవ్వాలని కోరుతున్నారు

# అందుబాటులోకి భోగాపురం ఎయిర్ పోర్ట్

**శ్రీకాకుళం(భారత శక్తి)** మరో నెల రోజుల్లో ఉత్తరాంధ్ర ప్రజల కల సాకారం కానుంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించ బడునుంది. ఎప్పటికీ ప్రైవేటు ఎయిర్లైన్స్ తమ సర్వీసులను భోగాపురం నుంచి ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాయి. దాదాపు ప్రపంచ ప్రఖ్యాత ప్రైవేట్ ఎయిర్లైన్స్ తమ సర్వీస్ లను నడపనున్నాయి. కానీ విశాఖ తో పాటు నగరం అనుసంధానంగా ఉండే ప్రాంతాల నుంచి భోగాపురం ఎయిర్పోర్ట్ కు ప్రయాణ భారం కానుంది. అంతర్గత రహదారులు ఉన్నా.. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తేనే రవాణా ఇబ్బందులు తొలుగుతాయి. లేకుంటే చాలా ఇబ్బందికరమే. 50 కిలోమీటర్ల రోడ్డు మార్గంలో రవాణాకు రెండు గంటల సమయం పట్టి అవకాశం ఉంది. విశాఖ నగరం నుంచి భోగాపురం ఎయిర్పోర్ట్ కు మూడు నుంచి నాలుగు మార్గాలు ఉన్నాయి. అయితే ట్రాఫిక్ సమస్య దృష్టిలో ఏ మార్గంలో వెళ్లిన గంటన్నరకు పైగా సమయం పట్టి అవకాశం ఉంది. దీనిపై అధికార యంత్రాంగం కూడా అధ్యయనం చేసినట్లు తెలుస్తోంది. విశాఖ నగరం నుంచి భోగాపురం ఎయిర్ పోర్టుకు ప్రధానంగా హనుమంతవాక, ఎండాడ, పీఎం పాలెం, మధురవాడ, కొమ్మాది, మారికవలస, అనంతపురం మీదుగా భోగాపురం వెళ్లాలంటే కచ్చితంగా 1.50 గంటల సమయం పట్టనుంది.అనకాపల్లి నుంచి భోగాపురం చేరుకోవాలంటే 80 కిలోమీటర్లు ప్రయాణించాలి. గంటన్నరలోగా చేరుకోవచ్చు. దానికి కారణం జాతీయ రహదారి ఉండడమే. 16వ నెంబర్ జాతీయ రహదారి ఉంది. అనకాపల్లి నుంచి ఎన్ హెచ్ 16 బైపాస్ మీదుగా ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేరుకోవచ్చు.. స్టీల్ ప్లాంట్ నుంచి బయలుదేరాలి అనుకుంటే.. విశాఖ నగరానికి టచ్ చేయకుండా లంకెలపాలెం, సబ్బవరం మీదుగా ఎన్హెచ్ 16 ఎక్కి ఆనందపురం నుంచి భోగాపురం వెళ్లడానికి 1. 40 గంటల సమయం పడుతుంది. గాజువాక నుంచి కూడా అంతే..

విశాఖ నగరవాసులు భీమిలి మీదుగా చేరుకోవాలి అనుకున్నా గంటన్నర సమయం పడుతుంది హనుమంతువాక నుంచి అడవివరం, ఆనందపురం మీదుగా భోగాపురానికి 1.40 గంటల సమయం పట్టి అవకాశం ఉంది. అయితేభో గాపురం ఎయిర్పోర్ట్ కు ప్రత్యేకంగా రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కఠిన ఆంక్షలు అమలు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే విఎంఆర్డిఏ ఏడు రహదారులను ప్రతిపాదించింది. వాటిని అందుబాటులోకి తెస్తే కానీ.. భోగాపురం ఎయిర్పోర్ట్ కు ప్రయాణభారం తప్పదు.

# అయ్యన్న వారసులకు లైన్ క్లియర్

**శ్రీకాకుళం (భారత శక్తి)** ఏపీలో ఇప్పుడు అందరి దృష్టి నర్సీపట్నం నియోజకవర్గం పై పడింది. అక్కడ టిడిపి నుంచి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ గా కూడా ఉన్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో తప్పుకుంటానని అయ్యన్నపాత్రుడు పలుమార్లు ప్రకటించారు. ఇటీవల తిరుమల శ్రీవారిని దర్శించుకుని కూడా ఇదే మాట చెప్పారు. వయసు రీత్యా అయ్యన్నపాత్రుడు క్రియాశీలక రాజకీయాలకు దూరం కావడం ఖాయం. ఎందుకంటే స్పీకర్ లాంటి గౌరవప్రదమైన, రాజ్యాంగబద్ధ పదవి అనుభవిస్తుండడంతో ఆయన పొలిటికల్ గా రిటైర్మెంట్ అవుతారు. అయితే ఆయన తరువాత నర్సీపట్నం నుంచి ఎవరు పోటీ చేస్తారు అనేది ఇప్పుడు ప్రశ్న. నిన్నటి వరకు ఆ నియోజకవర్గ బాధ్యతలు చూసేవారు ఆయన కుమారుడు విజయ్. ఇప్పుడు రాజ్యసభకు ఎంపిక కావడంతో మరింత యాక్టివ్ అవుతారు. కానీ నర్సీపట్నం నుంచి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే ఛాన్స్ ఆయనకు లేదు. ఎందుకంటే ఆయన ఆరేళ్లపాటు రాజ్యసభ పదవిలో ఉంటారు. అందుకే ఇప్పుడు నర్సీపట్నంపై పెద్ద చర్చ నడుస్తోంది.అయ్యన్నపాత్రుడు తెలుగుదేశం పార్టీకి అత్యంత వీర విధేయుడు. అదే సమయంలో ముక్కుసూటి మనిషి కూడా. టిడిపి ఆవిర్భావం నుంచి అదే పార్టీలో కొనసాగుతూ వచ్చారు అయ్యన్నపాత్రుడు. ఎన్ని పార్టీల నుంచి ఆహ్వానం వచ్చినా ఆయన మాత్రం వెళ్లలేదు. పార్టీ కష్ట కాలంలో ఉంటే సైలెంట్ గా ఊరుకోలేదు కూడా. తనలోనున్న ఫైర్ బ్రాండ్ ఎప్పటికీ తగ్గలేదు. అయితే తండ్రి మాదిరిగానే దూకుడుగా ఉండేవారు విజయ్. అదే ఆయనకు కలిసి వచ్చింది. రాజ్యసభ సభ్యుడిగా ఎంపిక చేసేందుకు దోహద పడింది. సుదీర్ఘకాలం ఐటీడీపీకి సేవలు అందించారు విజయ్. ఈ క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కేసులతో వెంటాడిన భయపడలేదు. వచ్చే ఎన్నికల్లో నర్సీపట్నం నుంచి విజయ్ పోటీ చేస్తారని అంతా ప్రచారం నడిచింది. కానీ ఇప్పుడు రాజ్యసభకు ఎంపిక కావడంతో అయ్యన్న వారసుడు ఎవరు అనేది ప్రశ్న.2029 ఎన్నికల నాటికి విజయ్ తన రాజ్యసభ పదవిని మూడేళ్ల పాటు పూర్తి చేసుకుంటారు. అప్పటికి మూడేళ్ల సమయం ఉంటుంది ఆయనకు. అయితే రాజ్యసభకు రాజీనామా చేసి టిడిపి అభ్యర్థిగా బరిలో దిగుతారా? ఆ రాజ్యసభ పదవికి వేరొకరికి ఇస్తారా అనేది తెలియాల్సి ఉంది. పోనీ విజయ్ కాకుంటే ఇతర నేతలకు టికెట్ ఇస్తామంటే.. అయ్యన్న కుటుంబానికి కాదని టిడిపి శ్రేణులు ఆదరించే అవకాశమే లేదు. అయితే అయ్యన్నపాత్రుడు రెండో కుమారుడు రాజేష్ ఉన్నారు. ప్రస్తుతం నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్ గా వ్యవహరిస్తున్నారు. రాజేష్ ను పోటీలో పెట్టి అయ్యన్నపాత్రుడు తో పాటు విజయ్ గెలిపించుకుంటారన్న టాక్ ఉంది.. మొత్తానికి అయితే అయ్యన్నపాత్రుడు తన పెద్ద కుమారుడిని రాజ్యసభకు పంపించి.. చిన్న కుమారుడిని ఎమ్మెల్యేగా చేసి.. పిల్లలిద్దరి రాజకీయ భవిష్యత్తును చూసి ఆనందిస్తారన్నమాట. కానీ చాలా రాజకీయ కుటుంబాలు ఉన్నాయి కానీ.. అయ్యన్నపాత్రుడు లాంటి అవకాశం ఎవరికీ దక్కదన్న మాట.

# దేవాన్ష్ ఘాట్ కథ వెనుక...

**రాజమండ్రి(భారత శక్తి)** వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. అందుకు సంబంధించి ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నమైంది. ఈ తరుణంలో ఏపీ సీఎం చంద్రబాబు మనవడు దేవాన్ష్ పేరుతో ఒక ఘాట్ వెలుగు చూసింది. సోషల్ మీడియాలో వైరల్ అంశంగా మారింది. దీనిపై మంత్రి లోకేష్ స్పందించారు. తక్షణం తొలగించాలని ఆదేశించారు. దీంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఆ బోర్డును తొలగించారు. అయితే దేవాన్ష్ పేరుతో ఉన్న బోర్డుకు సంబంధించి ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ బోర్డు ఇటీవల ఏర్పాటు చేసింది కాదని? 2015 గోదావరి పుష్కరాల సమయంలోనే ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు.గోదావరి తీరంలో వందలాది ఘాట్లు ఏర్పాటు చేస్తున్నారు ఈసారి. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ముని కూడలిలో ఒక పుష్కర ఘాట్ ఉంది. ఇది దేవాన్ష్ ఘాట్ పేరుతో ఉంది. అయితే ఇప్పటి బోర్డు కాదు అని.. పాత బోర్డు అని చెబుతున్నారు అధికారులు. 2015 లో గోదావరి పుష్కరాలు నిర్వహించిన సమయంలో.. అప్పటి రాజానగరం టిడిపి ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ ఈ ఘాట్ కు దేవాన్ష్ పేరు పెట్టి ఏర్పాటు చేశారు బోర్డు.. నారా లోకేష్, బ్రాహ్మణిలకు 2015 మార్చి 21న జన్మించారు దేవాన్ష్. గోదావరి పుష్కరాలు 2015 జూలై 14 నుంచి 25 వరకు జరిగాయి. అయితే 2015లోనే ఈ బోర్డు ఉందని.. ఇప్పుడు ఏర్పాటు చేసింది కాదు అని అధికారులు తేల్చి చెబుతున్నారు.ఈ పుష్కర ఘాట్ కు సుదీర్ఘ చరిత్ర ఉంది. 1979 పుష్కరాల సమయంలో దీనిని ఏర్పాటు చేశారు. అయితే దేవాన్ష్ పేరుతో ఉన్న ఈ పుష్కర ఘాట్ ను ఆదర్శ ఘాట్ గా తీర్చిదిద్దాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశించారని స్వయంగా రాజానగరం ఎమ్మెల్యే చేసిన కామెంట్స్ వైరల్ అయ్యాయి. జిల్లా కలెక్టర్ సైతం ఈ ఘాట్ ను పరిశీలించారు. మోడల్ ఘాట్ గా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో దేవాన్ష్ ఘాట్ అంటూ వార్త వైరల్ కావడంపై స్పందించారు నారా లోకేష్. వెంటనే ఆ బోర్డు తొలగించే ఏర్పాటు చేశారు.

# 2029 కోసం జనబంధన్ అడుగులు

**న్యూఢిల్లీ (భారత శక్తి)** దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా ప్రతిపక్ష ఇండియా కూటమి రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు, 2029 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఉమ్మడిగా ఎలా ఎదుర్కోవాలనే దానిపై వ్యూహాలను సిద్ధం చేయడానికి ఈ భేటీని ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరగనున్న ఈ ఇండియా జనబంధన్ సమావేశానికి మొత్తం 23 ప్రతిపక్ష పార్టీలు హాజరవుతున్నట్లు కాంగ్రెస్ స్పష్టం చేసింది.

ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ, సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రేలతో పాటు పలు లెఫ్ట్ పార్టీలు, చిన్న పార్టీల నేతలు పాల్గొననున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బలమైన ప్రాంతీయ పార్టీలైన టీఎంసీ (పశ్చిమ బెంగాల్), డీఎంకే (తమిళనాడు) పరాజయం పాలవడంతో కూటమిలో సమీకరణాలు మారాయి. ముఖ్యంగా బెంగాల్‌లో తమ నేతలపై జరుగుతున్న దాడుల అంశాన్ని టీఎంసీ ఇక్కడ లేవనెత్తనుంది.

అలాగే కేరళ ఎన్నికల్లో కాంగ్రెస్-బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందంటూ వచ్చిన ఆరోపణలపై సీపీఐ(ఎం) పార్టీ కాంగ్రెస్ నాయకత్వాన్ని వివరణ కోరనుంది.కూటమిలో భిన్నత్వంలో ఏకత్వం ఉందని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ పేర్కొన్నప్పటికీ, కొన్ని కీలక పార్టీలు ఈ భేటీకి దూరం కావడం గమనార్హం.

ఈ ప్రతిపక్షాల ఐక్యతా రాగానికి గండి కొడుతూ అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ, తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ టీవీకే ప్రభుత్వంలో చేరడంతో డీఎంకే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది. అయితే నిన్ననే మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీలు కేజ్రీవాల్‌తో ప్రత్యేకంగా సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరిపినట్టుగా సమాచారం. కొన్ని పార్టీలు వ్యక్తిగత కారణాల వల్ల రాలేకపోతున్నప్పటికీ, మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడతామని స్పష్టం చేశాయి.

ఈ ప్రతిపక్షాల భేటీపై అధికార బీజేపీ తీవ్రంగా మండిపడింది. కూటమిలోని అంతర్గత లేఖలను ప్రస్తావిస్తూ బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శలు గుప్పించారు.

ఇండియా కూటమికి ఎలాంటి మిషన్ (లక్ష్యం), విజన్ లేవని వారిలో ఉన్నదల్లా కేవలం కన్ఫ్యూజన్, డివిజన్, పరస్పర ఆరోపణలు, పదవుల కోసం ఆరాటం మాత్రమేనని ఆయన ఎద్దేవా చేశారు. ఏదేమైనప్పటికీ, దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి జాతీయ అంశాలపై ఉమ్మడి ముఖచిత్రాన్ని ప్రదర్శించేందుకు ప్రతిపక్షాలు ఈ వేదికను వాడుకోనున్నాయి.

## రైతులకు నాణ్యమైన విత్తనాలనే అందించాలి


### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 09 (భారత శక్తి) రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం సాయంత్రం సోన్ మండల కేంద్రంలోని బాలకిషన్ ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని ఎరువులు విత్తనాల స్టాక్, క్రయ విక్రయాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. రిజిస్టర్ లలోని వివరాలను ఆన్లైన్ వివరాలతో సరిపోల్చారు. క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డులన్నీ పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రికార్డుల్లో తేడాలు ఉండరాదన్నారు. పలు కంపెనీల విత్తనాల లేబుళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎట్టి పరిస్థితుల్లో నకిలీ విత్తనాలను అమ్మరాదని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని అన్నారు. రైతుల నుంచి విత్తనాలు, ఎరువులకు నిర్దేశించిన ధర కన్నా ఎక్కువ డబ్బులు వసూలు చేయరాదని చెప్పారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. ఎరువులు విత్తనాల కృత్రిమ కొరత సృష్టించినా, నకిలీవి అమ్మినా, అధిక ధరకు అమ్మినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంతకుముందు డిసిఎంఎస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అందివ్వాలని అన్నారు. ఈ తనిఖీలలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, తహసిల్దార్ సంతోష్, వ్యవసాయ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ-ప్రైమరీ పోస్టుల దరఖాస్తు గడువు జూన్ 10 వరకు పొడిగింపు

### - ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 09:(భారత శక్తి ) ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో జిల్లాలో ఎంపిక చేసిన 74 పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులను ప్రారంభించనున్నట్లు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఈ పాఠశాలల్లో ఇన్స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ గడువును జూన్ 10 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని గడువు పెంపు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసిన అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 12న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు పొడిగించిన గడువులోపు దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

## అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 09: కామారెడ్డి జిల్లాలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడం, ప్రతి చిన్నారికి విద్యను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా నిర్వహిస్తున్న బడి బాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. మంగళవారం రామారెడ్డి మండలంలోని ఎస్సీ కాలనీ లో నిర్వహించిన బడి బాట కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, ఇంటింటి ప్రచారం ద్వారా పాఠశాల వయస్సు కలిగిన పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాలుగు సంవత్సరాలు పూర్తి చేసిన చిన్నారులకు ప్రీ-ప్రైమరీ తరగతుల్లో, అలాగే ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అడ్మిషన్లు నమోదు చేయడం జరిగింది. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థులను కూడా గుర్తించి నమోదు చేపట్టడం జరిగిందని అన్నారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ సమావేశమై ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. పాఠశాల వయస్సు కలిగిన ప్రతి చిన్నారి తప్పనిసరిగా పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే డ్రాప్‌అవుట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

ఈ సందర్భంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యే సమాజాభివృద్ధికి పునాదిగానిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం, త్వరలో ప్రారంభం కానున్న అల్పాహార పథకం, డిజిటల్ విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందాలి.

### -విద్యార్థులందరికీ నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులు కల్పించాలి:జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 09 (భారత శక్తి )ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులందరికీ కార్పొరేట్ స్థాయి విద్యను అందించడంతోపాటు మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పాఠశాలలు త్వరలో పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం విద్యాశాఖ అధికారులతో కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించే విధంగా విద్యాబోధన సాగాలని సూచించారు. ఇప్పటికే మండలాలకు పాఠ్యపుస్తకాల పంపిణీ దాదాపు పూర్తయిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాలను మరింత మెరుగుపర్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అన్ని విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి పాఠశాలలు, వసతి గృహాలు, వంటశాలలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని పేర్కొన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతున్నందున, వసతి గృహాల్లో నిల్వ ఉన్న ఆహార పదార్థాల గడువు తేదీలను పరిశీలించి, నాసిరకం లేదా గడువు ముగిసిన సరుకులు వినియోగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యమైన భోజనాన్ని అందించడంలో మెస్ కమిటీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ భోజన ప్రమాణాలు, ఆహార పదార్థాల నాణ్యతను మెస్ కమిటీ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. స్టోర్ రూమ్‌లలో కూరగాయలు, ఇతర వస్తువులను సక్రమంగా భద్రపరచాలని తెలిపారు. వంట సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలని, తప్పనిసరిగా మాస్కులు, ఏప్రాన్‌లు, తల టోపీలు ధరించాలని ఆదేశించారు. వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడంతో పాటు వంటశాలల్లో మిగిలిన ఆహారం, చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించి పరిశుభ్ర వాతావరణం కల్పించాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు వసతి గృహాల్లో ఏఎన్ఎంలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు దయానంద్, అంబాజీ, శ్రీనివాస్, ఎంఈఓలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను పరిశీలించిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 09: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిర్వహించే త్రైమాసిక తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, యంత్రాల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గోదాం తాళాల భద్రత, సీసీటీవీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక పరికరాలు, భద్రతా సిబ్బంది విధులు, రిజిస్టర్ తదితర అంశాలను తనిఖీ చేశారు. గోదాంలో భద్రపరిచిన యంత్రాల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, గోదాం ఇన్‌ఛార్జులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

## గీతంలో 'తల్లి పేరిట మొక్క' మొక్కలు నాటిన గీతం ఉన్నతాధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు




సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జూన్ 9: దేశవ్యాప్త 'తల్లి పేరిట ఒక మొక్క' (ఏక్ పేడ్ మా కే నామ్) చొరవలో భాగంగా, హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ ప్రచారం, పర్యావరణ సుస్థిరత, జీవావరణ స్పృహను ప్రోత్సహిస్తూ, తమ తల్లుల గౌరవార్థం ఒక మొక్కను నాటమని పౌరులను ప్రోత్సహిస్తోంది. విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు- (గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్) వివిధ గీతం స్కూళ్ల అధిపతులు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చని, ఆరోగ్యకరమైన భవిష్యత్తును సృష్టించడం పట్ల గీతం యొక్క నిబద్ధతను ఈ చొరవ పునరుద్ఘాటించింది. వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో, జీవవైవిధ్యాన్ని పెంపొందించడంలో, సుస్థిర జీవనాన్ని ప్రోత్సహించడంలో మొక్కలు నాటడం యొక్క ప్రాముఖ్యతను ఇందులో పాల్గొన్న ఉన్నతాధికారులు నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమం ప్రకృతి పట్ల శ్రద్ధ, పోషణ, బాధ్యత వంటి విలువలను ప్రతిబింబిస్తూ, తల్లులకు ఒక ప్రతీకాత్మక నివాళిగా కూడా నిలిచింది. మొక్కల పెంపకం కార్యక్రమం, సుస్థిరత, సామాజిక బాధ్యతను ప్రోత్సహించడానికి గీతం హైదరాబాదు చేస్తున్న నిరంతర ప్రయత్నాలకు ఒక నిదర్శనంగా నిలుస్తుంది. ఇది పర్యావరణ పరిరక్షణ, దేశ నిర్మాణానికి అర్థవంతంగా తోడ్పడేలా గీతం సిబ్బందిని ప్రేరేపిస్తోంది.

## నిర్మల్‌లో మెగా జాబ్ మేళా.. యువతకు ఉద్యోగావకాశాలు.

నిర్మల్, జిల్లా ప్రతినిధి, జూన్ 09(భారత శక్తి ) జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ఈ నెల 12న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సంస్థ వరుణ్ మోటార్స్ వివిధ పోస్టుల భర్తీ కోసం ఈ జాబ్ మేళాలో పాల్గొననుంది. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, నిర్మల్‌లో జూన్ 12వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళా ద్వారా ట్రెయినీ టెక్నీషియన్, ట్రెయినీ సర్వీస్ అడ్వైజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ట్రూ వాల్యూ ఈవాల్యుయేటర్స్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. మొత్తం 210 ఖాళీలను భర్తీ చేయనుండగా, ఐటీఐ డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, ఎస్ఎస్‌సీ పాస్ లేదా ఫెయిల్, డిప్లొమా, బీటెక్ (మెకానికల్/ఆటోమొబైల్), ఏదైనా డిగ్రీ, ఎంబీఏ విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎంపికైన అభ్యర్థులకు పోస్టును బట్టి నెలకు రూ.13,000 నుంచి రూ.17,000 వరకు వేతనం అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాన్ని లేదా 9652707401, 91856578292 నంబర్లను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

## డీఏపీ అధిక ధరలకు విక్రయం.. డీలర్ లైసెన్స్ సస్పెండ్

### నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 09(భారత శక్తి) రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఎరువులను అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా హెచ్చరించారు. భైంసా పట్టణంలో డీఏపీ ఎరువులను నిర్ణీత ధర కంటే ఎక్కువకు విక్రయించిన ఘటనపై వ్యవసాయ శాఖ అధికారుల నివేదిక ఆధారంగా సంబంధిత డీలర్ లైసెన్సును సస్పెండ్ చేసినట్లు ఆయన సోమవారం వెల్లడించారు. వానాకాలం సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ క్రమంలో కొందరు వ్యాపారులు డీఏపీ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో తనిఖీలు నిర్వహించామని చెప్పారు. విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన మరో నలుగురు ఎరువుల డీలర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసి తాఖీదులు ఇచ్చినట్లు వెల్లడించారు. రైతుల నుంచి అధిక ధరలు వసూలు చేయడం, ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత సృష్టించడం, నకిలీ విత్తనాల విక్రయం, బిల్లులు ఇవ్వకుండా అమ్మకాలు జరపడం వంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం సహించదని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని ఎరువుల దుకాణాలు, విత్తన విక్రయ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని, ఎవరైనా అధిక ధరలకు విక్రయించినా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణే ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, ఎరువులు, విత్తనాల సరఫరాలో అక్రమాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

## మైనర్ బాలికపై వేధింపుల కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు.

### రూ.5వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు సంచలన తీర్పు



రాజన్న సిరిసిల్ల, భారత శక్తి, జూన్ 9: గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 5వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ మంగళవారం సంచలన తీర్పు వెల్లడించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపిన వివరాల ప్రకారం... గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గోరింటాల గ్రామానికి చెందిన కోటగిరి శ్రీనివాస్ అనే వ్యక్తి ఒక మైనర్ బాలికను వేధింపులకు గురిచేశాడు. బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంభీరావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి ఈ కేసుపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, సీఎంఎస్ కానిస్టేబుల్ నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెలలు బాధితురాలి తరఫున 15 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ బలమైన వాదనలు వినిపించారు. శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడు కోటగిరి శ్రీనివాస్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుంచి తప్పించుకోలేరని, ఇలాంటి కఠిన శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పేర్కొన్నారు. పోలీసులు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో పనిచేసి నిందితుడికి శిక్ష పడేలా చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన అదనపు ఎస్పీ చంద్రయ్య, అప్పటి డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ప్రస్తుత డీఎస్పీ నాగేంద్రచారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy